PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....




ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 215, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 25 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## బెంగాల్‌పై గౌతమ్ అదానీ వరాల జల్లు.. లక్ష కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు




2035 నాటికి వివిధ రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ వెల్లడి

కోల్‌కతా సమీపంలో రూ. 4,000 కోట్లతో 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రికి శంకుస్థాపన

ఆసుపత్రిలో 50% పడకలు పేదలకు కేటాయించి ఉచిత వైద్యం అందిస్తామని హామీ

## అభివృద్ధి ఒక మానవ హక్కు.. సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఐరాసలో భారత్




అభివృద్ధి హక్కుపై ఐరాసలో భారత్ కీలక ప్రకటన

సమ్మిళిత అభివృద్ధి, అంతర్జాతీయ సహకారానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి

అభివృద్ధి హక్కుపై కొత్త ఒప్పందానికి భారత్ పూర్తి మద్దతు




## విశాఖను ముంచెత్తిన భారీ వర్షం.. 24 సెం.మీ. వర్షపాతం

- కళింగపట్నం వద్ద తీరందాటిన వాయుగుండం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో దంచికొడుతున్న వర్షాలు
- విశాఖలో ప్రధాన రహదారుల జలమయం

అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కళింగపట్నం వద్ద తీరం దాటింది.

## భారీ వర్షాలు.. జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు




- వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు ఏ అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదన్న చంద్రబాబు
- లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశం
- ఆహారం, మంచినీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్న సీఎం

అమరావతి: ఏపీలో తీవ్ర వాయుగుండం

# కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

### కాకినాడ జిల్లాలో భారీ వర్షాలపై కలెక్టర్‌తో ఫోన్‌లో సమీక్షించిన పవన్ కల్యాణ్

- వర్షాలు తగ్గే వరకు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- జిల్లాలో 1,885 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- పిఠాపురం సుద్దగడ్డ వాగు, ఉప్పాడ తీర ప్రాంత పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా
- నష్టపోయిన వారికి తక్షణం పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచన




అమరావతి: తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మిగతా 2 లో




## స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిగా సిద్ధం కావాలన్న జగన్

ఎన్నికలపై పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని ఆదేశం

# 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### డిసెంబరు 7-9 తేదీల్లో గ్లోబల్ సమిట్‌కు ప్రచారం




- గ్లోబల్ సమిట్‌పై అంతర్జాతీయ రోడ్‌షోలు
- సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశాం
- సమిట్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

హైదరాబాద్: డిసెంబరు 7-9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమిట్‌కు ప్రచారం కోసం తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న దేశాల్లో అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఏ దేశంలో ఏ రంగం నుంచి మిగతా 2 లో

# ఉపాధ్యాయులపై దాడి చేసిన వారితో జగన్.. మీరెవరి వైపు?

### టీచర్లపై దాడి చేసిన వారు జగన్‌తో ఉన్నారన్న లోకేశ్

- నిందితుల ఫొటోలను సోషల్ మీడియాలో విడుదల చేసిన మంత్రి
- పలువురు రౌడీషీటర్ల పేర్లు బహిర్గతం
- తాను టీచర్ల వైపు, జగన్ రౌడీల వైపు అని వ్యాఖ్య




అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రౌడీషీటర్లకు మధ్య సంబంధాలు ఉన్నాయంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన పలువురు రౌడీషీటర్లు జగన్‌తో కలిసి ఉన్న ఫొటోలను ఆయన మిగతా 2 లో




## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు పేర్లు ఖరారు

- వరంగల్ విమానాశ్రయానికి 'రాణి రుద్రమ'.. ఆదిలాబాద్‌కు 'కొమరం భీం' పేర్లు!
- ప్రభుత్వ నిర్ణయానికి త్వరలో కేబినెట్ ఆమోదముద్ర
- ఎయిర్‌పోర్టుల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి
- చరిత్ర ఉట్టిపడేలా కొత్త డిజైన్లు రూపొందించాలని ఆదేశం

# విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి

### రాష్ట్రోంలో ప్రస్తుత అవసరాలకు తగినట్లు విద్యుత్ కొనుగోలు చేయాలి

- పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని ఎందుకు దూరంగా నిర్మించారు
- సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయి
- రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలి
- యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో చర్చించాలి




దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి సూచించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి తో కలిసి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి మిగతా 2 లో

## పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు నీటిని తీసుకువెళ్తుంటే... రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను ఎండబెడుతున్నారు




- "ఆంధ్రాలో క్రాప్‌హాలిడే లేదు. తెలంగాణలో మాత్రమే ఉంది
- ఎల్‌నినో వల్ల కాదు... కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరవు
- కాంగ్రెస్ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరవు
- కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకుంటూ, కమీషన్ మేనేజ్‌మెంట్‌లో ఆరితేరింది
- శ్రీశైలంలో 96 టీఎంసీల నీరు ఉంది

## బెంగాల్‌పై గౌతమ్ అదానీ వరాల జల్లు..
# లక్ష కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు

ఢిల్లీ: ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. 2035 నాటికి రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ గురువారం ప్రకటించారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఈ పెట్టుబడులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్‌లో 2,000 పడకల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో గౌతమ్ అదానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి హాజరయ్యారు. రాష్ట్రంలో అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌ను తూర్పు భారతదేశంలో తమ 'కర్మభూమి'గా అభివర్ణించారు. ఈ రాష్ట్రాన్ని కేవలం ఒక పెట్టుబడి కేంద్రంగానే కాకుండా, తాము సేవ చేయాలనుకుంటున్న, భాగం కావాలనుకుంటున్న ప్రదేశంగా చూస్తున్నామని అన్నారు. పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుదుత్పత్తి, పంపిణీ, జాతీయ రహదారులు, రోడ్లు, వంతెనల నిర్మాణం, డేటా సెంటర్ల ఏర్పాటు వంటి కీలక రంగాల్లో ఈ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించారు. ఇక 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి ప్రాజెక్టు కోసం సుమారు రూ. 4,000 కోట్లు వెచ్చించనున్నారు. ఇది పూర్తిగా లాభాపేక్ష లేని సంస్థగా పనిచేస్తుందని అదానీ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని మొత్తం 2,000 పడకల్లో 50 శాతం, అంటే 1,000 పడకలను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోసం కేటాయిస్తామని, వారికి పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇదే ప్రాంగణంలో ఒక మెడికల్ కాలేజీ, రీసెర్చ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలనే ప్రణాళిక ఉందని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం రాష్ట్ర ఆరోగ్య రంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## అభివృద్ధి ఒక మానవ హక్కు..
# సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఐరాసలో భారత్

ఢిల్లీ: అభివృద్ధి అనేది ప్రతి మనిషికి ఉన్న విడదీయరాని మానవ హక్కు అని, దాన్ని సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఐక్యరాజ్యసమితి (ఐరాస) వేదికగా భారత్ మరోసారి స్పష్టం చేసింది. సమ్మిళిత అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం, బహుపాక్షిక సంస్కరణల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఈ మేరకు 'అభివృద్ధి హక్కుపై ఒప్పందాన్ని' వీలైనంత త్వరగా ఆమోదించాలని భారత్ మద్దతు తెలిపింది. ఐరాస సర్వప్రతినిధి సభలో 'అభివృద్ధి హక్కు ప్రకటన' 40వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ దేశాలు) సిబి జార్జ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత జాతీయ ప్రకటనను వినిపిస్తూ, దేశం వైఖరిని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ధ్రువీకరించారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం.. ఈ అభివృద్ధి హక్కు అనేది ప్రతి వ్యక్తి, ప్రజలందరూ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధిలో పాలుపంచుకోవడానికి, తోడ్పడటానికి, ఆ ఫలాలను ఆస్వాదించడానికి అధికారం కల్పిస్తుంది. దీని ద్వారానే అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛలు పూర్తిగా సాకారం అవుతాయి. గత 40 ఏళ్లలో ఈ ప్రకటన స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా సుస్థిర అభివృద్ధి, పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో గణనీయమైన పురోగతి నమోదైంది. కోట్లాది మంది ప్రజలు తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారు. అయినప్పటికీ, ఈ అభివృద్ధిలో చాలా అసమానతలు ఉన్నాయని, పురోగతి అందరికీ సమానంగా చేరలేదని ఐక్యరాజ్యసమితి ఒక ప్రకటనలో పేర్కొంది. అనేక దేశాలు తమ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న వ్యవస్థాగత అడ్డంకులను, నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో 40వ వార్షికోత్సవం ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, అందరికీ మరింత సమ్మిళిత, సమానమైన భవిష్యత్తును అందించడానికి ఒక ముఖ్యమైన అవకాశమని ఐరాస అభిప్రాయపడింది.

# భారీ వర్షాలు.. జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు

అమరావతి: ఏపీలో తీవ్ర వాయుగుండం కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సహాయక చర్యలు, ముందస్తు ప్రాణ నష్ట నివారణ చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వాతావరణం పూర్తిగా అనుకూలించి వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఏ ఒక్క అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదని సూచించారు. జలాశయాలు, నదుల్లో పెరుగుతున్న నీటిమట్టాలను, ఇన్-ఫ్లోలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులదేనని తేల్చి చెప్పారు. వరద ముంపునకు గురైన బాధితులకు నాణ్యమైన ఆహారం, మంచినీరు, అత్యవసర వైద్య సదుపాయాలు మరియు మందులు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. అంతేకాకుండా, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టంపై కచ్చితమైన అంచనాలు రూపొందించి నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా నిలుస్తుందనే నమ్మకం కలిగించాలని కలెక్టర్లకు తేల్చి చెప్పారు.

## విశాఖను ముంచెత్తిన భారీ వర్షం.. 24 సెం.మీ. వర్షపాతం

అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కళింగపట్నం వద్ద తీరం దాటింది. దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వేకువజాము నుంచి పడుతున్న వర్షాలకు విశాఖపట్నం నగరం జలదిగ్బంధంలో చిక్కుకోగా, రికార్డు స్థాయిలో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విశాఖ ఎయిర్‌పోర్టు రన్‌వే పరిసరాల్లో 18 సెం.మీ, కాకినాడ, విజయనగరంలో 13 సెం.మీ, కళింగపట్నం, తునిల్లో 5 సెం.మీ మేర వర్షపాతం రికార్డయింది. విశాఖలోని ప్రధాన రహదారులు జలమయం కావడంతో ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. డ్రైనేజీలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వాయుగుండం తీరం దాటినప్పటికీ భూభాగంపై ప్రభావం కొనసాగుతుండటంతో రాగల కొన్ని గంటల్లో ఉత్తరాంధ్రలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. జీవీఎంసీ, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపడుతుండగా, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు పేర్లు ఖరారు

హైదరాబాద్: వరంగల్‌లోని మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లు ఖరారు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు కాకతీయ రాణి రుద్రమదేవి పేరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆదివాసీ యోధుడు కొమురం భీం పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు ఫైలును కేబినెట్ సమావేశం ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ పేర్లపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త విమానాశ్రయాలకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెట్టిన తరహాలోనే, తెలంగాణ చారిత్రక వైభవాన్ని, వీరుల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే, ఈ పేర్లను ఖరారు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ పంపనున్నారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అయితే, మామునూరు ఎయిర్‌పోర్టుకు సమ్మక్క-సారలమ్మ పేరు కూడా పరిశీలనలో ఉందని, దీనిపై త్వరలోనే స్పష్టత రానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

డిజైన్లపై సీఎం అసంతృప్తి

ఇదే సమీక్షలో విమానాశ్రయాల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అధికారులు చూపిన డిజైన్లను చూసి "ఇవి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) డిజైన్లా? లేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో చేసినవా?" అని ప్రశ్నించినట్లు తెలిసింది. విమానాశ్రయాల నిర్మాణం అద్భుతంగా, తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఉట్టిపడేలా ఉండాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సీఎం సూచనల మేరకు అధికారులు ఇప్పుడు కొత్త డిజైన్లను సిద్ధం చేసే పనిలో పడ్డారు. త్వరలోనే తుది డిజైన్లను మళ్లీ సీఎంకు సమర్పించనున్నారు.

## ఉపాధ్యాయులపై దాడి చేసిన వారితో జగన్..
# మీరెవరి వైపు?: లోకేశ్



అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రౌడీషీటర్లకు మధ్య సంబంధాలు ఉన్నాయంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన పలువురు రౌడీషీటర్లు జగన్‌తో కలిసి ఉన్న ఫొటోలను ఆయన బుధవారం రాత్రి తన 'ఎక్స్' ఖాతాలో విడుదల చేశారు. వైసీపీ నిర్వహించిన ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న హింసకు సంబంధించిన వీడియోలను కూడా ఆయన ఈ సందర్భంగా పంచుకున్నారు. పణుగంటి చైతన్య, ఎస్. సందీప్, ఆవుటు శ్రీనివాసరెడ్డి, బంకా అరుణ్ సహా పలువురి పేర్లను లోకేశ్ ప్రస్తావించారు. దాడికి పాల్పడిన వారు జగన్‌తో కలిసి ఉన్న చిత్రాలను ఆయన సాక్ష్యాలుగా పోస్ట్ చేశారు. జగన్ రౌడీషీటర్ల పక్షాన నిలవగా, తాను మాత్రం ఉపాధ్యాయులు, క్రీడాకారుల పక్షాన నిలబడ్డానని లోకేశ్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల వైపు ఉండాలో, రౌడీల వైపు ఉండాలో ప్రజలే తేల్చుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

అమరావతి: తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు.గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంట నష్టం, మత్స్యకారుల భద్రత వంటి పలు కీలక అంశాలపై పవన్ కళ్యాణ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలగా వాటిని తక్షణం తొలగించామని కలెక్టర్ వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 1,885 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం అంతా అదుపులోనే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, వరద ముప్పు, సహాయక చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. "జిల్లాలో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలి. అవసరమైన చోట తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి" అని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం కలగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా పంపుల సహాయంతో ఎప్పటికప్పుడు డీ-వాటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈదురు గాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం గమనిస్తూ, అవసరమైతే దిగువ ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించాలని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయాలని, ఆ నివేదికను ప్రభుత్వానికి పంపి రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఆస్తి నష్టం జరిగిన బాధితులకు కూడా తక్షణ సహాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిధిలోని సుద్దగడ్డ వాగు ముంపు ప్రాంతాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని కోరారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున, ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు మత్స్యకారులెవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠినమైన హెచ్చరికలు అమలు చేయాలన్నారు. జిల్లాలో పరిస్థితి తిరిగి సాధారణ స్థితికి వచ్చేంత వరకు యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి ప్రజలకు అండగా నిలవాలని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## 2047 నాటికి తెలంగాణను
## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్: డిసెంబరు 7-9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమిట్‌కు ప్రచారం కోసం తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న దేశాల్లో అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఏ దేశంలో ఏ రంగం నుంచి పెట్టుబడులు రావడానికి అవకాశాలున్నాయో అధ్యయనం చేసి, దానికనుగుణంగా రోడ్‌షోల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సచివాలయంలో గ్లోబల్ సమిట్ సన్నాహక సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... "ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో ప్రపంచస్థాయి సదస్సు ఇది. దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలి. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశాం. ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారు. సమిట్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. వార్‌రూం ద్వారా రోజూ సాయంత్రం పనుల పురోగతిని తనిఖీ చేయాలి" అని సూచించారు. బతుకమ్మ పండగ ప్రాశస్త్యం, తెలంగాణ సంప్రదాయాలు, ఇక్కడి ప్రత్యేక వంటకాలు తెలియజేసేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించడానికి ఇదొక అద్భుత అవకాశమని పేర్కొన్నారు.

## పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు
# నీటిని తీసుకువెళ్తుంటే...
## రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను ఎండబెడుతున్నారు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకొంటూ, కమీషన్ మేనేజ్‌మెంట్‌లో ఆరితేరిందని... వాటర్ మేనేజ్‌మెంట్‌లో విఫలమైందని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. ఎల్‌నినో వల్ల కాదు... కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన హరీశ్‌రావు భారాస జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. "ఆంధ్రాలో క్రాప్‌హాలిడే లేదు. తెలంగాణలో మాత్రమే ఉంది. శ్రీశైలంలో 96 టీఎంసీల నీరు ఉంది. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో రోజుకు 4 వేల క్యూసెక్కుల నీటిని తీసుకునే అవకాశం ఉన్నా.. 3 మోటార్లతో రోజుకు 8 గంటలే నడుపుతున్నారు. దీంతో 800 క్యూసెక్కుల నీరు మాత్రమే వినియోగించుకునే పరిస్థితి ఏర్పడింది. పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు 800 కి.మీ. దూరాన ఉన్న కుప్పానికి నీటిని తీసుకువెళ్తుంటే... రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను ఎండబెడుతున్నారు. 365 రోజులూ దేవాదుల మోటార్లు నడిపేలా భారాస ప్రభుత్వం సమ్మక్క బ్యారేజీని కట్టింది. అక్కడా రోజుకు 8 గంటలే నీటిని ఎత్తిపోస్తున్నారు.

నల్గొండను ముంచింది ఉత్తమ్‌కుమారే..

నల్గొండను ముంచి ఆంధ్రాకు మూడో పంట కోసం పులిచింతల కట్టింది ఉత్తమ్‌కుమార్‌రెడ్డే. కృష్ణా నీటిలో 34 శాతం వాటా వినియోగించుకునే అవకాశం ఉన్నా పూర్తిస్థాయిలో వాడుకోవడం లేదు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు క్రాప్ హాలిడే ఎందుకు ఇచ్చారు? నల్గొండ, ఖమ్మం, పాలమూరు జిల్లాలకు అన్యాయం చేస్తున్నారు. ఏడాదికి 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరిస్తామని అసెంబ్లీలో చెప్పి...ఇప్పటికి 2 లక్షల ఎకరాలకైనా ఇచ్చారా? పాలమూరు ఎత్తిపోతల పథకంలో భారాస ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చుచేసి నార్లాపూర్, ఏదుల, కర్వెన, వట్టెం రిజర్వాయర్లను కట్టింది. ప్యాకేజీ-3లో సున్నపుతండా నుంచి తెల్లరాళ్లపల్లి వరకు ఉండే కాలువలో మిగిలిన 33 లక్షల క్యూబిక్ మీటర్ల పనిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేయలేదు. దీంతో రిజర్వాయర్లలో నీటిని నింపే పరిస్థితి లేకపోయింది" అని హరీశ్‌రావు వివరించారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్: దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి సూచించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి తో కలిసి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై ఈ సందర్భంగా అధికారులను ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి జీ-9 గ్రేడ్ బొగ్గు అవసరమని అధికారులు వివరించారు. సింగరేణిలో జీ 9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ 9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని అధికారులు తెలిపారు. జీ- 9 గ్రేడ్ బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతపై ఆధారపడిన యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ఎలా నిర్మించారని ముఖ్యమంత్రి , డిప్యూటీ సీఎం గారు అధికారులను ప్రశ్నించారు. పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని ఎందుకు దూరంగా నిర్మించారని అడిగారు. ఈ కేంద్రానికి బొగ్గు సరఫరా చేయడం వల్ల రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని అధికారులను ప్రశ్నించారు. అప్పట్లో రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్‌పై కాకుండా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం దూరంగా నిర్మించారని అధికారులు తెలిపారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని చెప్పారు. సింగరేణి నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గుకు ఉన్న అవకాశాలపై ముఖ్యమంత్రి గారు ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ-9 గ్రేడ్ బొగ్గును సింగరేణి నుంచి సరఫరా చేయలేదని అధికారులు వివరణ ఇచ్చారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని సమావేశంలో అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి గారు, ఉప ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల పథకాల పంపులకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. అన్ని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుత అవసరాలకు తగినట్లు విద్యుత్ కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు గారితో పాటు ఇంధన శాఖ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సింగరేణి కాలరీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలకు జరుగుతున్న కష్టాలు, మోసాలను ప్రతి గడప వద్దకూ వెళ్లి వివరించాలని కేడర్‌కు సూచించారు. వైసీపీ హయాంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రభుత్వం అధికార బలంతో పాటు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ అనేక అడ్డదారులు తొక్కుతుందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలాంటి కుట్రలు ఎదురైనా తట్టుకునేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, రీజినల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం: యారాకు లోకేశ్ ఆహ్వానం

పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్-అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్‌కు ఏపీ అనువైనది

ప్రముఖ పారిశ్రామిక సంస్థ గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామితోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గోద్రెజ్ అనుబంధ సంస్థ అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించాలని సూచించారు.

దీనికి రాకేశ్ స్వామి స్పందిస్తూ, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఇప్పటికే భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని గుర్తుచేశారు. గత ఏడాది నవంబర్‌లో ఏపీలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్లతో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ద్వారకా తిరుమల మండలంలో రూ.210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని స్వామి హామీ ఇచ్చారు.

ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: శాప్ (సాప్)తో భేటీ

జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ శాప్ (సాప్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఒక 'డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు సాప్ నైపుణ్యాలు, సర్టిఫికేషన్ అందించేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని సూచించారు. దీనిపై చనానా స్పందిస్తూ, భారత్‌లో శాప్ ల్యాబ్స్ తమకు రెండవ అతిపెద్ద ఆర్‌డీ హబ్ అని, బెంగళూరులో 15 వేల సీట్లతో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులకు సాంకేతిక సేవలు అందిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

స్టార్టప్‌ల ప్రోత్సాహానికి భాగస్వాములు కండి: మాస్టర్‌కార్డ్‌కు లోకేశ్ విజ్ఞప్తి

గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్)లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ, భారత్‌లో పూణేలో తమకు అతిపెద్ద టెక్ హబ్ ఉందని, ఏపీ టూరిజం అథారిటీతో ఇప్పటికే ఎంఓయూ ఉందని గుర్తుచేశారు. తాజా ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

వైద్య పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి: అబాట్‌కు ఆహ్వానం

అమెరికాకు చెందిన ప్రముఖ మెడికల్ డివైసెస్, ఫార్మా సంస్థ అబాట్ ఇండియా ఎండీ ఇస్తేయాక్ అంజాద్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలోని మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్) లేదా ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లో వైద్య పరికరాలు లేదా డయాగ్నోస్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జెనరిక్ మందుల తయారీ కేంద్రాన్ని, విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని కోరారు. దీనిపై అంజాద్ స్పందిస్తూ, భారత్‌లో తమకు గోవా, గుజరాత్‌లలో తయారీ కేంద్రాలున్నాయని, స్థానిక ఫార్మా సంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

ఏపీలో ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీ ఏర్పాటు చేయండి: సిస్కోతో లోకేశ్ భేటీ

గ్లోబల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్ కృష్ణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ లేదా జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు. హరీశ్ కృష్ణన్ స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వంతో తమకు ఇప్పటికే బలమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. 50 వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ, విశాఖలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ), ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వహించామని తెలిపారు. చెన్నైలోని తయారీ ప్లాంట్ ద్వారా 1 బిలియన్ డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని చెప్పారు.

వివో కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయండి

చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్‌తోనూ లోకేశ్ సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్స్ హబ్‌గా ఎదుగుతున్న తిరుపతిలో వివో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వివో సరఫరాదారుల కోసం ప్రత్యేకంగా ఒక 'కాంపోనెంట్స్ తయారీ పార్క్' అభివృద్ధి చేయాలని, దీనికోసం ప్రభుత్వంతో కలిసి 'సప్లై చైన్ సమావేశం' నిర్వహించాలని సూచించారు. అర్జిత్ సేన్ స్పందిస్తూ, దేశంలో విక్రయించే ఫోన్లలో 99% పైగా గ్రేటర్ నోయిడాలోనే తయారు చేస్తున్నామని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం మీద, మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయడమే లక్ష్యంగా సాగింది. పలు దిగ్గజ సంస్థల నుంచి సానుకూల స్పందన రావడంతో, భవిష్యత్తులో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# పాపికొండలు జాతీయ ఉద్యానవనం

## - గోదావరి ఒడిలో పాపికొండల అరణ్యం

ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: ( మాధవరావు యెగినాటి, "నేటి శుభోదయ" తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కో ఆర్డినేటర్ ) ::: గోదావరి నది పర్వతాలను చేరుకున్న చోట ప్రకృతి తన భౌగోళిక రూపాన్ని ఒక ప్రత్యేక శైలిలో ఆవిష్కరించింది. నది ప్రవాహానికి ఇరువైపులా ఎత్తైన కొండలు, వాటి మధ్య లోతైన లోయలు, కొండల వాలువులపై విస్తరించిన అరణ్యాలు, రాళ్లను తాకుతూ ముందుకు సాగే జలధారలు కలిసి ఒక విశిష్టమైన ప్రకృతి దృశ్యాన్ని నిర్మించాయి. ఆ దృశ్యానికి పేరు పాపికొండలు. గోదావరి తన ప్రవాహంలో పాపికొండల కొండశ్రేణిని ఛేదిస్తూ సాగే ప్రాంతంలో ఏర్పడిన ఈ ప్రకృతి వ్యవస్థే పాపికొండలు జాతీయ ఉద్యానవనం. తూర్పు కనుమల ఉత్తర భాగంలో విస్తరించిన ఈ ఉద్యానవనం భౌగోళిక వైవిధ్యం, అరణ్య సంపద, నదీ వ్యవస్థ, జీవవైవిధ్యాల సమ్మేళనంగా నిలుస్తుంది. బోటనికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన 2024 అధ్యయనం ప్రకారం, ఉద్యానవనం సుమారు 1,012.86 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో, సముద్రమట్టానికి సుమారు 150 నుంచి 1,350 మీటర్ల ఎత్తు పరిధిలో విస్తరించి ఉంది. పాపికొండలు తూర్పు కనుమలలోని ఒక ప్రత్యేక పర్వత భూభాగం. భారత ద్వీపకల్ప తూర్పు అంచున ఉత్తర--దక్షిణ దిశలో విస్తరించిన తూర్పు కనుమలు పశ్చిమ కనుమల మాదిరిగా ఒక నిరంతర పర్వత గోడలా కనిపించవు. అనేక కొండ సముదాయాలు, పీఠభూములు, లోయలు, నదీ లోయలతో ఏర్పడిన విస్తృత భౌగోళిక వ్యవస్థగా అవి విస్తరించాయి. పాపికొండల కొండశ్రేణి ఈ ఉత్తర తూర్పు కనుమలలో ఒక ముఖ్యమైన భాగం. ఇక్కడి పర్వతాలు, లోయలు, నదీ ప్రవాహాలు పరస్పరం కలిసిన తీరు ఒక ప్రత్యేక పర్యావరణ భౌగోళికాన్ని సృష్టించింది. తూర్పు కనుమల ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన లక్షణం దాని భౌగోళిక వైవిధ్యం. రాతి నిర్మాణాలు, కొండ వాలువులు, ఎత్తైన ప్రాంతాలు, లోతైన లోయలు, నదీ గార్జ్‌లు కలిసి అనేక సూక్ష్మ ఆవాసాలను ఏర్పరుస్తాయి. ఒక కొండ వాలుపై సూర్యకాంతి ఎక్కువగా పడే ప్రాంతం కనిపిస్తే, దాని ఎదురువైపు తేమను ఎక్కువగా నిలుపుకునే నీడ ప్రాంతం కనిపిస్తుంది. ఒక లోయలో నీటి ప్రవాహం నిరంతరంగా కొనసాగుతుంటే, మరొక వాలుపై వర్షపు నీరు చిన్న ప్రవాహాలుగా మారి దిగువ ప్రాంతాలకు చేరుతుంది. ఈ చిన్నచిన్న భౌగోళిక భేదాలే వృక్షజాలంలో వైవిధ్యాన్ని, జంతుజాలంలో ఆవాస భేదాలను రూపొందిస్తాయి.పాపికొండల ప్రకృతి స్వరూపాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే గోదావరి నదితో దాని సంబంధాన్ని చూడాలి. ద్వీపకల్ప భారతదేశంలోని అతి పెద్ద నదీ వ్యవస్థలలో గోదావరి ఒకటి. మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ ప్రాంతంలో జన్మించిన ఈ నది తూర్పు దిశగా సుమారు 1,470 కిలోమీటర్లు ప్రయాణించి ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో బంగాళాఖాతాన్ని చేరుతుంది. ఇంద్రావతి, ప్రాణహిత, శబరి, సీలేరు, కిన్నెరసాని వంటి ఉపనదులు గోదావరి జలవ్యవస్థను మరింత విస్తరించాయి. పాపికొండల ప్రాంతంలోకి ప్రవేశించిన తరువాత గోదావరి పర్వతాల మధ్య సుమారు 50 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తూ ప్రత్యేకమైన నదీ--అరణ్య భూదృశ్యాన్ని నిర్మిస్తుంది. గోదావరి పాపికొండల మధ్య ప్రవహించే తీరు ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన భౌగోళిక రూపాన్ని ఇచ్చింది. నది వంపులు తిరుగుతూ పర్వతాలను అనుసరిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో కొండలు నదికి చేరువగా వచ్చి ఇరువైపులా గోడల్లా నిలుస్తాయి. మరికొన్ని చోట్ల నది విస్తరించి ఇసుక మేటలు, సహజ నదీతీర భూభాగాలను ఏర్పరుస్తుంది. పెద్ద రాళ్లు, బండరాళ్ల సమూహాలు, చిన్న ప్రవాహాలు, నదీతీర వృక్షజాలం కలిసి గోదావరి పరిసరాలకు ప్రత్యేకమైన రూపాన్ని అందిస్తాయి. ఈ నదీ ప్రవాహం పాపికొండల భూభాగాన్ని రెండు ప్రధాన భాగాలుగా విభజించే సహజ రేఖలా కూడా పనిచేస్తుంది. పరిశోధనల్లో గోదావరి నది ఉద్యానవనాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించే ముఖ్యమైన జీవభౌగోళిక సరిహద్దుగా పేర్కొనబడింది. నదికి ఇరువైపులా ఉన్న భూభాగాల్లో ఆవాస పరిస్థితులు, వృక్ష నిర్మాణం, జీవుల సంచారం వంటి అంశాల్లో సహజమైన భేదాలు ఏర్పడతాయి. గోదావరి పాపికొండల జీవనాడిగా నిలవడానికి మరో కారణం దాని ఉపనదులు, వాగులు, చిన్న జలధారలు. పర్వతాలపై కురిసిన వర్షం కొండ వాలువుల వెంట కదులుతూ చిన్న ప్రవాహాలుగా మారుతుంది. అవి పరస్పరం కలిసి పెద్ద వాగులుగా, చివరకు గోదావరి నదిలో కలిసే జలవ్యవస్థగా రూపుదిద్దుకుంటాయి. బోటనికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనం ప్రకారం పాపికొండలలోని అనేక ప్రవాహాలు అక్కడి అరణ్య వృక్షజాలానికి తేమను అందిస్తూ, ప్రాంతాన్ని సమృద్ధమైన జీవావరణంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములవుతున్నాయి. వర్షపు నీరు పర్వతాల నుంచి వేగంగా దిగిపోకుండా అరణ్య నేల, ఆకుల పొర, వేర్ల వ్యవస్థ కొంత నీటిని నిలుపుకుంటాయి. నేలలోకి చొచ్చుకుపోయిన నీరు క్రమంగా బయటకు వచ్చి చిన్న ప్రవాహాలకు జీవం అందిస్తుంది. అరణ్యం, నేల, వర్షం, వాగు, నది మధ్య ఏర్పడే ఈ సహజ జలచక్రం పాపికొండల పర్యావరణ వ్యవస్థకు పునాది. అరణ్య ప్రాంతంలో చెట్ల సాంద్రత, నేలలోని సేంద్రియ పదార్థం, వర్షపు నీటి నిల్వ సామర్థ్యం కలిసి నదీ పరివాహక ప్రాంతాన్ని జీవంతో ఉంచుతాయి.పాపికొండల అరణ్య నిర్మాణంలో తేమతో కూడిన ఆకురాల్చే అరణ్యాలు ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తాయి. వాటితో పాటు అర్ధ సతతహరిత, పొడి ఆకురాల్చే అరణ్య ప్రాంతాలు కూడా కనిపిస్తాయి. ఈ వృక్ష నిర్మాణ వైవిధ్యం ఎత్తు, వర్షపాతం, నేల స్వభావం, నీటి లభ్యత వంటి అంశాలతో ముడిపడి ఉంటుంది. ఛాంపియన్ --సెత్ వృక్ష వర్గీకరణ ఆధారంగా నిర్వహించిన అధ్యయనాలు పాపికొండలలో దక్షిణ ఉష్ణమండల మిశ్రమ తేమతో కూడిన ఆకురాల్చే అరణ్యాలు, అర్ధ సతతహరిత అరణ్యాలు, పొడి ఆకురాల్చే అరణ్యాల సమ్మేళనాన్ని నమోదు చేశాయి. ఈ అరణ్యంలో టెర్మినాలియా, టీక్, డాల్బెర్జియా, పెట్రోకార్పస్, అనోజిసస్ వంటి వృక్ష జాతులకు ప్రాధాన్యం ఉంది. నదీతీర ప్రాంతాల్లో నీటిని ఇష్టపడే వృక్షజాలం, కొండ వాలువుల్లో వేర్వేరు ఆకురాల్చే అరణ్య సముదాయాలు, తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మరింత దట్టమైన వృక్ష నిర్మాణం కనిపిస్తాయి. బోటనికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన ఫ్లోరా అధ్యయనం పాపికొండలలో 970 ట్యాక్సా, 576 జాతులు/జెనరా మరియు 119 కుటుంబాలకు చెందిన పుష్పించే మొక్కల వైవిధ్యాన్ని నమోదు చేసింది. పాపికొండల భూభాగంలో ఎత్తు పెరుగుతున్న కొద్దీ ప్రకృతి రూపం కూడా మారుతుంది. లోయ ప్రాంతాల్లో నదీ ప్రభావిత వృక్షజాలం కనిపిస్తే, కొండల వాలువులపై ఆకురాల్చే అరణ్యాలు విస్తరిస్తాయి. మరింత ఎత్తైన ప్రాంతాల్లో వాతావరణం, నేల, తేమ పరిస్థితులకు అనుగుణంగా వృక్ష నిర్మాణంలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ ఎత్తుల మార్పు జీవవైవిధ్యానికి విస్తృత అవకాశాన్ని కల్పిస్తుంది. పాపికొండలలో నమోదైన వృక్షజాతుల సంఖ్య కూడా ఈ ఆవాస వైవిధ్యానికి ఒక సూచిక.వాతావరణ పరంగా పాపికొండల ప్రాంతం ఉష్ణమండల రుతుపవన ప్రభావిత వాతావరణాన్ని కలిగి ఉంటుంది. నైరుతి రుతుపవన కాలంలో వర్షపాతం పెరుగుతుంది. వర్షాలు పర్వత వాలువులను తడిపి చిన్న ప్రవాహాలకు జీవం అందిస్తాయి. వర్షాకాలం అనంతరం అరణ్య నేలలో నిలిచిన తేమ, నదీ ప్రవాహాలు, లోయలలోని సూక్ష్మ వాతావరణ పరిస్థితులు జీవజాతులకు అనుకూల వాతావరణాన్ని కొనసాగిస్తాయి. ఎత్తు, భౌగోళిక దిశ, నదికి సమీపం, అరణ్య సాంద్రత వంటి అంశాల ఆధారంగా స్థానిక స్థాయిలో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తాయి.పాపికొండలలో కొండలు--లోయలు--నది--అరణ్యం అనే నాలుగు అంశాలు విడివిడిగా పనిచేసే వ్యవస్థలు కావు. పర్వతాలు మేఘాలను స్వీకరిస్తాయి. వర్షం కొండలను తడుపుతుంది. కొండల నుంచి జలధారలు పుడతాయి. అరణ్యం ఆ నీటిని నేలలో నిలుపుతుంది. ప్రవాహాలు గోదావరిలో కలుస్తాయి. నది తిరిగి నదీతీర జీవావరణాలకు జీవాన్ని అందిస్తుంది. ఈ చక్రం నిరంతరం కొనసాగుతూ పాపికొండల ప్రకృతి స్వరూపాన్ని నిర్మిస్తుంది.గోదావరి తీరంలోని ఇసుక మేటలు, సహజ నదీతీర భూభాగాలు కూడా పర్యావరణపరంగా విలువైనవి. నది ప్రవాహం, నీటి మట్టం, ఋతువుల మార్పులతో వాటి రూపం మారుతుంది. కొన్ని ప్రాంతాలు పక్షులకు ఆహార అన్వేషణ ప్రదేశాలుగా, మరికొన్ని ప్రాంతాలు విశ్రాంతి, గూడు నిర్మాణం వంటి జీవ కార్యకలాపాలకు అనుకూలంగా ఉంటాయి. నదీ ప్రవాహం మరియు అరణ్య భూభాగం కలిసే ఈ ప్రాంతాలను రివరైన్--రిపేరియన్ ఆవాసాలుగా పరిగణిస్తారు. పాపికొండల గోదావరి తీర ప్రాంతాలపై నిర్వహించిన పక్షుల అధ్యయనం ఈ నదీ ఆవాసాల ప్రాధాన్యాన్ని ప్రత్యేకంగా నమోదు చేసింది. పాపికొండల భూభాగం ప్రకృతి సౌందర్యంతో పాటు శాస్త్రీయ అధ్యయనానికి కూడా విశేషమైన ప్రదేశం. తూర్పు కనుమల ఉత్తర భాగంలో మిగిలిన సమగ్ర అరణ్య ప్రాంతాల్లో ఇది ఒక ముఖ్యమైన భాగంగా గుర్తించబడింది. పర్వతాల మధ్య ప్రవహించే గోదావరి, దాని ఉపనదులు, అరణ్య వృక్షజాలం, ఎత్తుల వైవిధ్యం, భిన్నమైన సూక్ష్మ ఆవాసాలు కలిసి ఒక సంక్లిష్టమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించాయి. సుదీర్ఘకాలిక సంరక్షణ పద్ధతుల ఫలితంగా పాపికొండల ప్రాంతంలో తూర్పు కనుమలకు ప్రత్యేకమైన అనేక జీవ సముదాయాలు కొనసాగుతున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. పాపికొండల చరిత్రలో సంరక్షణకు కూడా ఒక దీర్ఘ ప్రయాణం ఉంది. ఈ ప్రాంతం తొలిదశలో రిజర్వ్ ఫారెస్ట్‌గా రక్షణ పొందింది. 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా ప్రకటించబడింది. అనంతరం 2008లో జాతీయ ఉద్యానవనంగా హోదా పొందింది. ఈ పరిణామం పాపికొండల అరణ్యాలకు, గోదావరి నదీ పరివాహక ప్రాంతానికి, తూర్పు కనుమల జీవవైవిధ్యానికి మరింత బలమైన సంరక్షణ పునాదిని ఏర్పరచింది. పాపికొండలను ఒకసారి పర్వతాలుగా చూస్తే వాటి ఎత్తు కనిపిస్తుంది. గోదావరి దృష్టితో చూస్తే వాటి మధ్య ప్రవహించే జలజీవితం కనిపిస్తుంది. అరణ్య దృష్టితో చూస్తే వృక్షాల సముదాయం కనిపిస్తుంది. భూగోళ శాస్త్ర దృష్టితో చూస్తే తూర్పు కనుమల పరిణామ చరిత్ర కనిపిస్తుంది. పర్యావరణ శాస్త్ర దృష్టితో చూస్తే ఇవన్నీ పరస్పరం అనుసంధానమైన ఒక సమగ్ర జీవవ్యవస్థగా అవతరిస్తాయి.గోదావరి పాపికొండలను దాటే చోట నది పర్వతాల జలాన్ని, అరణ్యాల తేమను, నదీతీర జీవావరణాల శక్తిని, అనేక జీవరాశుల జీవిత సంబంధాలను తనతో పాటు మోస్తోంది. పాపికొండల కొండలు కూడా నదిని కేవలం చుట్టుముట్టడం లేదు; వర్షాన్ని స్వీకరించి, జలధారలను పుట్టించి, అరణ్యాలకు జీవాన్ని అందించే సహజ జలగోపురాలుగా నిలుస్తున్నాయి.గోదావరి ఒడిలో నిలిచిన పాపికొండలు నది, అరణ్యం, పర్వతం, వర్షం కలిసి నిర్మించిన తూర్పు కనుమల జీవగాథ.

### జీవవైవిధ్యానికి పాపికొండల పచ్చని గర్భం




గోదావరి పాపికొండల మధ్యగా ప్రయాణించే ప్రతి మలుపు వెనుక ఒక కొత్త జీవ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. కొండ వాలువులపై విస్తరించిన తేమతో కూడిన ఆకురాల్చే అరణ్యాలు, లోయల్లోని దట్టమైన వృక్ష సముదాయాలు, నదీతీర ఇసుక మేటలు, రాతి గుట్టలు, చిన్న జలధారలు కలిసి అనేక జీవులకు భిన్నమైన ఆవాసాలను అందిస్తున్నాయి. ఉత్తర తూర్పు కనుమలలోని ఈ విస్తారమైన అరణ్య ప్రాంతం క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు, ఉభయచరాలు, సీతాకోకచిలుకలు, వృక్షజాతుల సమృద్ధితో ప్రత్యేకమైన జీవవైవిధ్య భూభాగంగా నిలిచింది. పాపికొండల క్షీరదాలపై నిర్వహించిన సమగ్ర అధ్యయనంలో 24 కుటుంబాలకు చెందిన 46 జాతులు, మొత్తం 55 క్షీరద జాతులు నమోదు అయ్యాయి. వాటిలో మాంసాహారులు 15 జాతులు, గబ్బిలాలు 13 జాతులు, ఎలుకల వర్గానికి చెందినవి 11 జాతులుగా నమోదయ్యాయి. పాపికొండల అరణ్య జీవజాలంలో పులి అగ్రస్థాయి మాంసాహారిగా ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. దట్టమైన అరణ్యాలు, లోయలు, కొండ వాలువులు, నీటి వనరులు కలిసిన ఈ ప్రాంతం పెద్ద మాంసాహారులకు అవసరమైన విస్తృత ఆవాసాన్ని అందిస్తుంది. పులితో పాటు చిరుత కూడా ఈ అరణ్య వ్యవస్థలో నమోదైన ముఖ్యమైన మాంసాహారి. అడవిలోని ఆహార జంతువుల సమృద్ధి, నీటి లభ్యత, దట్టమైన వృక్షజాలం వంటి అంశాలు వాటి జీవనానికి అనుకూల పరిస్థితులను కల్పిస్తాయి. పాపికొండలలో నమోదైన మాంసాహార వైవిధ్యం ఈ అరణ్యపు ఆహార వల ఎంత విస్తృతంగా ఉందో సూచిస్తుంది. పెద్ద మాంసాహారుల నీడలో మరెన్నో చిన్న మాంసాహారులు తమ స్వంత జీవ ప్రపంచాలను నిర్మించుకున్నాయి. రస్టీ-స్పాటెడ్ క్యాట్, లెపర్డ్ క్యాట్, జంగిల్ క్యాట్, వివిధ సివెట్లు వంటి చిన్న మాంసాహారులు పాపికొండలలో నమోదయ్యాయి. ముఖ్యంగా రస్టీ-స్పాటెడ్ క్యాట్, లెపర్డ్ క్యాట్ ఉనికిని కెమెరా ట్రాప్‌ల ద్వారా శాస్త్రీయంగా నమోదు చేశారు. పాపికొండల వంటి విస్తారమైన అరణ్యాల్లో చిన్న మాంసాహారులు కీటకాలు, ఎలుకలు, చిన్న పక్షులు, సరీసృపాలు వంటి జీవులను ఆహారంగా తీసుకుంటూ ఆహార వలలో కీలకమైన స్థానాన్ని ఆక్రమిస్తాయి. అరణ్యపు శాకాహార ప్రపంచం కూడా విస్తృతంగా ఉంది. గౌర్, చుక్కల జింక, సాంబర్, అడవి పంది, అడవి మేక వంటి వన్యజీవులు కొండల వాలువులు, గడ్డి ప్రాంతాలు, అరణ్య అంచులు, నీటి వనరుల పరిసరాలను ఉపయోగించుకుంటాయి. పెద్ద శాకాహారులు వృక్షజాలాన్ని ఆహారంగా తీసుకుంటూ అరణ్యంలోని శక్తి ప్రవాహంలో కీలక పాత్ర పోషిస్తాయి. అవి సంచరించే దారులు, నీటి వనరులు, మేత ప్రాంతాలు అనేక ఇతర జీవులకు కూడా ఉపయోగపడతాయి. పాపికొండల క్షీరద అధ్యయనంలో పెద్ద శాకాహారులతో పాటు వివిధ పరిమాణాల మాంసాహారులు, గబ్బిలాలు, ఎలుకలు, ప్రైమేట్లు వంటి అనేక జీవ సమూహాలు నమోదయ్యాయి. చతుర్శృంగ మృగం (ఫోర్-హార్న్‌డ్ అంటేలోపే ) వంటి అరుదైన శాకాహారి జాతులకు కూడా ఈ తూర్పు కనుమల అరణ్యాలు ప్రాధాన్యమైన ఆవాసాలను అందిస్తాయి. అడవి నేలపై పెరిగే గడ్డి, చిన్న పొదలు, ఆకులు, పండ్లు, విత్తనాలు వివిధ శాకాహారుల ఆహార అవసరాలను తీర్చుతాయి. పర్వత భూభాగంలోని భిన్న వృక్ష సముదాయాలు ఏడాది పొడవునా ఆహార వనరుల వైవిధ్యాన్ని కొనసాగించడంలో సహకరిస్తాయి. పాపికొండలలోని గోదావరి నదీ తీర ప్రాంతం ప్రత్యేకమైన పక్షి ప్రపంచానికి నిలయం. నది వంపులు, ఇసుక మేటలు, సహజ లెవీలు, రాతిబండల మధ్య ప్రవాహాలు, నదీతీర వృక్షజాలం పక్షులకు విభిన్నమైన ఆహార, విశ్రాంతి, గూడు నిర్మాణ ప్రాంతాలను అందిస్తాయి. వైల్డ్‌లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా పరిశోధకులు 2017--2018 మధ్య గోదావరి నదీ తీర ఆవాసాల్లో నిర్వహించిన అధ్యయనంలో 25 కుటుంబాలకు చెందిన 63 పక్షి జాతులను నమోదు చేశారు. పక్షి ప్రపంచంలో సంరక్షణపరంగా ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన జాతులు ఉన్నాయి. బ్లాక్-బెల్లీడ్ టెర్న్ అంతర్జాతీయంగా ఎండేంజర్డ్ స్థితిలో ఉన్న జాతిగా ఆ అధ్యయనంలో నమోదైంది. పెయింటెడ్ స్టోర్క్ , బ్లాక్ -హెడేడ్ ఐబీస్ , గ్రేట్ థిక్ ని , రివర్ లాపయింగ్ , మలబార్ పైడ్ హార్న్బిల్ , గ్రే హెడేడ్ ఫిష్ ఈగల్ , ఒరింటల్ దర్టర్ వంటి నియర్ త్రీటెనెడ్ జాతులు కూడా అక్కడి నదీతీర ఆవాసాల్లో నమోదయ్యాయి. గోదావరి ఇసుక మేటలు పక్షుల జీవనంలో ప్రత్యేకమైన పాత్ర పోషిస్తాయి. రివర్ లాపయింగ్ వంటి పక్షులు నదిలో ఏర్పడే ఇసుక మేటలను ఉపయోగించుకుంటాయి. చేపలను ఆహారంగా తీసుకునే గ్రే హెడేడ్ ఫిష్ ఈగల్ వంటి పక్షులకు నదీ ప్రవాహం జీవనాధారం. ఒరియంటల్ ధర్టర్ నీటిలో చేపలను వెంబడిస్తుంది. పెయింటెడ్ స్టోర్క్ మరియు ఇతర నీటి పక్షులు నదీతీరంలోని అల్పజల ప్రాంతాల్లో ఆహారం అన్వేషిస్తాయి. ఇలా గోదావరి నది ఒకే సమయంలో అనేక రకాల పక్షుల జీవన అవసరాలను తీర్చే విస్తృత జీవావరణంగా మారుతుంది. పాపికొండల అరణ్యంలో ఎత్తైన చెట్లపై నివసించే పక్షులు కూడా ప్రత్యేకమైనవి. మలబార్ పీడ్ హార్న్‌బిల్ వంటి పక్షులు తూర్పు కనుమల అరణ్య నిర్మాణంతో సన్నిహితంగా అనుసంధానమై ఉన్నాయి. పెద్ద చెట్లలో ఏర్పడే సహజ రంధ్రాలు, దట్టమైన కొమ్మల సముదాయం, పండ్లను అందించే వృక్షాలు వీటి జీవనానికి అవసరమైన వనరులను అందిస్తాయి. పక్షులు పండ్లను తినడం ద్వారా విత్తన వ్యాప్తికి సహకరించడం, కీటకాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా వాటి సహజ జనాభా నియంత్రణలో భాగస్వాములు కావడం వంటి పర్యావరణ సేవలను అందిస్తాయి.పక్షుల ప్రపంచం పగటి వెలుగుతో ముగియదు. సాయంత్రం తరువాత అరణ్యంలో మరో జీవస్వరూపం మేల్కొంటుంది. జెరడోన్స్,నైటజర్ , ఇండియన్ నైటజార్ వంటి రాత్రిచర పక్షులు అరణ్య నేల, పొదలు, తెరచిన ప్రాంతాల మధ్య సంచరిస్తాయి. రాత్రి సమయంలో చురుకుగా కదిలే కీటకాలను ఆహారంగా తీసుకునే ఈ పక్షులు అరణ్యంలోని రాత్రి ఆహార వలలో ప్రత్యేకమైన పాత్రను పోషిస్తాయి. పాపికొండల నదీతీర ప్రాంతాల్లో ఇండియన్ ఈగల్ ఓల్ , బ్లాక్ ఈగల్ వంటి పక్షుల నమోదులు కూడా జరిగాయి. అరణ్యపు మరొక ముఖ్య జీవసంపద సీతాకోకచిలుకలు. ఉత్తర తూర్పు కనుమలలో నిర్వహించిన ఒక విస్తృత సర్వేలో పాపికొండల బఫర్ ప్రాంతం సహా వివిధ ప్రాంతాల నుంచి ఆరు కుటుంబాలకు చెందిన 102 సీతాకోకచిలుక జాతులు నమోదు అయ్యాయి. ఈ అధ్యయనం ఉత్తర తూర్పు కనుమల సీతాకోకచిలుక వైవిధ్యంపై తొలి సమగ్ర జాబితాల్లో ఒకటిగా నిలిచింది. అనేక ముఖ్యమైన కొత్త ప్రాంతీయ నమోదులు కూడా అందులో చోటుచేసుకున్నాయి. సీతాకోకచిలుకలు అరణ్య ఆరోగ్యానికి అందమైన సూచికలుగా నిలుస్తాయి. పుష్పించే మొక్కల లభ్యత, తేమ, ఉష్ణోగ్రత, పొదల నిర్మాణం, వర్షపాతం వంటి అంశాలు వాటి జీవచక్రాన్ని ప్రభావితం చేస్తాయి. గుడ్లు పెట్టడానికి కొన్ని ప్రత్యేక మొక్కలు అవసరం. గొంగళిపురుగులకు మరో రకమైన ఆహార మొక్కలు అవసరం. పెద్ద సీతాకోకచిలుకలకు పుష్పాల నుంచి మకరందం అవసరం. అందువల్ల సీతాకోకచిలుకల వైవిధ్యం వెనుక ఒక విస్తృతమైన వృక్ష--కీటక సంబంధం ఉంటుంది. పాపికొండల సరీసృపాలు, ఉభయచర ప్రపంచం కూడా శాస్త్రీయంగా ఎంతో ఆసక్తికరమైనది. 2025లో జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో పాపికొండల జాతీయ ఉద్యానవనంలో 51 హెర్పటోఫౌనా జాతులు నమోదు అయ్యాయి. వాటిలో 18 ఉభయచరాలు, 21 బల్లులు, 10 పాములు, 2 తాబేళ్లు ఉన్నాయి. మినర్వర్య కళింగ , స్ఫూరోతేకా మాస్కయి , హేమీడక్టీలుస్ కంగేరెంసిస్ అనే మూడు జాతులకు ఆ అధ్యయనం ఆంధ్రప్రదేశ్‌లో తొలి నమోదులను అందించింది. ఈ చిన్న జీవుల జీవితం పాపికొండల జలవ్యవస్థతో బలంగా అనుసంధానమై ఉంటుంది. వర్షపు నీటితో నిండే చిన్న గుంటలు, ప్రవాహాల అంచులు, తేమతో కూడిన ఆకుల పొర, రాతి చీలికలు, నదీతీర ప్రాంతాలు ఉభయచరాలు మరియు సరీసృపాలకు అనుకూలమైన సూక్ష్మ ఆవాసాలను సృష్టిస్తాయి. కప్పలు కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. పాములు కప్పలు, ఎలుకలు, చిన్న పక్షులు వంటి జీవులను ఆహారంగా తీసుకుంటాయి. బల్లులు కీటకాలను నియంత్రిస్తాయి. ఈ చిన్న జీవసంబంధాలన్నీ అరణ్య ఆహార వలలో ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి. పాపికొండల వృక్షజాలం ఈ మొత్తం జీవ ప్రపంచానికి పునాది. బోటనికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన ఫ్లోరా ఆఫ్ పాపికొండలు నేషనల్ పార్క్ , ఆంధ్ర ప్రదేశ్ అధ్యయనం ఈ ప్రాంతంలోని పుష్పించే మొక్కల వైవిధ్యాన్ని విస్తృతంగా నమోదు చేసింది. ఆ పరిశోధనలో 970 ట్యాక్సా, 576 జాతులు/జెనరా, 119 కుటుంబాలకు చెందిన పుష్పించే మొక్కల వైవిధ్యం నమోదు చేయబడింది. ఈ వృక్ష సంపదలో తేమతో కూడిన ఆకురాల్చే అరణ్యాలకు చెందిన అనేక వృక్షాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. టెర్మినాలియా, టీక్, డాల్బెర్జియా, అనేక లెగ్యుమినోసీ వృక్షాలు, నదీతీర వృక్షజాలం, పొదలు, తీగలు, ఔషధ మొక్కలు కలిసి అరణ్యపు బహుళస్థాయి నిర్మాణాన్ని ఏర్పరుస్తాయి. ఎత్తైన వృక్షాల కింద మధ్యస్థాయి చెట్లు, పొదలు, గడ్డి, నేలమీద పెరిగే చిన్న మొక్కలు తమ తమ జీవస్థలాలను ఏర్పరుచుకుంటాయి. ఈ నిలువు నిర్మాణం అనేక జీవులకు వేర్వేరు ఆవాసాలను అందిస్తుంది. ఒక పెద్ద వృక్షం పాపికొండలలో ఒక చిన్న పర్యావరణ వ్యవస్థగా పనిచేస్తుంది. దాని పుష్పాలు తేనెటీగలు, సీతాకోకచిలుకలకు ఆహారం అందిస్తాయి. పండ్లు పక్షులు, కోతులు, ఇతర క్షీరదాలకు ఆహారమవుతాయి. కొమ్మలు పక్షులకు ఆశ్రయం ఇస్తాయి. బెరడు మీద కీటకాలు, లైకెన్లు, శిలీంధ్రాలు జీవిస్తాయి. వేర్లు నేలను పట్టుకుని ఉంచుతాయి. ఆకులు నేలపై చేరి సేంద్రియ పదార్థంగా మారుతాయి. చెట్టు జీవచక్రం ముగిసిన తరువాత కూడా దాని దుంగ అనేక జీవులకు ఆశ్రయంగా నిలుస్తుంది. పాపికొండల జీవవైవిధ్యంలో గోదావరి నది ఒక ప్రత్యేక అనుసంధాన శక్తి. నది పర్వతాల మధ్య ప్రవహిస్తూ నదీతీర అరణ్యాలను, ఇసుక మేటలను, సహజ లెవీలను, రాతి ప్రాంతాలను కలుపుతుంది. నది తీర ప్రాంతాలు పక్షులకు ఆహారం, విశ్రాంతి, గూడు నిర్మాణం వంటి అవసరాలను తీర్చే మార్గాలుగా పనిచేస్తాయి. నదీ ప్రవాహం పర్వత అరణ్యాల నుంచి వచ్చే పోషకాలను దిగువ ప్రాంతాలకు తీసుకువెళ్తుంది. నీటి జీవులు, నదీతీర వృక్షాలు, పక్షులు, క్షీరదాలు ఈ జలవ్యవస్థతో తమ జీవితాలను అనుసంధానించుకుంటాయి. ఇక్కడి జీవవైవిధ్యాన్ని ఒక జాబితాగా పరిశీలిస్తే వందలాది జాతులు కనిపిస్తాయి. పర్యావరణ శాస్త్ర దృష్టితో చూస్తే వాటి మధ్య ఉన్న సంబంధాలే పాపికొండల అసలైన సంపదగా కనిపిస్తాయి. పులి తన ఆహార జంతువులతో అనుసంధానమై ఉంటుంది. గౌర్, సాంబర్, చుక్కల జింకలు వృక్షజాలంతో అనుసంధానమై ఉంటాయి. సీతాకోకచిలుకలు పుష్పించే మొక్కలతో ముడిపడి ఉంటాయి. పక్షులు విత్తన వ్యాప్తిలో భాగస్వాములవుతాయి. ఉభయచరాలు తేమతో కూడిన చిన్న ఆవాసాలతో అనుసంధానమై ఉంటాయి. నదీతీర పక్షులు గోదావరి నీటి ప్రవాహంతో తమ జీవనాన్ని ముడిపెట్టుకుంటాయి. ఈ పరస్పర సంబంధాలే పాపికొండల అరణ్యాన్ని ఒక జీవంత పర్యావరణ జాలంగా నిలబెడుతున్నాయి. ఒక జీవి ఆహారంగా ఉపయోగించే వనరు మరొక జీవికి జీవనాధారంగా మారుతుంది. ఒక చెట్టు ఇచ్చే పండు ఒక పక్షికి ఆహారమవుతుంది; ఆ పక్షి తీసుకెళ్లే విత్తనం కొత్త మొక్కకు ఆరంభమవుతుంది. ఒక చిన్న ప్రవాహం ఒక కప్పకు జీవస్థలమవుతుంది; ఆ కప్ప మరో జీవికి ఆహారమవుతుంది. ఒక నదీతీర ఇసుక మేట ఒక పక్షికి గూడు స్థలమవుతుంది. ప్రకృతిలో ప్రతి సంబంధం మరొక సంబంధానికి దారితీస్తూ జీవన ప్రవాహాన్ని కొనసాగిస్తుంది. పాపికొండలలోని ఈ జీవవైవిధ్యం తూర్పు కనుమల పరిణామ చరిత్రకు కూడా ఒక జీవంత సాక్ష్యం. ఉత్తర తూర్పు కనుమలలో విస్తరించిన అరణ్య ప్రాంతాల్లో పాపికొండలు ఒక ప్రధాన సంరక్షణ భూభాగంగా నిలిచాయి. శాస్త్రీయ అధ్యయనాలు ఈ ప్రాంతాన్ని తూర్పు కనుమలకు ప్రత్యేకమైన క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు, ఉభయచరాలు, సీతాకోకచిలుకలు, వృక్షజాతులకు ముఖ్యమైన ఆవాసంగా నమోదు చేస్తున్నాయి. గోదావరి ప్రవాహం, పాపికొండల అరణ్యం, జీవవైవిధ్యం --- ఈ మూడు కలిసి ఒక విస్తృతమైన ప్రకృతి వ్యవస్థను నిర్మించాయి. ఆ వ్యవస్థలో మనిషి జీవితం కూడా ఒక భాగం. పర్వత అరణ్యాలతో తరతరాలుగా అనుబంధం కలిగిన స్థానిక గిరిజన సమాజాల జీవన విధానాలు, అడవి వనరులు, నదీ సంస్కృతి, సంప్రదాయ జ్ఞానం పాపికొండల భౌగోళిక ప్రపంచంతో ముడిపడి ఉన్నాయి. అరణ్యం వారికి ఆహారం, ఔషధ మొక్కలు, జీవనోపాధి వనరులు, సాంస్కృతిక గుర్తింపును అందించే ప్రకృతి ప్రదేశంగా నిలిచింది. అందుకే పాపికొండల జీవవైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం అంటే జంతువుల జాబితాను చదవడం కాదు; గోదావరి నుంచి పర్వత శిఖరం వరకు, ఒక వృక్షం నుంచి ఒక పక్షి వరకు, ఒక కప్ప నుంచి ఒక పులి వరకు సాగుతున్న పరస్పర జీవ సంబంధాలను అర్థం చేసుకోవడం. పాపికొండల అరణ్యంలో జీవం ఇంత విస్తృతంగా విరాజిల్లడానికి ప్రకృతి అందించిన భౌగోళిక పునాది ఎంత ముఖ్యమో, దాన్ని భవిష్యత్తుకు అందించే సంరక్షణ వ్యవస్థ అంతే ముఖ్యమైనది. గోదావరి పరివాహక ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులు, అరణ్య సంరక్షణ, గిరిజన జీవన విధానాలు, వన్యజీవుల ఆవాసాలు, నదీ పర్యావరణం పరస్పరం కలిసిన చోట పాపికొండల భవిష్యత్తు రూపుదిద్దుకుంటోంది.

### గోదావరి--అడవి--మనిషి : సంరక్షణకు ఒక సమగ్ర కథ

గోదావరి పాపికొండల మధ్యగా ప్రవహించే దృశ్యం ప్రకృతి వైభవానికి ఒక ప్రతీకగా కనిపిస్తుంది. ఆ దృశ్యం వెనుక శతాబ్దాలుగా కొనసాగుతున్న మనిషి--అడవి--నది సంబంధం ఉంది. పర్వత అరణ్యాలు స్థానిక సమాజాలకు ఆహారం, ఔషధ మొక్కలు, తేనె, చింతపండు, మహువా వంటి అటవీయేతర ఉత్పత్తులు, వెదురు, జీవనోపాధి వనరులను అందించాయి. గోదావరి నది రవాణా, జీవనాధారం, సాంస్కృతిక అనుబంధానికి ఆధారంగా నిలిచింది. పాపికొండల సంరక్షణ కథను అందుకే అడవిలోని వన్యజీవుల పరిరక్షణతో పాటు, నదీ వ్యవస్థను మరియు స్థానిక సమాజాల జీవన సంబంధాలను కలుపుకొని చూడాలి.పాపికొండల సంరక్షణకు చారిత్రక పునాది స్వాతంత్ర్యానంతర అటవీ పరిపాలనా వ్యవస్థలో ఏర్పడిన రిజర్వ్ ఫారెస్ట్‌లతో ప్రారంభమైంది. అనంతరం ఈ ప్రాంతంలోని వన్యజీవ సంపదకు ప్రత్యేక రక్షణ కల్పించే ఉద్దేశంతో 1978లో పాపికొండల వన్యప్రాణి అభయారణ్యం ఏర్పడింది. తరువాతి దశలో అరణ్య సమగ్రత, గోదావరి నదీ పరివాహక ప్రాంతం, తూర్పు కనుమల జీవవైవిధ్య పరిరక్షణకు మరింత విస్తృతమైన సంరక్షణ హోదా అవసరమైంది. ఆ క్రమంలో 2008లో పాపికొండల జాతీయ ఉద్యానవనంగా ప్రకటించబడింది. దీని విస్తీర్ణం సుమారు 1,012.86 చదరపు కిలోమీటర్లు. జాతీయ ఉద్యానవన హోదా పాపికొండల అరణ్యానికి మరింత బలమైన చట్టపరమైన సంరక్షణ పునాదిని అందించింది. వన్యప్రాణులు, వాటి ఆవాసాలు, అరణ్య వృక్షజాలం, నదీ పరిసరాలు, జీవవైవిధ్యాన్ని సమగ్రంగా నిర్వహించడానికి రక్షిత ప్రాంత వ్యవస్థ ఏర్పడింది. భారతదేశంలోని రక్షిత ప్రాంతాల వ్యవస్థలో జాతీయ ఉద్యానవనాలు ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి. వన్యప్రాణుల ఆవాసాల పర్యావరణ సమగ్రతను కాపాడటం, జీవవైవిధ్యాన్ని సంరక్షించడం, శాస్త్రీయ పర్యవేక్షణను కొనసాగించడం వాటి ప్రధాన ఉద్దేశాల్లో భాగం. పాపికొండల సంరక్షణలో గిరిజన సమాజాల పాత్ర ప్రత్యేకమైనది. బోటనికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన పాపికొండల ఫ్లోరా అధ్యయనం ప్రకారం గోండ్లు, కోయలు, కోయదొరలు, కొండలు, రాజ్‌గోండ్లు, ప్రధాన్, తోటి, దద్వే, గోవారీ, కోలం వంటి అనేక గిరిజన సమూహాలు ఈ ప్రాంతంలో లేదా పరిసరాల్లో నివసిస్తున్నాయి. వీరిలో కోయలు, కొండరెడ్డిలు ప్రధాన సమూహాలుగా నమోదయ్యారు. అటవీ వనరుల వినియోగం, ఔషధ మొక్కల పరిజ్ఞానం, ఆహార మొక్కల గుర్తింపు, ఋతువులకు అనుగుణమైన అటవీ వనరుల సేకరణ వంటి సంప్రదాయ జ్ఞానం తరతరాలుగా కొనసాగుతోంది. ఈ సంప్రదాయ జ్ఞానం జీవవైవిధ్య సంరక్షణలో విలువైన మానవ వనరుగా నిలుస్తుంది. ఏ మొక్క ఏ కాలంలో లభిస్తుంది, ఏ భాగాన్ని ఉపయోగించాలి, ఏ ప్రాంతంలో ఏ వృక్షజాతి పెరుగుతుంది, వర్షాకాలంలో ఏ మార్గాలు సురక్షితంగా ఉంటాయి, అడవిలో నీటి వనరులు ఎక్కడ ఉన్నాయి వంటి స్థానిక పరిజ్ఞానం పర్యావరణాన్ని అర్థం చేసుకోవడానికి ప్రత్యేకమైన దృక్కోణాన్ని అందిస్తుంది. ప్రకృతి సంరక్షణలో శాస్త్రీయ పరిశోధనతో పాటు స్థానిక జ్ఞానం కలిసినప్పుడు భూభాగాన్ని మరింత సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశం ఏర్పడుతుంది.భారత పార్లమెంటులో 2012లో పాపికొండల ప్రాంతంలోని గిరిజనుల జీవన పరిస్థితులపై ప్రశ్న లేవనెత్తిన సందర్భంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజనులను అటవీశాఖ ప్రొటెక్షన్ వాచెర్స్ , అనిమాల్ ట్రాకెర్స్ , బేస్ క్యాంప్స్ , స్ట్రైక్ ఫోర్స్ వంటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తోందని, ఏకో-డోవలప్మెంట్ కమిటీస్ ద్వారా రక్షిత ప్రాంత నిర్వహణలో స్థానిక సమాజాల భాగస్వామ్యం కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం సమాధానమిచ్చింది. ఈ నేపథ్యంలో పాపికొండల సంరక్షణలో మనిషి--అడవి సంబంధం ఒక ముఖ్యమైన అంశంగా మారుతుంది. అడవిని జీవనాధారంగా ఉపయోగించే సమాజాలకు సంరక్షణ విధానాలు వారి జీవన విధానాలతో అనుసంధానమై ఉండాలి. అటవీ హక్కులు, జీవనోపాధి, సంప్రదాయ జ్ఞానం, వనరుల వినియోగం, సంరక్షణ బాధ్యత వంటి అంశాలను సమన్వయంతో చూడటం దీర్ఘకాలిక అరణ్య పరిరక్షణకు సహకరిస్తుంది.పాపికొండల భవిష్యత్తును ప్రభావితం చేసే ప్రధాన పర్యావరణ అంశాల్లో ఇంద్రసాగర్ పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు ఒకటి. గోదావరి నదిపై నిర్మితమవుతున్న ఈ భారీ ప్రాజెక్టు పరిధిలో పాపికొండల ప్రాంతానికి సంబంధించిన ముంపు, అటవీ భూమి, వన్యజీవుల ఆవాసాలు, నదీతీర జీవావరణాలపై శాస్త్రీయ అధ్యయనాలు చేపట్టబడ్డాయి. వైల్డ్‌లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా , ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సహకారంతో 2012--2014 మధ్య నిర్వహించిన అధ్యయనం పాపికొండల జాతీయ ఉద్యానవనం, పోలవరం ప్రభావ ప్రాంతంలోని క్షీరదాలు, పక్షులు, హెర్పటోఫౌనా, చేపలు, జలచర వెన్నెముక జీవులు, వన్యజీవుల కారిడార్లు, కీలక ఆవాసాలు వంటి అంశాలను పరిశీలించింది. ఈ అధ్యయనంలో గోదావరి రెండు ఒడ్డుల వెంట పాపికొండల జాతీయ ఉద్యానవనంలోని ముంపు ప్రాంతాల్లో 13 బీట్లు ఎంపిక చేసి వేగవంతమైన జీవవైవిధ్య అంచనాలు నిర్వహించారు. మొత్తం 35.11 కిలోమీటర్ల ట్రాన్సెక్ట్ సర్వే చేపట్టారు. వన్యజీవుల ప్రస్తుత స్థితి, వాటి ఆవాసాల పంపిణీ, నదీతీర వృక్షజాలం, జలచర జీవులు, ముఖ్యమైన వన్యజీవుల సంచార మార్గాలను గుర్తించడం ఈ పరిశోధనలో భాగమైంది. ప్రాజెక్టు ప్రభావ ప్రాంతానికి అనుగుణంగా నివారణ చర్యలు, జీవవైవిధ్య నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం కూడా అధ్యయన లక్ష్యాల్లో ఉంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక పర్యావరణ నిర్ణయ ప్రక్రియలో పాపికొండల రక్షిత ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టబడింది. కేంద్ర జాతీయ వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశపు నిమిషాల్లో 187.29 హెక్టార్ల అటవీ భూమి పాపికొండల అభయారణ్య పరిధి నుంచి ప్రాజెక్టు అవసరాల కోసం మళ్లించే అంశం నమోదు అయింది. ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాలు వన్యజీవుల ఆవాసాలపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలను చూపే అవకాశం ఉన్నందున కార్మిక శిబిరాలు రక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయడం, ఇంధనం--చిన్న కలప అవసరాలను ప్రాజెక్టు సంస్థే సమకూర్చడం, రక్షిత అరణ్యాలకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం, వన్యప్రాణి విభాగాన్ని బలోపేతం చేయడం వంటి షరతులను కమిటీ సూచించింది. ఇలాంటి భారీ నదీ ప్రాజెక్టుల ప్రభావాన్ని అంచనా వేయడంలో నదీ ప్రవాహం మాత్రమే ప్రమాణంగా ఉండదు. జలాశయం ఏర్పడే ప్రాంతం, అరణ్య ముంపు, వన్యజీవుల ఆవాస మార్పు, సంచార మార్గాలు, నదీతీర వృక్షజాలం, చేపల జీవచక్రం, దిగువ ప్రవాహ ప్రాంతాల పర్యావరణం, స్థానిక సమాజాల జీవన సంబంధాలు వంటి అనేక అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. పాపికొండల విషయంలో గోదావరి నది మరియు అరణ్యం పరస్పరంగా ముడిపడి ఉన్నందున ప్రతి మార్పు విస్తృత పర్యావరణ పరిధిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. పాపికొండల జీవవైవిధ్యాన్ని రక్షించడంలో వన్యజీవుల సంచార మార్గాలు ప్రత్యేకమైన అంశం. పులి, చిరుత, ఏనుగు, గౌర్ వంటి పెద్ద క్షీరదాలు విస్తృత భూభాగాల్లో సంచరిస్తాయి. ఒక రక్షిత ప్రాంతం నుంచి మరొక అరణ్య ప్రాంతానికి సహజంగా కదిలే మార్గాలు వాటి జనాభా ఆరోగ్యం, ఆహార లభ్యత, సంతానోత్పత్తి, జన్యు వైవిధ్యానికి ముఖ్యమైనవి. వైల్డ్‌లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధ్యయనంలో కూడా ముఖ్యమైన వన్యజీవుల కారిడార్లు, కీలక ఆవాసాలను గుర్తించడం ఒక ప్రధాన లక్ష్యంగా ఉంది. పాపికొండల అరణ్య సంరక్షణలో అటవీ అగ్ని నిర్వహణ కూడా ముఖ్యమైన అంశం. బోటనికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనం ప్రకారం ఎలూరు డివిజన్‌లో వేసవి ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల అరణ్యాలు అగ్నికి ఎక్కువగా గురయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. అరణ్యాగ్ని నియంత్రణలో ముందస్తు పర్యవేక్షణ, ఫైర్ లైన్లు, వేగవంతమైన స్పందన, స్థానిక సమాజాల భాగస్వామ్యం, అగ్ని ప్రమాదాలపై అవగాహన వంటి చర్యలకు ప్రాధాన్యం ఉంటుంది. వాతావరణ మార్పులు కూడా భవిష్యత్ సంరక్షణలో పరిశీలించాల్సిన అంశంగా నిలుస్తున్నాయి. ఉష్ణోగ్రతల్లో మార్పులు, వర్షపాతం నమూనాల్లో మార్పులు, తీవ్రమైన వర్ష సంఘటనలు, దీర్ఘకాలిక ఎండకాలాలు వంటి పరిణామాలు పర్వత జలవ్యవస్థలు, అరణ్యాగ్ని ప్రమాదాలు, వృక్షాల పునరుత్పత్తి, ఉభయచరాల జీవచక్రాలు, పక్షుల ఆహార లభ్యత వంటి అంశాలపై ప్రభావం చూపగలవు. పాపికొండల వంటి విస్తారమైన అరణ్య ప్రాంతాల్లో దీర్ఘకాలిక జీవవైవిధ్య పర్యవేక్షణ ఈ మార్పులను అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన సాధనంగా ఉంటుంది. పాపికొండల సంరక్షణకు మరో బలమైన పునాది శాస్త్రీయ పరిశోధన. బోటనికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహించిన విస్తృత ఫ్లోరా అధ్యయనం పాపికొండల వృక్షజాలంపై జ్ఞానాన్ని విస్తరించింది. పరిశోధనలు ఉభయచరాలు, సరీసృపాల వైవిధ్యంపై కొత్త నమోదులను అందించాయి. పక్షులు, క్షీరదాలు, సీతాకోకచిలుకలు, చేపలు, నదీతీర జీవావరణాలపై వివిధ పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ పరిశోధనలు సంరక్షణ ప్రణాళికలకు శాస్త్రీయ ఆధారాన్ని అందిస్తాయి.పాపికొండల భవిష్యత్తు కోసం సంరక్షణను ఒకే సంస్థ బాధ్యతగా చూడకుండా సమగ్ర పర్యావరణ పాలనగా చూడటం అవసరం. అటవీ శాఖ, వన్యప్రాణి విభాగం, శాస్త్రీయ సంస్థలు, స్థానిక గిరిజన సమాజాలు, నదీ నిర్వహణ సంస్థలు, పర్యావరణ నిపుణులు, పౌర సమాజం పరస్పర సహకారంతో పనిచేసినప్పుడు పర్వత--నది--అరణ్య వ్యవస్థకు దీర్ఘకాలిక రక్షణ బలపడుతుంది పాపికొండలలో గోదావరి ఒక నదిగా ప్రవహిస్తుంది. అదే సమయంలో అది అరణ్యాలను, గ్రామాలను, జీవరాశులను, సంస్కృతులను కలిపే సహజ జీవనరేఖ. పర్వతాల నుంచి వచ్చే వాగులు గోదావరిలో కలుస్తాయి. గోదావరి నదీ వ్యవస్థలోని జీవులు అరణ్యంతో సంబంధం ఏర్పరుచుకుంటాయి. నదీతీర వృక్షాలు జలప్రవాహంతో ముడిపడతాయి. స్థానిక సమాజాల జీవనం ఈ ప్రకృతి వ్యవస్థతో అనుసంధానమై ఉంటుంది. ఈ సంబంధాల సమగ్రతను కాపాడటం పాపికొండల సంరక్షణలో ప్రధాన సూత్రంగా నిలుస్తుంది. ఒకప్పుడు రిజర్వ్ ఫారెస్ట్‌గా రక్షణ పొందిన భూభాగం, తరువాత వన్యప్రాణి అభయారణ్యంగా, ఆపై జాతీయ ఉద్యానవనంగా పరిణామం చెందింది. ఆ పరిణామం ఒక పరిపాలనా మార్పు మాత్రమే కాదు; ప్రకృతి విలువపై సమాజం పెంచుకున్న అవగాహనకు ప్రతిబింబం. పాపికొండల అరణ్యాన్ని జీవవైవిధ్య నిధిగా, గోదావరిని జీవనాడిగా, స్థానిక సమాజాలను ఈ పర్యావరణ వ్యవస్థలో భాగస్వాములుగా చూసే దృక్పథం భవిష్యత్ సంరక్షణకు దిశానిర్దేశం చేస్తుంది. గోదావరి పాపికొండల మధ్యగా ప్రవహిస్తూనే ఉంటుంది. పర్వతాలు వర్షాలను స్వీకరిస్తూనే ఉంటాయి. అరణ్యాలు జలధారలను పోషిస్తూనే ఉంటాయి. పక్షులు ఆకాశంలో ఎగురుతూనే ఉంటాయి. పులి అడవి మార్గాల్లో సంచరిస్తూనే ఉంటుంది. గిరిజన సమాజాల సంప్రదాయ జ్ఞానం తరతరాలకు చేరుతూనే ఉంటుంది. ఈ సహజ ప్రవాహాలన్నీ కలిసి పాపికొండల భవిష్యత్తును నిర్మిస్తాయి. పాపికొండలు ఒక జాతీయ ఉద్యానవనం అనే పరిమితిని దాటి, గోదావరి నదీ నాగరికతకు, తూర్పు కనుమల జీవవైవిధ్యానికి, అరణ్య ఆధారిత సంస్కృతులకు, భవిష్యత్ తరాల పర్యావరణ భద్రతకు ఒక సహజ వారసత్వ భూభాగంగా నిలుస్తాయి. గోదావరి ఒడిలో పర్వతాలు నిలిచినంతకాలం, వాటి వాలువులపై అరణ్యాలు పచ్చగా విస్తరించినంతకాలం, ఆ అరణ్యాల్లో జీవవైవిధ్యం కొనసాగినంతకాలం పాపికొండల కథ ప్రకృతి, మనిషి సహజీవనానికి ఒక సజీవ గాథగా కొనసాగుతుంది.



# చివరి ప్రయాణానికీ చుక్కలే

**- బతికున్నా ఇబ్బందే, చచ్చినా ఇబ్బందే**

**- అంత్యక్రియలకూ అడ్డంకే**

**- మృతదేహాలకూ తప్పని వాగు కష్టం**

**- స్మశానవాటికకు రహదారి ఏది....**

విజయనగరం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: బతికున్నప్పుడు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులకు, చివరి ప్రయాణంలోనూ కష్టాలు తప్పడం లేదు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం పెద్దకాథ గ్రామంలో స్మశానవాటికకు సరైన రహదారి లేకపోవడంతో మృతదేహాలను ఏదుంపుల గెడ్డ వాగు దాటి తరలించాల్సిన దుస్థితి నెలకొంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చలి తీవ్రతను తట్టుకోలేక సామిరెడ్డి పరదేశమ్మ (65), నింగిరెడ్డి లక్ష్మునాయుడు (63) మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఒకేసారి ఇద్దరి మృతదేహాలను అంత్యక్రియల కోసం వాగు దాటించేందుకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీవితంలోనే కాదు, చివరి ప్రయాణంలోనూ కష్టాలే అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మశానవాటికకు రహదారి ఏర్పాటు చేసి, తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను కోరుతున్నారు.

# ' రాష్ట్రమంతా సస్యశ్యామలంగా.. పాడిపంటలతో అభివృద్ధి చెందడానికి వరుణుడు ఇచ్చినటువంటి అనుగ్రహం..!!'

**- మరొక విధంగా కూడా ఉపయోగపడి, అన్ని చెరువులు నిండుకుండలా ఉన్నాయి..! - శ్రీరంగపట్నంలో పొంగి ప్రవహిస్తున్న బురదకాలువను, వరద పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే 'బత్తుల'..!**

కోరుకొండ, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తీవ్ర వాయుగుండం సందర్భంగా గత



3 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం వద్ద ఉన్న బురదకాలువ పొంగిపొర్లుతూ, రహదారులపైకి ఉధృతంగా వరద నీరు చేరింది. మన్యం ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాల వల్ల సూరంపాలెం, ముసిరిమిల్లి రిజర్వాయర్ల నుంచి వచ్చిన ఎక్సెస్ నీటితో బురదకాలువ నీటిమట్టం తీవ్రంగా పెరిగి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.సమాచారం అందుకున్న తక్షణమే రాజానగరం నియోజకవరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ శ్రీరంగపట్నం చేరుకుని, ఉధృతంగా ప్రవహిస్తున్న బురదకాలువ ప్రాంతాలను, వరద ముంపుకు గురైన పరిసరాలను స్థానిక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే 'బత్తుల' మాట్లాడుతూ...ఎల్ నినో ప్రభావం మనల్ని చాలా ఇబ్బంది పెడితే, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలకు ఇబ్బంది ఉండకూడదని వరుణుడు వర్షించి, గత మూడు రోజుల నుండి విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. వాగులు వంకలు పొర్లుతున్నాయి. చెరువులన్నీ కూడా నిండుకుండల్లా కలకలలాడుతున్నాయి. పాడి పంటలు సస్యశ్యామలంగా ఉండబోతున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో సమస్యలతో ప్రజలు అల్లకల్లోలమై కరువు తాండవిస్తున్న సమయంలో కూడా, ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఒక మంచి సుపరిపాలన చూసి, వరుణుడు కూడా వర్షించి రాబోయే రోజుల్లో ఇబ్బంది ఉండకూడదని... రాబోయే వేసవిలో తాగునీటికి ఇబ్బంది వస్తుంది, పశువుల నీళ్లకు ఇబ్బంది వస్తుంది, చెరువులు ఎండుపోతున్నాయే... ఇప్పుడు మనం సెప్టెంబర్‌లోనే ఎండుపోతే ఇబ్బంది పడతామనే విషయాన్ని ప్రతిరోజూ అనుక్షణం భయపడుతున్న తరుణంలో, వరుణుడు వర్షించి ఈరోజున వర్షాలు కురిపించారని పేర్కొన్నారు. , రాబోయే సంవత్సరంలో వచ్చే వేసవి కాలంలో కూడా ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఉంటుందని భావిస్తున్నానన్నారు. సీతానగరంలో ఒక చెరువు నిండిపోయి... ఆ చెరువులో నుంచి పోటు వచ్చి ఒక వీధి జలమయం అయిపోతే, చెరువు పక్కన గండి కొట్టించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి అక్కడ చర్యలు తీసుకోవడం జరిగింది. కోరుకొండ మండలంలో శ్రీరంగపట్నం బురద కాలువ సమస్య ఎప్పటి నుంచో ఉంది. ఈ విషయమై పలుమార్లు అసెంబ్లీలో కూడా మాట్లాడటం జరిగింది. గత రెండేళ్లుగా స్థానిక జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలందరం కలిసి ఈ కాలువలో పూడికలు తీసి కొంతవరకు జాగ్రత్త చేసుకున్నప్పటికీ కూడా, మన్యం ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాల వల్ల సూరంపాలెం రిజర్వాయర్ కానివ్వండి, ముసిరిమిల్లి కానివ్వండి... ఈ కాలువల నుంచి నీరు వస్తుందో, ఆ ఎక్సెస్ వాటర్ అంతా శ్రీరంగపట్నం మీదికి ప్రతి ఏడాది వస్తుంది, ఈ ఏడాది కూడా వచ్చింది. ఎంఆర్ఓ.. ఆర్డీఓ స్పందించి, ఎక్కడైతే మునిగే అవకాశం ఉందో, ఎవరికైతే ప్రమాద స్థాయిలో ఇళ్లు ఉన్నాయో, ఆ నివాసితులందరికీ పునరావాసం కల్పిస్తూ వేరే చోట స్కూల్స్ దగ్గరకు మార్చి వాళ్లకు భోజన, వైద్య సదుపాయాలు కల్పించారు. మండల రెవెన్యూ ఆఫీసర్,, ఆర్డీఓ, దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తనకాల నాగేశ్వరరావు, కోరుకొండ మండలం జనసేన పార్టీ అధ్యక్షులు అడ్డాల శ్రీనివాస్, సర్పంచ్ మద్దాల అమ్మాని రమణ, కూటమి నాయకులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు మరియు జనసేన, తెలుగుదేశం,బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలెపు ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జన కార్యక్రమం



ఖమ్మం, సెప్టెంబర్ 24 , నేటి శుభోదయ :: ఖమ్మం నగరంలో గల 44 వ డివిజన్ లో వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి, అనంతరం డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాని ఘనంగా నిర్వహించారు. తొలుత వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించిన తర్వాత లడ్డు పాట నిర్వహించడం జరిగింది. ఈ పాటను పాలెపు విజయ వెంకటరమణ తనయుడు దక్కించుకున్నారు. అనంతరం డివిజన్ మొత్తం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను గంగ వడికి తరలించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పాలెపు వెంకటరమణ, డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ, వారి కుటుంబ సభ్యులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# "పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా"

## 13వ వార్షిక సదస్సులో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్



న్యూఢిల్లీ, ఏలూరు, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: గురువారం న్యూఢిల్లీలోని తాజ్ మహల్ హోటల్‌లో జరిగిన 'పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా' 13వ వార్షిక సదస్సులో, ముఖ్య అతిథి నారా లోకేష్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులు, దేశ విదేశీ ప్రతినిధులతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం రాత్రి ఢిల్లీ వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ను ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం నారా లోకేష్, కూటమి ఎంపీలతో జరిగిన భేటీలో పాల్గొని తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు.



# "సేవా సంకల్ప్ చిత్రలేఖనం పోటీలలో పాల్గొన్న వీరంపాలెం, కొమ్ముగూడెం హైస్కూల్ విద్యార్థులు"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 24 (నేటి-శుభోదయ) సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా తాడేపల్లిగూడెం రూరల్ మండలం వీరంపాలెం, కొమ్ముగూడెం గ్రామాలలో గల హైస్కూల్ నందు జరిగిన వ్యాస రచన,చిత్రలేఖనశీ, మల్టీమీడియా ప్రదర్శన కార్యక్రమం ఈరోజు రూరల్ మండల అధ్యక్షులు సమయమంతుల కాశీ విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వరావు మాట్లాడుతూ వీరంపాలెం, కొమ్ముగూడెం హైస్కూల్ విద్యార్థులు కనబరిచిన ప్రతిభ విద్యార్థులకు బహుమతులు అందించడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం టౌన్ బిజెపి అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ నల్లూరి శ్రీనివాస్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కొడవటి అప్పారావు, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు దూసనపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా హైస్కూల్ ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం జిల్లాను కరవు జిల్లాగా ప్రకటించాలి

**సోలార్ బోర్లు,సోలార్ పెన్సింగ్ 90 శాతం సబ్సిడీతో మంజూరు చేయాలి.**

**2013 భూ సేకరణ చట్టం ప్రకారం పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్వాసితులకు శాస్త్రీయ సమగ్ర పునరావాసం కల్పించాలి.**

**ఏపీ ఎస్టి కమిషన్ చైర్మన్ కు ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు వినతి.**



దేవీ పట్నం, సెప్టెంబర్ 24. నేటి శుభోదయ: పోలవరం జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం, పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోడవరంలోని ఏపీ ఎస్టి కమిషన్ చైర్మన్ క్యాంప్ ఆఫీస్ నందు ఏపీ ఎస్టి కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేయటం జరిగిందని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ...ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కొత్త ఏర్పడిన పోలవరం జిల్లా వ్యాప్తంగా ఎల్.ని.నో వర్షాలు కురువకపోవడంతో వర్షాధారం మీదే ఆధారపడి వ్యవసాయం చేస్తున్న ఆదివాసీ నిరు పేద రైతులు 2026 సంవత్సరం ఖరీఫ్ సీజన్లో వరి పంట గానీ సిరి ధాన్యాలు (మిల్లెట్స్) పంటల గానీ వర్షాలు కురువకపోవడంతో ఎక్కడ వెయ్యలేదు.కావున వ్యవసాయ శాఖ అధికారులతో క్షేత్ర స్థాయిలో సర్వే చేసి అంచన వేసి పోలవరం జిల్లాను కరవు జిల్లాగా ప్రకటించి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కును కాపాడాలని ప్రజలు జీవనోపాధి కోసం సిరి ధాన్యాలు (మిల్లెట్స్) ఆదివాసీ పేదలకు ఉచితంగా పంపిణీ చేయాలని,వి.బి.జీ.రామ్.జి పథకం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించాలని,ఆదివాసీ నిరు పేద రైతులకు సోలార్ బోర్లు,సోలార్ పెన్సింగ్ 90 శాతం సబ్సిడీతో మంజూరు చేయాలని,2013 భూ సేకరణ చట్టం ప్రకారం పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్వాసితులకు శాస్త్రీయ సమగ్ర పునరావాసం కల్పించాలని,టి.ఏ.సీ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియమకాల చట్టం ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగులకు 100% ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే అర్హతను బట్టి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని,ఐటీడీఏ ల ద్వారా ఆదివాసీ 6యువతి యువకులకు 90 శాతం సబ్సిడీతో ట్రైకర్ రుణాలు మంజూరు చేయాలని మొదలైన సమస్యలపై వినతి పత్రాలు ద్వారా తెలియజేయడంతో ఏపీ ఎస్టి కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డి ప్రభుత్వం దృష్టి కి తీసుకు వెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,ఏపీ ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు మొదలైన వారు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో

# వర్షపు నీటిని వెంటనే తొలగించాలి

**: ఏఐఎస్ఎఫ్ డిమాండ్**



తాడిపత్రి సెప్టెంబర్ 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వర్షపు నీటితో జలమయం కావడంతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మైదానంలో పెద్దఎత్తున నీరు చేరడంతో విద్యార్థులు కళాశాలకు రాకపోకలు సాగించడానికి, క్రీడా, విద్యా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి తీవ్ర ఆటంకం కలుగుతోందని తెలిపారు. మైదానంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ప్రాంతం లోతట్టుగా ఉండటంతో ప్రతి వర్షాకాలంలోనూ ఇదే సమస్య పునరావృతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచిన నీటి వల్ల దోమలు వ్యాపించి విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు.సంబంధిత అధికారులు తక్షణమే కళాశాల మైదానాన్ని పరిశీలించి, నిలిచిన నీటిని తొలగించడంతో పాటు పారిశుద్ధ్య, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. మైదానంలో మట్టి, గ్రావెల్ వేసి చదును చేయాలని, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి విద్యార్థుల రాకపోకలకు తాత్కాలిక మార్గాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నియోజకవర్గ అధ్యక్షుడు ఓబులేసు, పట్టణ కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షులు వికాస్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



యాడికి సెప్టెంబర్ 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండలంలోని రాయలచెరువు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి మెగా వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి దాదాపు 60 మంది రోగులు హాజరుకాగా, వారిలో 35 మందిని కంటి ఆపరేషన్ల కోసం నిపుణులైన వైద్యులు ఎంపిక చేశారు.ఎంపిక చేసిన రోగులను ఉచితంగా బస్సులో బెంగళూరుకు తరలించి, శస్త్రచికిత్సలు పూర్తయిన తర్వాత తిరిగి ఉచితంగా స్వగ్రామాలకు చేర్చనున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. శిబిరానికి వచ్చిన రోగులందరికీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. అనంతరం వైద్య సహాయం అందించిన ఆసుపత్రి సిబ్బందిని లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ శేషానంద రెడ్డి, ట్రెజరర్ రామకృష్ణ, ప్రతినిధులు రవి ప్రసాద్, సత్యనారాయణ, చల్లా సూర్యనారాయణ, అల్లా బకాష్, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ శెట్టి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు...



# సీఎం చంద్రబాబు సహకారంతో పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.7.20 కోట్ల తో మహర్దశ

**నియోజవర్గానికి అత్యధిక నిధులు మంజూరు కు ఎమ్మెల్యే పల్లె సింధూర ప్రత్యేక కృషి**

**ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి పల్లె చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం**

**మున్సిపాలిటీ ఎన్నికల్లో ఏ మాత్రం చిన్న పొరబాటు చేయవద్దు**

**20 ఎకరాల్లో జీన్స్ పరిశ్రమ ద్వారా మహిళలకు ఉపాధి కల్పన**

**పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో రూ.7.20 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

**భూమి పూజ కార్యక్రమం లో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి పల్లె**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 24 నేటి శుభోదయ : పుట్టపర్తి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, వీటి ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి నియోజకవర్గ ప్రజల రూపురేఖలు మారనున్నాయని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లవచ్చన్నారు.గురువారం పుట్టపర్తి మున్సిపాలిటీలో సుమారు రూ.7.20 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కలిసి ప్రారంభోత్సవాలు,భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో సమీపంలో రూ.48 లక్షలతో నిర్మించిన గోకులం మినీ పార్కును ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి,జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో సుమారు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన మిల్లెట్స్ ఫుడ్ పార్కును ప్రారంభించారు.పుట్టపర్తి సంత మార్కెట్ రోడ్డులో రూ.20 లక్షలతో స్మశాన వాటిక ప్రహరీ, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కర్ణాటక నాగేపల్లి రోడ్డులో రూ.17.50 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి, సాయినగర్‌లో రూ.22.50 లక్షలతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.చిత్రావతి రోడ్డులో రూ.4.25 కోట్లతో నిర్మించనున్న మున్సిపల్ కార్యాలయానికి భూమిపూజ చేశారు. అదే ప్రాంతంలో 4.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియానికి కూడా భూమిపూజ నిర్వహించారు. ఎనుములపల్లి ఎస్సీ కాలనీలో రూ.39.70 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి, బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. బ్రాహ్మణపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.6.50 లక్షలతో నూతన బోరు, పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు.అదేవిధంగా బడే నాయక్ తండాలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.6.50 లక్షలతో నూతన బోరు బావి తవ్వకానికి భూమిపూజ నిర్వహించారు.పుట్టపర్తి మునిసిపాలిటి పరిధిలో ప్రజల త్రాగునీటి ఎద్దడి నివారణకు రూ.23.50 లక్షలతో నూతన బోరు బావుల తవ్వకానికి భూమి పూజ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, పుట్టపర్తి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు.పుట్టపర్తి ప్రాంతంలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 5వ తరం ఫైటర్ జెట్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. పెడబల్లి పంచాయతీలో త్వరలో 20 ఎకరాల్లో జీన్స్ పరిశ్రమ ఏర్పాటు చేసి సుమారు 4 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.అమడగూరులో రిలయన్స్ సంస్థ సహకారంతో సుమారు రూ.51 వేల కోట్ల పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద సోలార్ పరిశ్రమ ఏర్పాటు కానుందని తెలిపారు. ఈ పరిశ్రమల రాకతో నియోజకవర్గంలో సుమారు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. ప రిశ్రమలు, మౌలిక వసతులు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, ఆరోగ్యం, క్రీడా రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పుట్టపర్తి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని నాయకులు తెలిపారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తమ నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపాలిటీ చెందిన ప్రజాప్రతినిధులు , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ప్రభుత్వ అధికారులు ; కూటమి పార్టీల నుంచి టీడీపీ , బిజెపి జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

**జిల్లాలో 70 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్ల ఉచిత పంపిణీ**

**-జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.**

**-దివ్యాంగుల సంక్షేమం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది..**

**-ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి.**




అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 24 నేటి శుభోదయ : అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్ లో ఉన్న ఎం.వై.ఆర్ ఫంక్షన్ హాల్ లో గురువారం విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా ు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ వయోవృద్ధుల సహాయ సంస్థ, అనంతపురం జిల్లా ఆధ్వర్యంలో మూడు చక్రాల స్కూటర్ల ఉచిత పంపిణీని ఘనంగా నిర్వహించగా.. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి, ఏపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు వసంత్ కుమార్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సహాయ కార్యదర్శి రాజేష్, సక్ష్యమ్ సేవా సంస్థ సెక్రటరీ విజయ భాస్కర్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా ు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి అర్చన, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం మరియు వారి సమగ్ర అభివృద్ధి కోసం పలు సేవలు, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించబడుతున్నాయన్నారు. గత కొన్ని నెలలుగా జిల్లాలో దివ్యాంగులకు సంబంధించి దివ్యాంగ శక్తి, పింఛన్ల పంపిణీ, వైద్య సహాయం, ఇతర ఆర్థిక లబ్ధి వంటి పలు కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టామన్నారు. జిల్లాలో 70 మంది దివ్యాంగులకు (ఒక్కక్క మోటారు వాహనం విలువ 1,20,000 రూపాయలు) మూడు చక్రాల స్కూటర్ల ఉచిత పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పెన్షన్ పొందుతున్న దివ్యాంగులలో ఇప్పటివరకు దాదాపు 70 శాతం మందికి యుడిఐడి కార్డుల జనరేషన్ మరియు పంపిణీ పూర్తి చేయడం జరిగిందన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఏ విధమైన సంక్షేమ పథకాలు, రాయితీలు, లేదా రాబోయే రోజుల్లో లబ్ధి పొందాలన్నా యుడిఐడి కార్డ్ ప్రాథమిక ఆధారంగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్క దివ్యాంగుడికి సేవలు అందాలనేదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని, ప్రజాప్రతినిధులు, సంఘాలు మరియు ఇతర స్వచ్ఛంద సంస్థలు యుడిఐడి కార్డ్ విశిష్టతపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయనున్నారని, ఆ మండలంలోప్రభుత్వ పథకాలన్నింటినీ 100 శాతం అందరికీ పూర్తిస్థాయిలో అందించడం జరుగుతుందని,జీవనోపాధి మరియు ప్రయాణ, ఇతర సమస్యలను గుర్తించి పరిష్కరించడం, మౌలిక వసతులు ప్రత్యేక అవసరాలను సమగ్రంగా నెరవేర్చడం వంటి పనులు చేపడతారన్నారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, వారి రోజువారీ ఇబ్బందులు తొలగించేందుకు రెడ్ క్రాస్, వివిధ స్వచ్ఛంద సంస్థలు, మరియు ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారని తెలియజేశారు. సమాజంలో ఉన్న ప్రతీ దివ్యాంగుడికి సంక్షేమ ఫలాలు చేరేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో త్రిచక్ర మోటారు వాహనాలు మరియు ఇతర సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగుల పింఛన్‌ను 6,000 కు పెంపు చేయగా, డయాలసిస్ బాధితులకు 10,000, మంచానికే పరిమితమైన దివ్యాంగులకు 15,000 రూపాయల వరకు పింఛన్ ఇస్తూ ఆర్థికంగా భరోసా కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో దివ్యాంగులకు ప్రకటించిన 7 వరాలలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియతో పాటు ఆర్టీసీ పాసుల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ చైర్మన్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. 45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు, 10వ తరగతి అర్హత నిబంధనను సడలించి సబ్సిడీ రుణాలు మరియు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక కళాశాలను డిగ్రీ కళాశాలగా మార్చేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. రాయలసీమ రీజియన్‌లో అనంతపురం జిల్లా దివ్యాంగుల సంక్షేమంలో రాష్ట్రంలోనే మోడల్‌గా నిలిచేలా అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని, అర్హులైన దివ్యాంగులందరికీ కార్పొరేషన్ ద్వారా సంపూర్ణ న్యాయం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల మరియు సహాయ సంస్థ, వసతి గృహాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసాన్ని,నమ్మకాన్ని పొందేలా జ్యువెలరీ సంస్థ నడవాలి

**ప్రముఖ రితి జ్యువెలర్స్ నూతన షోరూమ్ ప్రారంభోత్సవంలో**

**మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి**

**నాణ్యత, నమ్మకంతో వినియోగదారుల మన్ననలు పొందాలి**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 24 నేటి శుభోదయ :అనంతపురం నగరంలోని సుభాష్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ జ్యువెలర్స్ రితి రెండవ బ్రాంచ్ షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి నూతన షోరూమ్‌ను ప్రారంభించారు.రీతి జ్యువెలర్స్ నిర్వాహకులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బల్లా పల్లవి షోరూమ్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, వినియోగదారులకు అందుబాటులో ఉంచిన బంగారు, వెండి ఆభరణాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి మాట్లాడుతూ వినియోగదారులకు హాల్‌మార్క్ కలిగిన నాణ్యమైన బంగారు, వెండి ఆభరణాలను అందించడంతో పాటు కేడీఎం, ఆర్నమెంట్ బంగారు నగలను ఖచ్చితమైన తూనికలతో విక్రయించాలని సూచించారు. నాణ్యత, పారదర్శకత, ఖచ్చితమైన తూనికలు, నమ్మకానికి ప్రాధాన్యతనిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని మరింత పెంపొందించుకునేలా సంస్థ యాజమాన్యం, మార్కెటింగ్ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు.ప్రజలకు ఉత్తమమైన, నాణ్యమైన ఆభరణాలను అందిస్తూ వినియోగదారుల నమ్మకాన్ని పొందాలని ఆమె ఆకాంక్షించారు. రీతి జ్యువెలర్స్ నూతన బ్రాంచ్ మరింత అభివృద్ధి చెందాలని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో రీతి జ్యువెలర్స్ నిర్వాహకులు, సిబ్బంది, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**1 నుండి 19 ఏళ్ల వారికి ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**




్హాడికి సెప్టెంబర్ 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బందారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : పిల్లల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో శుక్రవారం మండలవ్యాప్తంగా 'జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం' కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు, యువత అందరికీ ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కడుపులో నులిపురుగులు చేరడం వల్ల పిల్లల్లో తీవ్ర రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి, శారీరకంగా, మానసికంగా బలహీనపడే ప్రమాదం ఉందని, ఈ సమస్యకు అడ్డుకట్ట వేసి వారిలో రోగనిరోధక శక్తిని పెంచేందుకే ఈ బృహత్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్, సాంకేతిక కళాశాలలు మరియు వసతి గృహాల్లో ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది సమక్షంలో ఈ మాత్రలను వేయిస్తారు. 1 నుండి 2 ఏళ్ల పిల్లలకు 200 మిల్లీగ్రాముల మాత్రను పొడి చేసి నీటిలో కలిపి తాగించాలని, 2 నుండి 19 ఏళ్ల వారికి 400 మిల్లీగ్రాముల పూర్తి మాత్రను బాగా నమిలి మింగించాలని సూచించారు. పిల్లలు ఉదయం అల్పాహారం లేదా మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత మాత్రమే ఈ మాత్రలు తీసుకోవాలని, సిబ్బంది ముందే నమిలి మింగాల్సి ఉంటుందని తెలిపారు.మాత్ర వేసుకున్నాక కొందరిలో స్వల్పంగా కడుపునొప్పి లేదా వికారం అనిపిస్తే అది కడుపులోని పురుగులు నశించడం వల్ల వచ్చే సాధారణ లక్షణమేనని, భయపడాల్సిన పనిలేదని వైద్యులు స్పష్టం చేశారు. సెప్టెంబర్ 25న అనారోగ్యం లేదా ఇతర కారణాలతో మాత్ర తీసుకోలేకపోయిన వారికి తదుపరి కేటాయించిన ప్రత్యేక రోజున తప్పనిసరిగా వేయిస్తామన్నారు. పిల్లలకు పరిశుభ్రత అలవాట్లను నేర్పిస్తూ, ఈ కార్యక్రమంలో పాల్గొని తమ పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర వేయించాలని అధికారులు, వైద్య సిబ్బంది తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు...

## ఉపాధ్యాయులపై వైసిపి నాయకులు దాడులు చేయడం దుర్మార్గం

**రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 24 నేటి శుభోదయ: గురువులను దైవంగా కొలిచే సమాజం మనదని, అలాంటి ఉపాధ్యాయులపై వైసీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడటం దుర్మార్గమని రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్ అన్నారు,గురువులపై గొడవలకు దిగడం, దాడులు చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు ఉపాధ్యాయ పోస్టులు వచ్చాయని చెప్పుకోవడానికి శాప్ కార్యాలయానికి వెళ్లిన ఉపాధ్యాయులపై దాడి చేయడం బూతులు తిట్టడం వైసిపి నాయకులకు తగదన్నారు,వైసీపీ అధినేత జగన్ ప్రోత్సాహంతోనే కొందరు కార్యకర్తలు ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడుతున్నారనిఆరోపించారు. ముందు మా నాయకుడు మంత్రి లోకేష్ విసిరిన సవాల్ ను స్వీకరించి జగన్ రెడ్డి 2025 మెగా డీఎస్సీలో గ్రూప్-1 పోస్టులపై చర్చకు రావాలని సవాల్ విసిరారు,ఉపాధ్యాయులపై దాడులకు తెగబడితే ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. 2025 మెగా డీఎస్సీలో టీచర్ అభ్యర్థులు రేయింబవళ్లు కష్టపడి తమ లక్ష్యాన్ని సాధించారన్నారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన టీచర్ అభ్యర్థుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించవద్దని హెచ్చరించారు.ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేసిందన్నారు ఒక్క నోటిఫికేషన్ కూడా నిర్వహించలేని దద్దమ్మ పార్టీ వైసీపీ పార్టీ అని మాసూలు చంద్రమోహన్ అన్నారు.

## ఎల్.ఎల్.ఎమ్ ఫలితాలలో భానుచందర్ కు అత్యున్నత శ్రేణి ప్రతిభ



ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరానికి చెందిన హైకోర్టు అడ్వకేట్ నాళ్ల భానుచందర్ గురువారం ప్రకటించిన ఎల్.ఎల్.ఎమ్ వార్షిక పరీక్షా ఫలితాలలో అత్యున్నతశ్రేణి ప్రతిభను కనబరిచారు. ఉస్మానియా యూనివర్సిటీ లో ఎల్.ఎల్.ఎమ్ పూర్తిచేసిన నాళ్ళ భానుచందర్ వివిధ న్యాయ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఉత్తమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. నాళ్ల భానుచందర్ ప్రస్తుతం హైదరాబాదులోని హైకోర్టులో అడ్వకేట్ గా బాధ్యతలు నిర్వహిస్తూనే ఖమ్మం న్యాయస్థానంలో పలు క్లిష్టతరమైన కేసులలో నైపుణ్యంతో విజయవంతం చేయడంతో ఈ యువ న్యాయవాదిని సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపిన సందర్భాలు ఎన్నెన్నో ఉన్నాయి. నాళ్ల భానుచందర్ ఐదవ తరగతి వరకు ఇల్లెందు మండలం మాణిక్యారం గ్రామంలో విద్యను అభ్యసించగా, ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు ఖమ్మం మౌంట్ ఫోర్ట్ హైస్కూల్లో చదివారు. ఇంటర్ విద్యను ఖమ్మంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో, డిగ్రీ విద్యను ఎస్సా ఆ ర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో , పీజీ ఎంఏ ఇంగ్లీష్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఖమ్మం మానేరు లా కళాశాలలో ఎల్.ఎల్.బి పూర్తి చేసి, ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్.ఎల్.ఎమ్ కోర్సును పూర్తిచేసి అత్యున్నత శ్రేణి ఫలితాలతో సత్తా చాటారు. భానుచందర్ పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో , విద్యాసేవ కార్యక్రమాలలో సేవలందిస్తూ పలు వైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన వారికి న్యాయ సలహాలను అందించి పూర్తి న్యాయం జరిగేలా అండగా నిలుస్తున్నారు. అత్యున్నత శ్రేణిలో ఎల్.ఎల్ ఎం లో ఉత్తీర్ణులైన హైకోర్టు యువ అడ్వకేట్ నాళ్ల భానుచందర్ కు తల్లిదండ్రులు మల్లికాంబ, శ్యాంసుందర్, చెల్లి ,బావ భారతి, సాంబశివుడు, తమ్ముడు భార్గవ్ , న్యాయవాదులు , విద్యావంతులు గురువారం అభినందనలు తెలిపారు.

## సర్వమానవ శ్రేయస్సుకై,భద్రాద్రి రామన్న

**- తిరుమల వెంకన్న మహాపాదయాత్ర లో త్రివేణి డైరెక్టర్లు**



ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: భక్తి, ఆధ్యాత్మికత, సేవా భావాలను మేళవిస్తూ భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సన్నిధి నుండి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధి వరకు త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు నిర్వహిస్తున్న 8వ మహా పాదయాత్ర అత్యంత భక్తిశ్రద్ధలతో 16 వ తారీఖు ప్రారంభం అయ్యింది. ప్రతి నాలుగు సంవత్సరాలకి ఒకసారి ఎంతో భక్తి భావంతో చేపడుతున్న ఈ మహా పాదయాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. సర్వ మానవ హితం, సమాజ శ్రేయస్సు, ప్రజల సుఖసంతోషాలు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, దేశ,రాష్ట్ర, అభ్యున్నతి కోసం స్వామివార్ల ఆశీస్సులు కోరుతూ ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వర రావు తెలిపారు. భద్రాద్రి రామన్న సన్నిధి నుంచి ప్రారంభమై, పాల్వంచ, కాకర్ల,మైలవరం,ఇబ్రహీంపట్నం, విజయవాడ, గుంటూరు ల మీదుగా కొనసాగనున్న ఈ ఆధ్యాత్మిక పాదయాత్ర గురువారం చిలకలూరిపేట కి చేరుకుని ,23 రోజుల తరువాత తిరుమల శ్రీవారి సన్నిధికి చేరుకోనుంది. వీరికి సంఘీభావంగా త్రివేణి విద్యాసంస్థలనుండి రోజుకి ఒకరు చొప్పున పాదయాత్రలో పాల్గొంటున్నారు. అదేవిధంగా పాఠశాలల ఐఐటీ సమన్వయకర్త , ఖమ్మం బ్రాంచ్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సి ఏ సి నటరాజ్ లు గుంటూరులో పాదయాత్ర బృందాన్ని కలుసుకుని వారితో పాదం కదుపుతూ ముందుకు సాగారు. మార్గమధ్యంలో భక్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు పాదయాత్రికులకు తమ సహకారం, స్వాగతం అందిస్తూ ప్రతి పట్టణంలో ఒక్కొక్క మొక్కని నాటుతూ ముందుకు సాగుతోంది ఈ ఆధ్యాత్మిక యాత్ర."భక్తితో అడుగు, సేవతో నడుగు, సర్వ మానవ హితం కోసం సాగు" అనే సందేశంతో ఈ మహా పాదయాత్ర కొనసాగనుంది.త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు మాట్లాడుతూ భగవంతుని అనుగ్రహంతో ప్రతి నాలుగు సంవత్సరాలకి ఒకసారి చేపడుతున్న ఈ పాదయాత్ర ద్వారా ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు మానవతా విలువలు, సేవా భావం, ఐక్యత, సమాజ శ్రేయస్సు వంటి సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తమ ప్రధాన ఉద్దేశమని డైరెక్టర్లు తెలిపారు. ఈ మహాపాదయాత్ర లో డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వర రావు, పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీ కృష్ణ, సనత్ పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా త్రివేణి విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై లభక్తుల భద్రతకు పకడ్బందీ చర్యలు: ఈవో వి.కె. శీనా నాయక్



విజయవాడ, సెప్టెంబర్ 24 (నేటి శుభోదయ):- బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో కోస్తా జిల్లాల్లో విస్తారంగా, విజయవాడ నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తుల భద్రత, సౌకర్యాలపై దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ గురువారం ఉదయం ఆలయ అధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు.వర్షం కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన సహాయక, రక్షణ చర్యలపై అన్ని విభాగాల అధికారులకు ఈవో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భక్తులు నడిచి వచ్చే రోడ్డు, మెట్ల మార్గం, క్యూలైన్ల పరిసరాలలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగాలు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని. వర్షపు నీటితో పాటు రాళ్లు, మట్టి కొట్టుకురాకుండా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.వర్షం వల్ల క్యూలైన్లు, నడక మార్గాల్లో భక్తులు జారి పడే ప్రమాదం ఉన్నందున రబ్బరు మ్యాట్లు, కార్పెట్లు ఏర్పాటు చేయాలని. ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని కాపలా ఉంచాలని.వర్షంలో వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, చంటి బిడ్డల తల్లులు ఇబ్బంది పడకుండా మహా మండపం వరకు, మళ్ళీ క్రిందకు చేరవేసేందుకు బ్యాటరీ వాహనాలను పూర్తిస్థాయిలో నడపాలని ఈవో అన్నారు. అలాగే లిఫ్ట్ సౌకర్యాలు నిరంతరం పనిచేసేలా సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, చలి వాతావరణం, వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు కడుపునిండా వేడివేడి ఆహార పదార్థాలను అన్నప్రసాద భవనంలో అందించాలని. తాగునీటి విభాగాల్లోనూ వేడినీటి సదుపాయం కల్పించాలని.వర్షపు నీరు తాకే అవకాశం ఉన్న వైరింగ్, విద్యుత్ స్తంభాలు, లైటింగ్ బోర్డుల వద్ద ఎలక్ట్రికల్ విభాగం ప్రత్యేక తనిఖీలు చేపట్టాలన్నారు. ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్లు జరగకుండా నిరంతర నిఘా ఉంచాలని, ప్రథమ చికిత్స కేంద్రంలో అవసరమైన అన్ని రకాల అత్యవసర మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని,వర్షం తీవ్రత తగ్గేవరకు అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్లలో అందుబాటులో ఉంటూ భక్తులకు ఎప్పటికప్పుడు సేవలందించాలని ఈవో ఆదేశించారు.ఈ అత్యవసర సమావేశంలో స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీమతి ఎల్. రమ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పి. చంద్రశేఖర్, ఎన్. రమేష్ బాబు, డాక్టర్ కె. గంగాధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవీంద్రనాథ్ ఠాగూర్, అశోక్ కుమార్, సూర్యనారాయణ, పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న సుప్రసిద్ధ హరికథా కళాకారుడు డా. ఎం. వి. సింహాచల శాస్త్రి



విజయవాడ, సెప్టెంబర్ 24 (నేటి శుభోదయ):-ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుప్రసిద్ధ, అగ్రశ్రేణి హరికథా కళాకారుడు, డాక్టర్ ముప్పవరపు వేంకట సింహాచల శాస్త్రి (డా. ఎం. వి. సింహాచల శాస్త్రి) గురువారం ఉదయం ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన శాస్త్రి కు దేవస్థానం ఈవో వి.కె. శీనానాయక్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి వేద మంత్రోచ్ఛారణలతో దివ్యాశీస్సులు అందజేశారు. ఈవో వి.కె. శీనా నాయక్ అమ్మవారి శేషవస్త్రం సమర్పించి, చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ డా. సింహాచల శాస్త్రి తన అద్భుతమైన గాత్రం, అపారమైన పాండిత్యం, విశిష్ట అభినయంతో తెలుగు రాష్ట్రాల్లో హరికథా గాన కళకు విశేష గుర్తింపు తెచ్చారని కొనియాడారు. ముఖ్యంగా ఇటీవల సామాజిక మాధ్యమాలలో శాస్త్రి ప్రవచనాలు, 'మంచి మాటలు' కోట్లాది మంది వీక్షకులను ఆకట్టుకుంటూ విశేష ప్రజాదరణ పొందాయని పేర్కొన్నారు. మన సనాతన ధర్మం, భక్తి విశిష్టత, భారతీయ సంస్కృతి-సంప్రదాయాల ఔన్నత్యాన్ని నేటి యువతరానికి అర్థమయ్యే రీతిలో తెలియజేస్తూ మార్గదర్శనం చేస్తున్న శాస్త్రి ఆధ్యాత్మిక సేవలు ఎంతో ప్రశంసనీయమని ఈవో అభినందించారు.తనకు అమ్మవారి దివ్య దర్శనం కల్పించి సత్కరించినందుకు ఆలయబృందానికి డా. ఎం. వి. సింహాచల శాస్త్రి ధన్యవాదాలు తెలియజేశారు.

## అస్సాం సీఎంకు విజయవాడ దసరా ఉత్సవాల ఆహ్వానం అందజేత

**అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మతో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక భేటీ**



విజయవాడ, సెప్టెంబర్ 24 (నేటి శుభోదయ):- విజయవాడ దసరా నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యక్తిగతంగా ఆహ్వానం అందించారు. అస్సాం పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి సత్యకుమార్, ఎంపీ చిన్ని.. విజయవాడ దసరా ఉత్సవాల విశిష్టతను వివరించారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకుని, విజయవాడ దసరా నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని అస్సాం సీఎంను కోరారు. ఈ సందర్భంగా దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. విజయవాడ నగర సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటే లక్ష్యంతో నిర్వహించనున్న లి'విజయవాడ ఉత్సవ్'లికు కూడా హాజరుకావాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను మంత్రి సత్యకుమార్, ఎంపీ చిన్ని ఆహ్వానించారు. విజయవాడ ఉత్సవ్ ఆహ్వాన పత్రికను కూడా ఈ సందర్భంగా అందజేశారు.ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయం, విజయవాడ నగరానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యత, నగర సాంస్కృతిక ప్రత్యేకతలను ప్రతిబింబించేలా విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి, ఎంపీ వివరించారు. విజయవాడ దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ ద్వారా నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా మరింతగా పరిచయం చేయనున్నట్లు తెలిపారు.అస్సాం ముఖ్యమంత్రితో పాటు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి అశోక్ సింఘాల్, సీఎస్ డాక్టర్ రవి కోటలను కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కూడా విజయవాడ దసరా నవరాత్రి ఉత్సవాలు, 'విజయవాడ ఉత్సవ్'కు ఆహ్వానించారు.విజయవాడను ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా మరింతగా అభివృద్ధి చేయడంతో పాటు దేశవ్యాప్తంగా నగరానికి ఉన్న ప్రత్యేకతను చాటే కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ఎంపీ కేశినేని చిన్ని చొరవ తీసుకుంటున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆధ్యాత్మికతతో పాటు నగర సాంస్కృతిక వైభవాన్ని పరిచయం చేసేలా కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

## అధికారులందరూ ఫీల్డ్‌లోనే ఉండాలి

**వర్షపు నీరు నిలిచిపోవడానికి కారణాలను**

**గుర్తించి వెంటనే పరిష్కరించాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, సెప్టెంబర్ 24 (నేటి శుభోదయ):-భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన అధికారులందరూ ఫీల్డ్‌లోనే ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వర్షపు నీరు రహదారులపై ఎందుకు నిలిచిపోతుంది, అందుకు డీసిల్టింగ్ లోపమా, ఫ్లోటింగ్ ఆబ్జెక్ట్స్ కారణమా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకసారి నీటిని తొలగించిన ప్రాంతంలో మళ్లీ నీటి నిల్వలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం భారీ వర్షాల నేపథ్యంలో నగరంలోని కాళేశ్వరం మార్కెట్, వన్‌టౌన్ బ్రిడ్జి, సీతమ్మవారి పాదాలు, కనకదుర్గనగర్, కెనాల్ రోడ్, జెండాచెట్టు సెంటర్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, మ్యూజియం రోడ్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి వర్షపు నీటి ప్రవాహం, డ్రైనేజీ పరిస్థితులు, కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి వెంటనే నీటిని తొలగించాలని, డ్రైన్లు, కల్వర్టులు, అవుట్‌ఫాల్ డ్రైన్లలో నీటి ప్రవాహానికి ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా అవసరమైన చోట్ల డీసిల్టింగ్ పనులు చేపట్టడంతో పాటు, నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్త, వ్యర్థాలు, ఇతర వస్తువులను వెంటనే తొలగించాలని సూచించారు. బుడమేరు కల్వ మరియు ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటిమట్టం పెరుగుతున్న పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. నీటిమట్టం ఎంత మేర పెరుగుతోంది, పరిస్థితి ఎలా ఉంది అనే వివరాలను ప్రతి గంటకు నివేదిక రూపంలో సమర్పించాలని చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారిని ఆదేశించారు.అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, ప్రజల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వలు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భారీ వర్షాల సమయంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర స్పష్టం చేశారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు

**వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, సెప్టెంబర్ 24 (నేటి శుభోదయ):-వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా వేముల శ్యామలాదేవి రోడ్డు, 5వ నంబర్ రోడ్డు, మధు చౌక్, జమ్మిచెట్టు సెంటర్, సిద్ధార్థ కాలేజ్, మొగల్రాజపురం, మదర్ థెరిసా జంక్షన్, పెనమనేని పాలీక్లినిక్ రోడ్డు, పటమట, బందర్ రోడ్డు, ఏపీఐఐసీ కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడాన్ని గమనించిన కమిషనర్, వెంటనే గల్వర్లతో పాటు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఏపీఐఐసీ కాలనీలో నీటి నిల్వ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అక్కడి ప్రజలను ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే సురక్షితమైన పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటమట సోనోవిజన్ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ అక్కడ వర్షపు నీరు నిలిచిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 27 వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టినప్పటికీ, ప్రస్తుత వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రాంతాల్లో కూడా నీటి నిల్వలు ఏర్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు.కేవలం తరచుగా వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపైనే దృష్టి పెట్టకుండా ప్రతి ఇంజనీర్ తమ పరిధిలోని అన్ని ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చోట్ల డీసిల్టింగ్ పనులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎక్కడా అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా వర్షాలు కురిసిన సమయంలో నీటి నిల్వలు ఏర్పడకుండా చూడాలని సూచించారు.నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 24(నేటి శుభోదయ):- సెంట్రల్ లో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వెంటనే స్పందించారు.గురువారం 63వ డివిజన్ సుందరయ్య నగర్, రాజీవ్ నగర్, 64వ డివిజన్ కండ్రిక శివారు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బొండా ఉమా స్వయంగా పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఇళ్లలోకి వర్షపు నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించి, బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వర్షపు నీరు ఇళ్లలో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులను అప్రమత్తం చేసి మోటార్లను ఏర్పాటు చేసి నీటిని యుద్ధప్రాతిపదికన బయటకు తోడించేలా చర్యలు చేపట్టారు. నీటి తొలగింపు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా ఆయా ప్రాంతాల్లోని కనెక్టింగ్ కాలువలు, డ్రైనేజీ మార్గాలను పరిశీలించిన ఎమ్మెల్యే, కాలువల్లో భారీగా పేరుకుపోయిన గుర్రపు డెక్కలు, చెత్తాచెదారం కారణంగా నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్న విషయాన్ని గుర్తించారు. వెంటనే జేజదీలను ఏర్పాటు చేసి గుర్రపు డెక్కలు, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి కాలువల్లో నీటి ప్రవాహం సజావుగా సాగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉమా మాట్లాడుతూ "వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాల్లో వెంటనే మోటార్ల ద్వారా నీటిని బయటకు తోడిస్తున్నాం. కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం." అని తెలిపారు. "ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారని, అవసరమైన చోట మోటార్లు, జేజదీలు ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపడతాం. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటాం." అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన వారికి పునరావాస కేంద్రాల్లో వసతి, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వర్షాలు తగ్గే వరకు లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా నీరు నిలిచినట్లు సమాచారం అందితే వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే బొండా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లబ్బా వైకుంఠం, కోలా శ్రీను, పైడి శ్రీను, లబ్బా దుర్గా, మోత్కూరి కాసిం, కాకొల్లు రవి కుమార్, దాసరి ఉదయశ్రీ, దుర్గసి రాము, దేవరపు మాల్యాద్రి, పెద్ది, బుదాల సురేష్, పిరియ సోమేశ్వరరావు, సంబంధిత అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు రాయలసీమ జోనల్-4 కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల గర్జన

**నగరంలో భారీ ర్యాలీకి సిద్ధమైన కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు**

అనంతపురం, సెప్టెంబర్ 24 నేటి శుభోదయ : ఆంధ్రప్రదేశ్ వైద్య ఱ ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని, అందుకే తమ ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తున్నామనీ ఏపీ జెఏసి లీడర్లు , ఏపీ ఏ జి సి న ఏ లీడర్లు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం అనంతపురం నగరంలో నిర్వహించ తలపెట్టిన రాయలసీమ జోనల్ (జోన్-4) మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరియు భారీ ర్యాలీని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం నగరంలోని సప్తగిరి సర్కిల్ నుండి ప్రారంభమయ్యే ఈ జోనల్-4 భారీ ర్యాలీ వరకు సాగుతుందని తెలిపారు. రాయలసీమ (జోన్-4) పరిధిలోని ఉమ్మడి జిల్లాల జేఏసీ నాయకులు, ఉద్యమ శ్రేణులు, కాంట్రాక్టు ఉద్యోగులు, పారామెడికల్ సిబ్బంది కాంట్రాక్ట్ నర్సులు అందరూ తమ విధులను పక్కన పెట్టి, పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని జేఏసీ చైర్మన్ శరత్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ.. ఇటీవల కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వ పెద్దలు చర్చలు జరిపారని గుర్తు చేశారు. వచ్చే నెల 3వ తేదీ వరకు గడువు ఇస్తే.. ఈలోగా ఆర్థికేతర (నాన్ ఫైనాన్షియల్) అంశాలన్నింటినీ తక్షణమే క్లియర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే ప్రభుత్వం అడిగిన గడువు ముగుస్తున్నా.. ఇప్పటి వరకు ఆ నాన్ ఫైనాన్షియల్ అంశాలపై ఎలాంటి స్పష్టతా ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే తాము రాష్ట్ర స్థాయి ఉద్యమానికి వెళ్లాల్సి వస్తోందని, అందులో భాగంగానే ఈ రాయలసీమ జోనల్ మీటింగ్ నిరసన ప్రదర్శనలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొంటారని చెప్పారు...

## శాసనాలను మార్చగలిగిన శక్తి ఒక్క దేవునికే ఉంది

**: ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ, సెప్టెంబర్ 24 (నేటి శుభోదయ):-బైబిల్‌లో చెప్పిన విధంగా శాసనాలను మార్చగలిగిన శక్తి ఆ దివ్య దేవునికి మాత్రమే ఉందని, అజిత్‌సింగ్‌నగర్ ఆర్సీఎం చర్చి నూతన నిర్మాణం విషయంలో ఇది మరోసారి రుజువైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు.గురువారం అజిత్‌సింగ్‌నగర్‌లోని ఆర్సీఎం చర్చి (పరిశుద్ధ సిలువ దేవాలయం) నూతన నిర్మాణానికి వైభవోపేతంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొండా ఉమా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవునికి అసాధ్యమైనదేది లేదని, ఆయన తలచుకుంటే శాసనాలను సైతం మార్చగలరని అన్నారు. గతంలో చర్చిలు, మసీదులు, దేవాలయాల నిర్మాణాలకు భవన అనుమతులు, ఇతర ఛార్జీల రూపంలో అధిక మొత్తంలో ఖర్చు అయ్యేదని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో ఏపీ బిల్డింగ్ రూల్స్--2017లో చేసిన సవరణల ద్వారా మతపరమైన ప్రార్థనా మందిరాల నిర్మాణానికి అనుమతి ఫీజులు, ఇతర ఛార్జీల విషయంలో మినహాయింపులు కల్పించడం జరిగిందన్నారు. దీంతో అజిత్‌సింగ్‌నగర్ ఆర్సీఎం చర్చి నూతన నిర్మాణానికి అనుమతులు సులభతరమయ్యాయని, ఇది యేసుప్రభువు చేసిన గొప్ప కార్యంగా తాను భావిస్తున్నానని ఉమా పేర్కొన్నారు. ఈ పవిత్ర దేవాలయ నిర్మాణంలో యేసయ్యే ముందుండి అన్ని కార్యాలను నడిపిస్తున్నారని, చర్చి నిర్మాణానికి తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. విజయవాడ మేత్రాణులు మోస్ట్ రెవ. డాక్టర్ జోసెఫ్ రాజారావు తెలగతోటి మాట్లాడుతూ అజిత్‌సింగ్‌నగర్‌లో ఆర్సీఎం చర్చి నూతన దేవాలయ నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు దేవుడిచ్చిన గొప్ప బహుమతి అని అన్నారు. సంఘస్తులంతా ఒకే కుటుంబంలా ఐకమత్యంతో ఉంటూ దేవుని ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించి, ఎమ్మెల్యే అజిత్‌సింగ్‌నగర్ విచారణ గురువులు ఫాదర్ గద్దం జోజి, ఇతర ఫాదర్లు, సిస్టర్లు, సంఘ పెద్దలు, సంఘస్తులతో కలిసి నూతన దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు ఎం. గాబ్రియేల్, ఎం. చిన్నప్ప, కిషోర్, అనిల్ ఫ్రాన్సిస్, మరియదాస్, ఫ్రాన్సిస్, స్లీవరాజు, విజయ్, కిరణ్, వినోద్, పరిశుద్ధ సిలువ దేవాలయం సంఘ పెద్దలు బూరె రాజేష్, పాగోలు రాము, వై. జాన్ పీటర్, ఆర్. ఆంటోని, బాలరాజు, జోజియప్ప, చిన్నప్ప, రవికుమార్, ప్రదీప్‌కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, సెప్టెంబర్ 24(నేటి శుభోదయ):-16వ డివిజన్ స్క్రూబ్రిడ్జి దగ్గర ఉన్న కే హోటల్ సమీపంలో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొన్నారు. అక్కడ జరుగుతున్న పూజల్లో పాల్గొని, అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గద్దె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితికి ప్రత్యేకత ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో ప్రజలంతా ఒక చోటకు చేరి ఉద్యమ సమాచారాన్ని తెలుసుకోడానికి ఈ పండగను ఘనంగా ప్రజలంతా బయటకు వచ్చి నిర్వహించేవారన్నారు. స్వామి వారి అన్నదానాన్ని ప్రజలకు ఎంతో పవిత్రంగా భావిస్తారని అందువల్లనే ఇంత వర్షంలో కూడా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించడానికి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో భక్తులుహజరు అవుతున్నారని గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పార్టీ నాయకులు గోగుల యేసు, గోగుల గోపి, రత్నం రమేష్, సింగంశెట్టి రమేష్, వేముల దుర్గారావు, గల్లా శ్రీను, మైలమూరు పీర్‌బాబు, పత్తి రామారావు, దేవుళ్ళ శ్రీను, జాని, కాళీ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి కూలిన చెట్ల ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, సెప్టెంబర్ 24(నేటి శుభోదయ):-బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.నగరంలో కురుస్తున్న వర్షాలు, గాలులకు తూర్పు నియోజకవర్గంలో ఏర్పడిన పరిస్థితులను ఎమ్మెల్యే గద్దె గురువారం ఉదయం పరిశీలించారు. 6వ డివిజన్లో గుమ్మడి బజార్లో పడిన పెద్ద వృక్షాన్ని, 19వ డివిజన్ పకీర్ గూడెం కమ్యూనిటీ హాలు దగ్గర ఇంటిపై పడిన భారీ వృక్షాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలకు పడిన ఈ పెద్ద చెట్లను తొలగించాల్సిందిగా కార్పోరేషన్ అధికారులను ఆదేశించానన్నారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా నగరంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

కొండ ప్రాంతా వాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, కొండ రాళ్ళు పడే అవకాశం ఉన్న ప్రాంతాల గురించి ముందుగానే తెలిస్తే తనకు తెలియజేయాలని అధికారులను పంపి రక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అదే విధంగా పురాతన భవనాల్లో ఉండే వారు కూడా, పెద్ద చెట్లు ఉన్న ప్రాంతాల్లో నివాసితులు కూడా అప్రమత్తంగా ఉండాలని గద్దె సూచించారు. వర్షం వల్ల నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పడాల గంగాధర్, భాగం సాయి ప్రసాద్, రత్న రమేష్, పడమట సతీష్ చంద్ర, దయాల శిరీష గాంధీ, పడాల వాసు, దున్న యేసురత్నం, నిమ్మల జ్యోతి, కోటివిడతల కోటేశ్వరరావు, పునుగుపాటి మోహన్రావు, పరసా రఘు, పడాల నాగు తదితలు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలే బేఖాతర్

**- గదుల్లోనే మూలుగుతున్న గత దసరా చీరలు**

**ఖమ్మం జూబ్లీ క్లబ్‌లో గుట్టలుగా ప్రభుత్వ చీరల దృశ్యాలు**

**- ఏడాది గడిచినా పేద మహిళలకు అందని పండుగ కానుకలు**

**- మెప్మా అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు, బాధ్యత ఎవరిది..**



ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేదల కోసం పరితపించే వ్యక్తి గా పేరుంది. ఆయన చేసే అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఆదర్శం అని చెప్పక తప్పదు. అలాంటి మంత్రి పేదల కోసం ఇచ్చిన హామీలను సైతం బేఖాతర్ చేయడం ఇప్పుడు ఖమ్మం నగరంలో పెద్ద హాట్ ట్రాపిక్ గా మారింది. వివరాలోకి వెళ్ళితే... పేద మహిళలకు దసరా పండుగ కానుకగా అందించాల్సిన చీరలు ఏడాది గడిచినా వారికి చేరలేదు. గత దసరా పండుగకు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వ చీరలు ఖమ్మం నగరంలోని జూబ్లీ క్లబ్‌లో గుట్టలు గుట్టలుగా నిల్వ ఉండటం అధికారుల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తోంది. పండుగ సందర్భంగా పేద మహిళలకు అందించాల్సిన చీరలు ఇలా గదులకే పరిమితం కావడం మెప్మా అధికారుల పర్యవేక్షణ తీరును ప్రశ్నార్థకం చేస్తోంది.దసరా పండుగ వేళ నిరుపేద మహిళలకు అందించాల్సిన చీరలు ఇప్పటికీ నిల్వ ఉండటం వెనుక కారణాలేమిటన్నది అంతుచిక్కడం లేదు. గత ఏడాది పంపిణీ చేయాల్సిన చీరలు ఇప్పటికీ జూబ్లీ క్లబ్‌లోనే ఉంటే వాటిని లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు ఏం చర్యలు తీసుకున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. - మెప్మా అధికారుల పర్యవేక్షణ ఏదీ ప్రభుత్వం పేద మహిళల కోసం పంపిన చీరలు అర్హులకు చేరాయా లేదా అన్నది పర్యవేక్షించాల్సిన బాధ్యత మెప్మా అధికారులపై ఉంది. ఏడాది క్రితం పంపిణీ చేయాల్సిన చీరలు ఇంకా నిల్వ ఉండటంతో అధికారుల పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చీరలు ఎన్ని వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకా ఎన్ని నిల్వ ఉన్నాయి అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుంది. కానీ గత దసరా చీరలే ఇంకా గదుల్లో ఉంటే పథకాల అమలులో అధికారుల బాధ్యత ఎంతవరకు నెరవేరిందన్నది చర్చనీయాంశంగా మారింది. నిల్వ ఉన్న చీరల పరిస్థితి, వాటి పంపిణీలో జాప్యానికి గల కారణాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.గత దసరా చీరలు ఈ దసరాకైనా పేద మహిళలకు అందుతాయా లేక జూబ్లీ క్లబ్ గదుల్లోనే మిగిలిపోతాయా మెప్మా అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.

## అకాల వర్షాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై ఈవో వి.కె. శీనా నాయక్ విస్తృత క్షేత్రస్థాయి పరిశీలన

**కొండచరియలు, ఘాట్ రోడ్డు రిటైనింగ్ వాల్ పటిష్టతపై ప్రత్యేక దృష్టి**



విజయవాడ, సెప్టెంబర్ 24 (నేటి శుభోదయ):-కోస్తా తీరంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో విజయవాడ నగరంలో కురుస్తున్న అకాల భారీ వర్షాల తీవ్రతను పురస్కరించుకుని, ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రత, ముందస్తు రక్షణ చర్యలను పర్యవేక్షించేందుకు దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ గురువారం సాయంత్రం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు.?ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ శ్రీ అమ్మవారి ప్రధాన ఆలయ ప్రాంగణం నుండి తనిఖీని ప్రారంభించి చిన్న రాజగోపురం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం, నటరాజ స్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఘాట్ రోడ్డు మీదుగా కాలి నడకన ఓం టర్నింగ్ వద్ద కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న సున్నితమైన ప్రాంతాలను, రక్షణగా నిర్మించిన రిటైనింగ్ వాల్ పటిష్టతను, ఘాట్ రోడ్డు దిగువ భాగం వరకు నడక మార్గాలను క్షుణ్ణంగా పరిశీలన చేశారు.వర్షాల కారణంగా కొండపై నుండి మట్టి, రాళ్లు లేదా కొండచరియలు జారిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలలో రిటైనింగ్ వాల్ పటిష్టతను నిరంతరం పర్యవేక్షించాలి. గతంలో కొండచరియలు జారిన ప్రాంతాలు, ఓం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన ఇనుప రక్షణ వలలు రక్షణ గోడల వద్ద ఇంజనీరింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎక్కడా రాళ్లు లేదా వర్షపు నీరు రోడ్డుపైకి రాకుండా తక్షణ సహాయక చర్యలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఘాట్ రోడ్డులో ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతు పనుల పురోగతిని సమీక్షించిన ఈవో, వర్షపు నీరు ఎక్కడా రోడ్డుపై నిల్వ ఉండకుండా వేగంగా డ్రైనేజీ ద్వారా కిందకు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ?కనకదుర్గ నగర్ ప్రాంతాన్ని సందర్శించి, కొండపై నుండి వరదలా వచ్చే వర్షపు నీరు ఎక్కడా చేరకుండా ఏర్పాటు చేసిన డ్రైనేజీ అవుట్‌లెట్లను పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పూడికతీత చర్యలు చేపట్టాలని ఈవో సూచించారు.నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని సందర్శించిన అనంతరం ఈవో కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మహా మండపం 6వ అంతస్తులో కొనసాగుతున్న దేవస్థాన ప్రధాన స్టోర్స్ విభాగాన్ని పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా కొత్త అన్నదాన భవనం సెల్లార్‌లోని విశాలమైన ప్రాంగణానికి తక్షణమే తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని వర్షాల వల్ల కొండపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఇంజనీరింగ్, శానిటేషన్ నిరంతరం సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఈవో శీనా నాయక్ స్పష్టం చేశారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమతి ఎల్. రమ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోన ఉప్పలపాడులో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి విస్తృత పర్యటన

**అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతాం**



యాడికి సెప్టెంబర్ 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల పరిధిలోని కోన ఉప్పలపాడు గ్రామంలో స్థానిక శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి గురువారం ఘనంగా పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ప్రజలు పూలమాలలతో ఆత్మీయ స్వాగతం పలికారు. ముందుగా, గ్రామ ప్రజల సుదీర్ఘకాల తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా నూతనంగా ఏర్పాటు చేసిన బోరు బావులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ గ్రామసభ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. గత ప్రజాదర్బార్‌లో స్థానిక రైతులు తమ భూములు అటవీ శాఖ ఆధీనంలో ఉన్నాయని, వాటికి సంబంధించి హక్కులు కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దీనిపై తక్షణమే స్పందించిన జేసీ అస్మిత్ రెడ్డి, జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యను సత్వరమే పరిష్కరించారు. అందులో భాగంగా, అర్హులైన రైతులకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను పరిష్కరించి, తమ చేతులకు పాస్ పుస్తకాలు అందించినందుకు రైతులు ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా తాము నిరంతరం కష్టపడతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ పర్యటన కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, జేసీ అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

జనరల్ న్యూస్

శుక్రవారం - 25 - సెప్టెంబర్ - 2026

## అక్టోబర్ 1 మధ్యాహ్నం నుంచే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

**- రూ.2,692.34 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**

**- బ్యాంకుల సెలవులు, సమ్మె ఉన్నా పింఛనుదారులకు ఇబ్బంది కలగనివ్వం**

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

అమరావతి, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: రాష్ట్రంలో 61.80 లక్షల మంది పింఛనుదారులకు అక్టోబర్ 1న పింఛన్లు అందజేసేందుకు ప్రభుత్వం రూ.2,692.34 కోట్ల విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విడుదల చేసే మొత్తం నిధుల్లో రూ.2,675.63 కోట్లను సంబంధిత స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు పింఛను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని రూ.16.65 కోట్లను పింఛనుదారుల బ్యాంకు ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) ద్వారా నేరుగా జమ చేస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, ఎస్ ఎన్ ఏ ఎస్ పిఏఆర్ ఎస్ హెచ్ విధానం ద్వారా ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో నేరుగా డిబిటి ద్వారా పింఛన్లను జమ చేసే ప్రక్రియను విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో పైలట్ ప్రాతిపదికన అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం ఈ మండలంలోని ఎన్ఎస్ఏపి పింఛనుదారుల ఖాతాల్లో రూ.0.06 కోట్లు నేరుగా జమ కానున్నట్లు మంత్రి కొండపల్లి తెలిపారు. సెప్టెంబర్ 26వ తేదీ శనివారం బ్యాంకు సెలవు కావడం, అలాగే సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె ఉన్న నేపథ్యంలో పింఛనుదారులకు ఎలాంటి అవస్థలు కలగకుండా ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు మంత్రి తెలిపారు. ఈ మేరకు అక్టోబర్ 1వ తేదీ ఉదయమే పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును విత్‌డ్రా చేసుకునేలా బ్యాంకులను అందుబాటులో ఉంచాలని ఎస్ ఎల్ బిసి (రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి)కి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సిబ్బంది అక్టోబర్ 1వ తేదీ ఉదయం బ్యాంకుల నుండి నగదును విత్‌డ్రా చేసి అదే రోజు మధ్యాహ్నం నుంచే నేరుగా ఫించన్‌దారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు. బ్యాంకు సెలవులు, సమ్మె కారణాల వల్ల పింఛన్ల పంపిణీ తేదీ, విధానంలో జరిగిన ఈ మార్పులను పింఛనుదారులందరూ గమనించి, పంపిణీ సిబ్బందికి మరియు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.

## సమస్యలకు నిలయం త్రీ టౌన్ ఏరియా ప్రాంతం



ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరం త్రీ టౌన్ ఏరియా సమస్యలకు నిలయంగా మారింది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం కారణంగా సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. చినుకు పడితే చాలు రోడ్లపై మురుగునీరుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నగరంలోని రద్దీగా ఉంటూ వ్యాపార సముదాయాలు ఉన్న ప్రాంతంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి హార్కార బావి సెంటర్,కోహినూర్ అపార్ట్మెంట్, విశ్వా టవర్స్, పొట్టి శ్రీరాములు రోడ్డు ప్రాంతాలు మురుగు నీటితో కాలువలను తలపిస్తున్నాయి. సుమారు రెండుఏళ్ల క్రితం కాలువ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారని ఆ పనులు నేటికీ పురోగతి లేదని స్థానిక మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామమోహన్ రావు ఆరోపిస్తున్నారు. కాలువ నిర్మాణ పనులు జరగకుండా ఎవరు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. వ్యాపార సముదాయాలతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు అధికారులకు పాలకులకు కనిపించట్లేదా అంటూ నిలదీస్తున్నారు. తక్షణమే మంత్రి, అధికారులు స్పందించి త్రీ టౌన్ ఏరియాలో నెలకొని ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ నూతన టెర్మినల్ పనులను వేగవంతం చేయాలి

**-కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజి**



గన్నవరం, సెప్టెంబర్ 24 నేటి శుభోదయ : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ నూతన టెర్మినల్ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణలో భాగంగా నిర్మాణంలో ఉన్న న్యూ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులను జిల్లా కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా టెర్మినల్ భవన నిర్మాణంతో పాటు వివిధ విభాగాల్లో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విమానాశ్రయ విస్తరణతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించి పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.కలెక్టర్ వెంట గన్నవరం విమానాశ్రయ జనరల్ మేనేజర్ రామాచారి, డైరెక్టర్ లక్ష్మీ కాంత్ రెడ్డి, గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, గన్నవరం మండలం తహసీల్దార్ శివయ్య, ఇంజనీరింగ్ తదితర అధికారులు ఉన్నారు.

## రామవరప్పాడు--ప్రసాదంపాడు జాతీయరహదారి పై వర్షపు నీటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

**-వర్షపు నీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం**

**-ప్రసాదంపాడు శ్మశానవాటిక మార్గంలోని సంపు వద్ద పూడికతీత పనులు**

**ఎమ్మెల్యే ఆదేశాలతో రంగంలోకి దిగిన పంచాయతీ అధికారులు**



విజయవాడ, సెప్టెంబర్ 24,నేటి శుభోదయ: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు--ప్రసాదంపాడు జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రసాదంపాడు హిందూ శ్మశానవాటికకు వెళ్లే మార్గంలోని సంపు వద్ద నీటి సరఫరా మార్గంలో మట్టి పేరుకుపోవడంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో వెంటనే స్పందించి సంపును తెరిచి పూడికతీత పనులు చేపట్టాలని, డ్రైనేజీ మార్గాన్ని శుభ్రం చేసి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు రామవరప్పాడు--ప్రసాదంపాడు ప్రాంతంలో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు పూడికతీత పనులు చేపట్టారు. నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



## అమరావతిలో వరుసగా రెండో రోజు కొనసాగిన ప్రపంచ బ్యాంక్, ఏడీబీ బృందం పర్యటన

అమరావతి, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: నాలుగవ జాయింట్ ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ మిషన్‌లో భాగంగా ప్రపంచ బ్యాంక్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడిబి) ప్రతినిధుల బృందం అమరావతిలో పర్యటించింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజైన గురువారం, సెప్టెంబర్ 24న రాయపూడి ఏపీ సి ఆర్ డిఏ ప్రధాన కార్యాలయంలో ఏపీ సి ఆర్ డిఏ, ఏడిసి ఎల్, ఏజిఐసి ఎల్ అధికారులతో వివిధ అంశాలపై సమావేశాలు నిర్వహించి, అమరావతి అభివృద్ధి పనుల పురోగతిని బ్యాంక్ ప్రతినిధులు సమీక్షించారు. అమరావతిలో ప్రజా రవాణాను మెరుగుపరిచే దిశగా బస్ రాపిడ్ ట్రాన్సిట్(బిఆర్ టి) కారిడార్ అధ్యయనం, దాని అమలుకు సంబంధించిన కార్యాచరణ, రోడ్డు అనుసంధానం, వీధుల అభివృద్ధి, బస్ టెర్మినల్స్, బస్ స్టాపల ఏర్పాటుపై చర్చించారు. లో-ఫ్లోర్ బస్సులకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులపై సైతం చర్చ జరిగింది. అమరావతిలో సమగ్ర టౌన్‌షిప్ ప్రణాళిక, ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్(టిఓడి) కు అనువైన ప్రాంతాల గుర్తింపుపై సైతం సమావేశంలో చర్చ జరిగింది. రెండో రోజు నిర్వహించిన సమావేశాలలో ఏపీ సి ఆర్ డిఏ అడిషనల్ కమిషనర్లు సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఐఏఎస్, టి. రాహుల్ కుమార్ రెడ్డి ఐఏఎస్, ఏడిసి ఎల్ సీఎండీ డి. లక్ష్మి పార్థసారథి, పలువురు ముఖ్య అధికారులు పాల్గొన్నారు. వరద నిర్వహణకై పర్యవేక్షణ వ్యవస్థల ఏర్పాటు, మౌలిక వసతుల పురోగతిని సమీక్షించారు. కాలువలు, పంపింగ్ స్టేషన్లు, గ్రీన్ బఫర్లు, స్థానిక డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధితో పాటు ప్రతిపాదిత వరద రక్షణ పనులకు అవసరమైన నిధులు, బడ్జెట్‌పై చర్చలు జరిగాయి. అగ్నిమాపక వ్యవస్థకు సంబంధించి మౌలిక వసతుల ప్రణాళిక, యాక్టివ్ కన్‌స్ట్రక్షన్ సైట్‌లలో ఫైర్ రిస్క్ మేనేజ్‌మెంట్ చర్యలపై సైతం సమీక్ష జరిగింది. ప్రభుత్వ గృహ నిర్మాణ పనుల పురోగతి, గ్రీన్ అండ్ రెసిలియంట్ హౌసింగ్ సర్టిఫికేషన్, అందుబాటు ధరలలో గృహ నిర్మాణ ప్రణాళికల అమలు, ఈ అంశాలలో రాబోయే సంవత్సరాల లక్ష్యాలపై చర్చ జరిగింది.అమరావతిలో ఆర్థిక వనరుల సమీకరణ వ్యూహాలు, పిపిపి తరహాలో జాయింట్ డెవలప్‌మెంట్ ప్రతిపాదనలు, పెట్టుబడులను సమీకరించే అవకాశాలు, యాంకర్ ఇన్వెస్టర్ల పురోగతిపై చర్చలు జరిగాయి. సస్టైనబుల్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఎస్ ఈఎంపి), బిజినెస్ స్ట్రాటజీ అమలు కార్యాచరణ, లక్ష్యాలపై సమీక్ష జరిగింది. కీలక రంగాలు, థీమ్ సిటీల అభివృద్ధి అవకాశాలపై బ్యాంక్ ప్రతినిధులు ఏపీ సి ఆర్ డిఏ అధికారులతో చర్చించారు. అమరావతిలో కొనసాగుతున్న, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పిపిపి) ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించి, అదనపు నిధుల కింద పిపిపి ల ద్వారా సాధించాల్సిన లక్ష్యాలు, ఆశించిన ఫలితాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో అమరావతి అభివృద్ధికి సంబంధించిన వివిధ రంగాల్లో పురోగతి, భవిష్యత్ కార్యాచరణ, అదనపు నిధుల అవసరాలు, అమలు లక్ష్యాలపై అధికారులతో ప్రపంచ బ్యాంక్, ఏడీబీ ప్రతినిధులు సమగ్రంగా చర్చించారు. ప్రజా రవాణా, మౌలిక వసతులు, గృహ నిర్మాణం, వరద నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, పెట్టుబడులు, పిపిపి లు వంటి రంగాల్లో సమన్వయంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లే దిశగా ఏపీ సి ఆర్ డిఏ తన కార్యాచరణను కొనసాగిస్తోందని అధికారులు బ్యాంక్ ప్రతినిధులకు వెల్లడించారు. సమావేశాలు ముగిసిన అనంతరం బ్యాంక్ ప్రతినిధులు నిర్మాణం పూర్తయిన ఎమ్మెల్యే ఠ ఎమ్మెల్సీ టవర్లు, గ్రావిటీ కెనాల్ అభివృద్ధి పనులు , ఈ 3- ఎన్ 10 జంక్షన్ వద్దనున్న నర్సరీ, ఈ 6- ఎన్ 9 జంక్షన్, ఈ 3- ఎన్ 12 జంక్షన్, ఆర్ విఆర్ లేబర్ క్యాంపులను సందర్శించారు. లేబర్ క్యాంపులో కార్మికులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. లేబర్ క్యాంపు నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ 3- ఎన్ 10 జంక్షన్ వద్దనున్న నర్సరీలో ఏడిసి ఎల్ సీఎండీ డి.లక్ష్మి పార్థసారథి బ్యాంక్ ప్రతినిధులతో ట్రాన్స్‌లోకెటడ్ చెట్లను నాటించారు. అమరావతిలో పురోగతి దిశగా సాగుతున్న పలు ప్రాజెక్టులను పరిశీలించిన బ్యాంక్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## జనాల గుండెల్లోఉన్న జగదీశన్న త్వరగా రా

**లారీ రూపంలో వచ్చిన ముప్పు, కన్నీరు మున్నీరవుతున్న 'తిరుమలాయపాలెం ప్రజలు**

**- క్షతగాత్రులను పరామర్శించిన పలువురు నేతలు**




తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: సమాజంలో పోలీస్ అంటే ఒక 'భయం'. కానీ ఇక్కడ పోలీస్ అంటే ఒక 'అభయం'. ఆయన పేరు కూచిపూడి జగదీశ్.హోదా తిరుమలాయపాలెం సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై). కానీ ఈ మండలానికి ఆయన కేవలం ఒక అధికారి కాదు. ఏ ఇంట ఏ కష్టం వచ్చినా అర్ధరాత్రైనా పరుగున వచ్చే ఒక 'సొంత మనిషి'. బుధవారం అర్ధరాత్రి వేగంగా దూసుకొచ్చిన మృత్యుశకటం (లారీ) పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టి, మన ఎస్సై జగదీశ్, డ్రైవర్ రాకేష్‌లను ఆసుపత్రి పాలు చేసిందన్న వార్త వినగానే తిరుమలాయపాలెంలో ఒక్కసారిగా చీకట్లు ముసిరాయి. ప్రతి ఇల్లూ తమ సొంత అన్నదమ్ముడికి దెబ్బ తగిలినట్టు విలవిలలాడిపోయింది.

### న్యాయం కోసం కాదు, ఆయన్ను చూడటం కోసం



ప్రతిరోజూ తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ ముందు జనం కనిపిస్తారు. అది న్యాయం కోసమో, గొడవల కోసమో . కానీ ఈరోజు ఆసుపత్రి ముందు జనం బారులు తీరారు. అది కేవలం తమ 'జగదీశన్న' ఎలా ఉన్నాడో తెలుసుకోవడం కోసం. బుధవారం అర్ధరాత్రి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుంచి చేపల లోడుతో ఉత్తరప్రదేశ్‌కు వెళ్తున్న లారీ (ఏపీ - 16- టిహెచ్ -6179) భవానీ హోటల్ సమీపంలో పెట్రోలింగ్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జగదీశ్, రాకేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ చేదు నిజం తెలియగానే మండలం మొత్తం కన్నీటి పర్యంతమైంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, పాలేరు నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, ఉపాధ్యక్షులు సామ శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం రాజశేఖర్, ఖమ్మం జిల్లా జేపీసీ అధ్యక్షుడు మండడి ఇజ్రాయిల్, మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్, సర్పంచ్ లు కర్నాటి రాజేంద్రప్రసాద్ వనవాసం నరేందర్ రెడ్డి గూడూరు ఉపేందర్ గుమ్మడి దేవబిక్షం నందిపాటి మల్లికార్జున్ ఉపసర్పంచ్ అంగిరేకుల సతీష్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నల్లమల్ల ప్రతాప్ నంద్యాల శ్యాంసుందర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి బత్తుల రవికుమార్ మోరపాక నాగయ్య తవడ బోయిన కృష్ణ కొప్పుల రాంరెడ్డి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవింద సురేష్, మండల ఇన్‌ఛార్జ్ చింతిరాల నాగభూషణం, తిరుమలాయపాలెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పసలాది సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కూరపాటి విజయ్ లతో పాటు వందలాది మంది ప్రజలు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి వస్తున్నారు.

### -- తిరుమలాయపాలెం ఎదురుచూస్తోంది

ప్రస్తుతం ఎస్సై జగదీశ్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెబుతున్నా, మండల ప్రజల మనసు మాత్రం శాంతించడం లేదు. తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న డ్రైవర్ రాకేష్ కూడా త్వరగా కోలుకోవాలని అందరూ కోరుకుంటున్నారు. తిరుమలాయపాలెం మండల గాలిలో ఇప్పుడు ఒకే ఒక్క ప్రార్థన వినిపిస్తోంది. "జగదీశన్న.. నువ్వు త్వరగా కోలుకుని, మళ్లీ అదే చిరునవ్వుతో, అదే ధైర్యంతో మా మధ్యకు తిరిగి రావాలి" అని మండలం మొత్తం బరువెక్కిన గుండెతో, కళ్లల్లో ఆశతో ఎదురుచూస్తోంది

## ఆయిల్ పామ్ రైతుల నోట్లో మట్టి కొట్టేలా కేంద్ర నిర్ణయం

**: మంత్రి తుమ్మల**

**- రైతులను ఆయిల్ పామ్ వైపు ప్రోత్సహిస్తూ అదే రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధానాలు ఎందుకు**

**- దిగుమతి సుంకం తగ్గింపుతో దేశీయ ఆయిల్ పామ్ రైతులకు ధరలపై ఒత్తిడి పడే అవకాశం**

**- రాష్ట్రం 44 శాతం దిగుమతి సుంకం కోరుతుంటే, కేంద్రం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించింది**

**- కేంద్ర నిర్ణయం ఆయిల్ పామ్ రైతుల్లో అనిశ్చితిని పెంచే అవకాశం**

**- దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే పునరాలోచించాలి**

**- రైతులను ఆయిల్ పామ్ వైపు మళ్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు**

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు కేంద్ర దిగుమతి సుంకం తగ్గింపు ప్రతికూలంగా మారే అవకాశం**



ఖమ్మం, హైదరాబాద్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ముడి పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయంపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు దేశంలో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని, రైతులను ఈ పంట వైపు మళ్లించాలని రాష్ట్రాలకు సూచిస్తూ మరోవైపు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాన్ని తగ్గించడం కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు."రైతును ఆయిల్ పామ్ సాగు చేయమని ప్రోత్సహిస్తారు. కానీ రైతు పండించిన గెలలకు గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితులను మాత్రం కేంద్రం దెబ్బతీస్తోంది. ఒక చేత్తో రైతును ఆయిల్ పామ్ వైపు నడిపిస్తూ మరో చేత్తో దిగుమతి సుంకం తగ్గించి విదేశీ పామాయిల్‌కు మార్కెట్‌ను సులభతరం చేయడం ఏ విధమైన రైతు అనుకూల విధానం?" అని మంత్రి ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో క్రూడ్ పామ్ ఆయిల్‌పై మొత్తం దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గింది. దీంతో దిగుమతి చేసుకునే పామాయిల్‌కు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్ పామ్ గెలల ధరలపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు."తెలంగాణ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరుతున్న సమయంలో కేంద్రం సుంకాన్ని తగ్గించడం బాధ్యతారాహిత్యమైన నిర్ణయం. రైతులకు ధర భరోసా కల్పించాల్సిన సమయంలో విదేశీ దిగుమతులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా కేంద్రం ఎవరికి ప్రయోజనం కల్పించాలనుకుంటోంది?" అని తుమ్మల ప్రశ్నించారు.ఆయిల్ పామ్ అనేది సాధారణంగా ఒక సీజన్‌లో పండించి విక్రయించే పంట కాదని, రైతు సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టి, నీరు, ఎరువులు, నిర్వహణ ఖర్చులు భరిస్తూ సాగు చేసే దీర్ఘకాలిక పంట అని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పంటకు మార్కెట్ ధరపై విధానపరమైన స్థిరత్వం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు."ఈరోజు మొక్క నాటిన రైతు రేపే పంట అమ్మడు. సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టిన తర్వాత మార్కెట్ విధానాలను మార్చేస్తే నష్టపోయేది రైతే. రైతుకు ధర భరోసా ఇవ్వకుండా, దిగుమతులకు తలుపులు మరింత విస్తరించడం రైతు ప్రయోజనాలకు విరుద్ధం" అని మంత్రి స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున విస్తరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకుపైగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు.రైతులను ఆయిల్ పామ్ వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీలు, నాట్ల విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్, మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, రిఫైనరీలు వంటి అనేక చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఎన్ ఎం ఈఓ - ఓపి ద్వారా దేశీయ ఆయిల్ పామ్ ఉత్పత్తిని పెంచి, వంట నూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రకటించింది."కేంద్రం ప్రకటించే లక్ష్యాలు ఒకలా అమలు చేసే విధానాలు మరోలా ఉంటే రైతు ఎలా నమ్మకం పెంచుకుంటాడు? ఆయిల్ పామ్ సాగు విస్తరణ కోసం రాష్ట్రాలు, రైతులు పెట్టుబడులు పెట్టిన తర్వాత దిగుమతి సుంకం వంటి కీలక విధానాలను మార్చడం వల్ల రైతుల్లో నమ్మకం దెబ్బతింటుంది" అని తుమ్మల అన్నారు. ఆయిల్ పామ్ రైతుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన తాజా ఆయిల్ పామ్ గెలలకు (ఎఫ్ ఎఫ్ బి) టన్నుకు రూ.25,000 కనీస హామీ ధర కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎఫ్ ఎఫ్ బి ధర ప్రభుత్వం నిర్ణయించే విధానం ప్రకారం అమలవుతోందని, రైతులకు మరింత స్థిరమైన ధర భరోసా అవసరమని పేర్కొన్నారు."రైతు ఆదాయం పెంచుతామని చెప్పే కేంద్ర ప్రభుత్వం ముందుగా రైతు పండించిన పంటకు ధర భరోసా కల్పించాలి. విదేశీ దిగుమతులపై ఆధారపడే విధానాన్ని ప్రోత్సహిస్తూ దేశీయ రైతు ఉత్పత్తికి ధర లేకుండా చేయడం ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికే విరుద్ధం" అని మంత్రి అన్నారు. భారత్ తన వంట నూనెల అవసరాల్లో పెద్ద భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటున్న నేపథ్యంలో, దేశీయ ఆయిల్ పామ్ సాగును బలోపేతం చేయడం కేవలం రైతు సంక్షేమానికే కాకుండా దేశ ఆహార, వ్యవసాయ భద్రతకు కూడా కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ తన వెజిటబుల్ ఆయిల్ అవసరాల్లో సుమారు మూడింట రెండొంతులు దిగుమతులపై ఆధారపడుతున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి."ఆత్మనిర్భర్ భారత్ అంటే విదేశీ దిగుమతులపై ఆధారపడటం కాదు. దేశ రైతు ఉత్పత్తి చేసే నూనెను పెంచడం. రైతును బలోపేతం చేయకుండా దిగుమతులను చౌక చేయడం ద్వారా దేశం ఆత్మనిర్భర్ కాదు. దేశీయ రైతు నిలబడితేనే దేశం నిలబడుతుంది" అని తుమ్మల స్పష్టం చేశారు.తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం సహకరించాల్సింది పోయి, రైతుల్లో అనిశ్చితి కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. "తెలంగాణ రైతులు నమ్మకంతో ఆయిల్ పామ్ సాగులోకి వచ్చారు. ఆ నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రైతు ప్రయోజనాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం రాజీ పడదు. కేంద్రం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించి, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించే విధానాన్ని తీసుకురావాలి" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించాలని, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు ధర భరోసా కల్పించేలా కేంద్రం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, లేని పక్షంలో ఎఫ్ ఎఫ్ బి లకు టన్నుకు రూ.25,000 కనీస హామీ ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## "మహేంద్ర ట్రాక్టర్స్ నూతన షోరూం ప్రారంభోత్సవం"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 24 (నేటి- శుభోదయ) తరతరాలుగా రైతులు మహేంద్ర ట్రాక్టర్స్ పట్ల అత్యంత విశ్వసనీయత కలిగి ఉన్నారని నేరెళ్ల రాజా ఆటోమొబైల్స్ ఎం.డి.నేరెళ్ల వశిష్ట అన్నారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామంలో నేరెళ్ల రాజా ఆటోమొబైల్స్ వారి మహేంద్ర ట్రాక్టర్స్ నూతన షోరూమ్ ను గురువారం ఘనంగా ప్రారంభించారు. కస్టమర్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 2,000 మందికి పైగా రైతులు, కస్టమర్లు, మెకానిక్‌లు హాజరయ్యారు.ఈ సందర్భంగా నేరెళ్ల వశిష్ట మాట్లాడుతూ మహీంద్రా ట్రాక్టర్లపై, నేరెళ్ల రాజా ఆటోమొబైల్స్‌పై రైతులకు ఉన్న నమ్మకానికి కస్టమర్ మీట్‌కు వచ్చిన భారీ స్పందనే నిదర్శనమని తెలిపారు.జియో సిరీస్, ఓజా సిరీస్, నోవో సిరీస్, యువ టెక్ ప్లస్ సిరీస్, భూమిత్ర సిరీస్ వంటి పలు రకాల ట్రాక్టర్ సిరీస్‌లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్త సిరీస్ ట్రాక్టర్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.1983 నుంచి మహీంద్రా ట్రాక్టర్స్ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోందని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం కొత్త కొత్త మోడళ్లను మార్కెట్‌లోకి తీసుకువస్తున్నామని తెలిపారు.నూతన షోరూం ప్రారంభో త్సవానికి భారీ సంఖ్యలో హాజరైన వినియోగదారులు, రైతులకు ధన్యవాదాలు తెలిపారు. జనసేన నాయకులు పైబోయిన వెంకటరామయ్య ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు గుడివాడ ఐ. ఎం. ఎ. హాల్లో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గుడివాడ నియోజకవర్గ ప్రజలకు 25వ తేదీన గుడివాడ నియోజకవర్గంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజలు తమకు సంబంధించిన వివిధ సమస్యలు, ఫిర్యాదులు, అభ్యర్థనలు తెలియజేసుకునే అవకాశం కలదు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించుటకు అధికారులు తగిన చర్యలు తీసుకొనబడును.కావున గుడివాడ నియోజకవర్గ ప్రజలు ఉదయం 10.30 గంటల నుండి ఐ. ఎం. ఎ హాల్ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ), గుడివాడ బస్టాండ్ ఎదురుగా రోడ్డు, గుడివాడ మండలం నందు నిర్వహించు కార్యక్రమమును గుడివాడ నియోజకవర్గంలోని సమస్త ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అనంతపురం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఐదేళ్ల పదవీ కాలం విజయవంతం.

**బోయ గిరిజమ్మ కుఘనంగా జడ్పీటీసీలు, జడ్పీ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు**

**ఆత్మీయ సన్మాన కార్యక్రమం**



అనంతపురం సెప్టెంబర్ 24 నేటి శుభోదయ: అనంతపురం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఐదు సంవత్సరాల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆత్మీయ వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కు జిల్లాలోని జడ్పీటీసీ సభ్యులందరినీ శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా విజయవంతమైన ఐదేళ్ల పాలన పూర్తి చేసుకున్నందుకు గాను జిల్లాలోని జడ్పీటీసీలు, జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓలు పరిపాలనా సిబ్బంది అంతా కలిసి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ, ఈ ఉన్నతమైన అవకాశాన్ని కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, తన గెలుపునకు సహకరించిన ఆత్మకూరు మండల ప్రజానీకానికి, సహచర జడ్పీటీసీలకు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల పాలనలో సిబ్బంది సమస్యల పరిష్కారానికి, జిల్లా సమగ్రాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.ఉద్యోగులకు కారుణ్య నియామకాలు, పదోన్నతులు:జిల్లా పరిషత్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశామని ఆమె తెలిపారు. కారుణ్య నియామకాలు: మొత్తం 180 మందికి ఉద్యోగాలు కల్పించి ఆయా కుటుంబాలకు అండగా నిలిచారు (జూనియర్ అసిస్టెంట్లు -- 67, టైపిస్టులు -- 43, ఆఫీస్ సబార్డినేట్లు -- 70).పదోన్నతులు 301 మంది ఉద్యోగులకు గౌరవప్రదంగా ప్రమోషన్లు కల్పించారు. ( ఏ ఓ నుండి ఎంపీ డి ఓ 32, సీనియర్ అసిస్టెంట్ నుండి డిప్యూటీ ఎంపీడీవో -- 48, సీనియర్ అసిస్టెంట్ నుండి ఏ ఓ-- 42, జూనియర్ అసిస్టెంట్ నుండి సీనియర్ అసిస్టెంట్ -- 112, రికార్డ్/ల్యాబ్ అసిస్టెంట్ నుండి జూనియర్ అసిస్టెంట్ -- 12, ఆఫీస్ సబార్డినేట్ నుండి డ్రైవర్ -- 2, ఆఫీస్ సబార్డినేట్ నుండి రికార్డ్/ల్యాబ్ అసిస్టెంట్ -- 53). రూ. 129.53 కోట్ల జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు:జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల సమగ్ర ప్రగతి కోసం సాధారణ నిధులు (రూ. 24.12 కోట్లు), 15వ ఆర్థిక సంఘం నిధులు (రూ. 105.41 కోట్లు) కలిపి మొత్తం రూ. 129.53 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు:రోడ్ల నిర్మాణం, మరమ్మతులు: రూ. 39.19 కోట్లు. తాగునీటి సౌకర్యాలు: రూ. 64.64 కోట్లు సీసీ డ్రైన్లు: రూ. 11.18 కోట్లుకల్వర్టుల నిర్మాణం: రూ. 5.79 కోట్లు.అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి: రూ. 59 లక్షలు ఇతర అభివృద్ధి పనులు: రూ. 7.58 కోట్లు పదవి అనేది ప్రజలకు సేవ చేయడానికి దక్కిన బాధ్యత మాత్రమేనని, పదవీ కాలం ముగిసినప్పటికీ భవిష్యత్తులోనూ ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, జిల్లా అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని బోయ గిరిజమ్మ స్పష్టం చేశారు. జిల్లా ప్రథమ పౌరురాలిగా సేవ చేసే భాగ్యం దక్కినందుకు గర్విస్తున్నానని, సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయ మిత్రులు జిల్లా ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీల ఇళ్లల్లో సోదాలు



హైదరాబాద్, ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: అక్రమ ఆస్తుల కేసులో అరెస్టు అయిన డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న ఎనిమిదిమంది ఇళ్లల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, జహీరాబాద్ పది ప్రాంతాల్లో ఈ సోదాలు చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. భీమ్‌రెడ్డితో ఆర్థిక, ఇతర లావాదేవీలు ఉన్నట్లు అనుమానిస్తున్న వారి ఇళ్ల నుంచి పలు కీలక పత్రాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బొమ్మ వెంకటేష్ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేయగా రూ.1.35 కోట్ల అక్రమ నగదును గుర్తించామని వారు తెలిపారు. అంతేకాక భారీగా విదేశీ కరెన్సీని, సుమారు 14 లీటర్ల విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. అక్రమ మద్యం విషయాన్ని ఎక్సైజ్ శాఖకు తెలియజేశామని, ఎక్సైజ్ చట్టాల ప్రకారం సంబంధిత పోలీసులు కేసు నమోదు చేస్తారని తెలిపారు. భీమ్ రెడ్డి డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో పనిచేశారు. తెలంగాణ, కర్ణాటక వ్యాప్తంగా 16 ప్రాంతాలలో జరిగిన సోదాలలో రూ.200 కోట్లకు పైగా విలువైన స్థిరాస్తులు, చరాస్తులు బయటపడటంతో జూలైలో ఆయనను అరెస్టు చేసి చంచల్ గూడ జైలుకు తరలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనపై సెప్టెంబర్‌లో మనీలాండరింగ్ నిరోధక కేసు కూడా నమోదు చేసింది.

# పిల్లల రక్షణ మనందరి బాధ్యత

**పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు**

**చైల్డ్ ప్రొటెక్షన్ పాలసీ ప్రతి అధికారి తెలుసుకొని ఉండాలి**

**బాల్య వివాహాలను పూర్తిగా నివారించాలి**

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు




అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 24 నేటి శుభోదయ : పిల్లల రక్షణ పై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని చిన్నారులపై ఎటువంటి అఘాయిత్యాలు జరగకుండా చూడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావులు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్ లో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్ల మధుసూదన్ రావులు జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం వివిధ శాఖల అధికారులతో పిల్లల రక్షణ, వారి హక్కుల పై అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ..... పిల్లల పరిరక్షణ పై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని వారికి ఎటువంటి హాని కలగకుండా చూసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా సహించేది లేదని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ పాలసీ ప్రతి స్కూల్ యాజమాన్యం మరియు అధికారులందరూ తెలుసుకొని ఉండాలన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు బ్యాడ్ టచ్ గుడ్ టచ్ ల గురించి ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు పాఠశాలలు విసిట్ చేసినప్పుడు అక్కడ చిన్నారులకు అవసరమైన మరుగుదొడ్లు, పరిశుభ్రత, రన్నింగ్ వాటర్, ప్లేగ్రౌండ్స్ తదితర మౌలిక వసతులు ఉండేటట్లు కళాశాల యాజమాన్యానికి తెలియజేయాలన్నారు. విద్యార్థులు ఎటువంటి సమస్యలు తెలిపిన వెంటనే ప్రభుత్వం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేందుకు సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కొంతమంది విద్యార్థులు పరీక్షలలో ఫెయిల్ అయినప్పుడు ఆత్మహత్యలకు పాల్పడడం జరుగుతుందని అలాంటి విద్యార్థులందరికీ ఉపాధ్యాయులు మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి విజయానికి తొలి మెట్టు ఓటమిగా భావించి ముందుకు వెళ్లాలన్నారు. అలా ముందుకు వెళ్ళినప్పుడే ప్రతి ఒక్కరూ అనుకున్నది సాధించవచ్చు నన్ను విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. పిల్లల హక్కుల అమలు విషయంలో వారి రక్షణ మౌలిక సదుపాయాలు పిల్లల అభివృద్ధి పై క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతుంది అనే అంశాల పై రెండు రోజుల పర్యటనలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రైవేట్ పాఠశాలలు పరిశీలించడం జరిగిందన్నారు. ఇక్కడ గుర్తించిన లోపాలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. పిల్లల పైన ఎటువంటి సంఘటనలు జరిగిన కమిషన్ చాలా సీరియస్ గా తీసుకుంటుందని ముఖ్యంగా ఆడపిల్లల రక్షణ విషయంలో ఎటువంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. మేము ప్రతి స్కూల్ విజిట్ చేసినప్పుడు అక్కడ పిల్లలకు కొన్ని స్లిప్పులు ఇచ్చి అక్కడ జరుగుతున్న సమస్యల గురించి స్లిప్పులలో రాయించుకుని వారి పేర్లు రాయకుండా వారి నుంచి ఫీడ్బ్యాక్ సేకరించడం జరిగింది .ఈ ఫీడ్ బ్యాక్ ఆధారంగా పిల్లలకు కావలసిన రక్షణ, సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ పాఠశాలలో జరిగిన సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అధికారులు ఎన్జీవోలు కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మాయిలు చదువుపై ఆసక్తి చూపాలని, తొందరపాటు నిర్ణయాలు తీసుకుని భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకోవద్దని సూచించారు. బాల్యవివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, సామాజిక అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటాయని తెలిపారు. చట్టప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలుర కు వివాహం చేయడం నేరమని స్పష్టం చేశారు. బాల్యవివాహాల నివారణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషించాలని కమిషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ఎక్కడైనా బాల్యవివాహాల సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. పిల్లల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాజిదా బేగం, డిసిపిఓ మంజునాథ్, సిడిపిఓలు,పోలీస్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎన్జీవోలు, తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ పార్టీల సభలకు పర్మిషన్లు, దేవుడి నిమజ్జనాలకు ఆంక్షల కంచెలా

**-పార్టీల మీటింగ్‌లు, ర్యాలీలకు లేని నిబంధనలు, వినాయక ఊరేగింపులకేనా**

**- నిజంగా శబ్ద కాలుష్యమే సమస్య అయితే, అది రాజకీయ పార్టీల సభలకు వర్తించదా**

**నిజమైన సమస్యే అయితే శాశ్వతంగా నిషేధించవచ్చు కదా, పండుగలపైనే ఆంక్షలా అని ప్రశ్నల వర్షం**

**- పండుగ సంస్కృతిని, యువత ఉత్సాహాన్ని పరిగణనలోకి తీసుకోవాలంటున్న భక్తులు**

ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ ::: తెలంగాణ వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాల వేళ శోభాయాత్రలు, నిమజ్జన వేడుకల్లో సంగీత హోరుపై అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు ఇప్పుడు సర్వత్రా సరికొత్త చర్చకు దారితీస్తున్నాయి. ఖమ్మం జిల్లా సహా రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జన ఊరేగింపుల్లో డీజేల వాడకంపై పోలీసులు కఠిన నిబంధనలు విధిస్తుండటంతో స్థానిక భక్తులు, ఉత్సవ కమిటీలు, యువతలో అనేక ప్రశ్నలు మొదలవు తున్నాయి. ధ్వని కాలుష్యం, ప్రజా శాంతిభద్రతల దృష్ట్యా మండప నిర్వాహకులకు డీజే అనుమతులు ఇచ్చే ప్రసక్తే లేదని యంత్రాంగం చెబుతున్న నేపథ్యంలో, ఈ ఆంక్షల విధానం పల్లెలు, పట్టణాల్లో ఆలోచింపజేసే అంశంగా మారింది.

### -పార్టీల మీటింగ్‌లకు చట్టాలు వర్తించవా

క్షేత్రస్థాయిలో ప్రజలు, గణేష్ మండప నిర్వాహకులు ఈ వ్యవహారాన్ని చాలా నిశితంగా గమనిస్తూ సహేతుకమైన సందేహాలను తెరపైకి తెస్తున్నారు. ఎన్నికల ప్రచారాలు, రాజకీయ పార్టీల భారీ బహిరంగ సభలు, రోడ్‌షోలు, పార్టీ శ్రేణుల ర్యాలీలు జరిగినప్పుడు ఊరూవాడా దద్దరిల్లేలా మోగే డీజేలకు, భారీ సౌండ్ సిస్టమ్‌లకు లేని పరిమితులు, కేవలం భక్తుల నిమజ్జన సమయానికే ఎందుకు వర్తిస్తాయనే ప్రశ్న ఉదయిస్తోంది. రాజకీయ పార్టీల సభలకు ఒక విధానం, ఆధ్యాత్మిక ఉత్సవాలకు మరో విధానమా అనే అంశంపై భక్తులు అంతర్మథనం చెందుతూ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

### శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచించవచ్చు కదా

నిజంగా డీజేల వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బంది కలుగుతుంటే, శబ్ద కాలుష్యమే ప్రాథమిక సమస్య అయితే, ఆ ప్రభావం అన్ని సందర్భాల్లోనూ ఒకేలా ఉంటుంది కదా అని సామాన్యులు విశ్లేషిస్తున్నారు. నిజమైన ఆలోచనే ఉంటే రాజకీయ పార్టీల సభలు, భారీ ర్యాలీలు, ప్రచారాలు, ఇతర అన్ని శుభకార్యాలతో సహా అన్నింటిపైనా డీజేలను శాశ్వతంగా ఎందుకు నియంత్రించకూడదు? అనే ప్రతిపాదనను ముందుకు తెస్తున్నారు. అలా కాకుండా, కేవలం ఏడాదికి ఒక్కసారి వచ్చే భక్తుల నిమజ్జన వేళ మాత్రమే నిబంధనలను గుర్తుచేయడం ఎంతవరకు సమంజసమనే ఆలోచన ప్రతి ఒక్కరిలోనూ రేకెత్తుతోంది.

### సంస్కృతిని కాపాడుతూ సమన్వయం సాధించాలి

ఏడాదికి ఒక్కసారి ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించుకునే వినాయక నిమజ్జనాన్ని డప్పు దరువులు, డీజేల సందడితో జరుపుకోవడం కాలక్రమేణా ఒక ఆనవాయితీగా మారింది. నిబంధనల అమలు పేరుతో పండుగ ఉత్సాహం దెబ్బతినకుండా, అటు సాంప్రదాయాన్ని గౌరవిస్తూనే, ఇటు పర్యావరణ పరిరక్షణను సమన్వయం చేసే మార్గాలను పాలకులు, అధికారులు ఆలోచించాలని యువత, భక్తులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా అధికారులు ఆంక్షలు అమలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల ఆ నిబంధనలు ఆచరణకు దూరంగా ఉండిపోతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిషేధం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో యథేచ్ఛగా భారీ డీజే బాక్సులతో ఊరేగింపులు సాగుతుండటం కనిపిస్తోంది. ఇలా కొన్నిచోట్ల జరుగుతున్న పరిస్థితులపై ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తుండటంతో, అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో నిబంధనలపై అధికారులు స్పష్టతనివ్వాల్సిన అవసరం కనిపిస్తోంది.

## గుడివాడలో భారీ వర్షాలు...

## ప్రజా వేదిక నుంచి అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము టెలీకాన్ఫరెన్స్

**-విపత్తు తగ్గేవరకు యంత్రాంగమంతా సమన్వయంతో పని చేస్తూ.... అప్రమత్తంగా ఉండండి**

**-బుడమేరు వరద ఉధృతిపై ఆరా...ప్రస్తుతం ఆందోళన లేదని ఆర్. డి. ఓ. వెల్లడి**

**శానిటేషన్‌పై ఫోకస్ పెట్టండి బస్టాండ్‌లో నీరు నిలవొద్దు**

**-విద్యుత్ అంతరాయాలపై సత్వర చర్యలు తీసుకోండి... శాఖలన్నీ సమన్వయంతో పని చేయండి**

**-వర్షాలు తగ్గే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలి:ఎమ్మెల్యే రాము**

**-ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయండి.**



గుడివాడ, సెప్టెంబర్ 24 నేటి శుభోదయ: తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులతో సమీక్ష నిర్వహించారు. గుడివాడ ప్రజా వేదిక కార్యాలయం నుంచి ఆర్డీవో బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాల పరిస్థితి, తీసుకుంటున్న ముందస్తు చర్యలపై ఆరా తీశారు. నియోజకవర్గంలో కురుస్తున్న వర్షాల వివరాలను ఆర్డీవో బాలసుబ్రమణ్యం ఎమ్మెల్యే రాముకు వివరించారు. గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బుడమేరు వరద ఉధృతిపై కూడా ఎమ్మెల్యే రాము అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి అందుతున్న వరద పరిస్థితిపై అధికారులు నిరంతరం సమాచారం అందిస్తున్నారని, ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని ఆర్డీవో తెలిపారు. గుడివాడ పట్టణంలోని ఆఫీసర్స్ క్లబ్ సమీపంలో చెట్టు కూలిన ఘటన చోటుచేసుకోగా.. అధికారులు వెంటనే స్పందించి నిమిషాల వ్యవధిలోనే చెట్టును తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నట్లు సమాచారం లేదని రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కొన్ని గ్రామాల్లో ఏర్పడిన స్వల్ప విద్యుత్ అంతరాయాలను విద్యుత్ శాఖ అధికారులు వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామాల్లో చిన్నపాటి సమస్యలు తలెత్తినప్పటికీ వాటిని సత్వరమే పరిష్కరిస్తున్నామని అధికారులు వెల్లడించారు. గుడివాడలో శానిటేషన్ సమస్యలు తలేత్తకుండా తీసుకుంటున్న చర్యలను కమిషనర్ సింహాద్రి మనోహర్ మరియు మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. వర్షాలు కురుస్తున్న శానిటేషన్ సిబ్బంది విరామం లేకుండా పని చేస్తున్నారన్నారు. బస్టాండ్ లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే రాము సూచించారు. పట్టణంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే రాము చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి పెట్టాలనీ, రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత కూడా శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి తద్వారా తలెత్తే సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రంగానికి చెప్పారు. ఫీల్డ్ లో ఎక్కువమంది సిబ్బంది పనిచేశాల చర్యలు తీసుకోవాలని, తన పర్యటనలో రోడ్లపై సిబ్బంది కనిపించలేదని అధికారుల దృష్టికి ఎమ్మెల్యే రాము తీసుకువచ్చారు. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించాలన్నారు. కూటమి శ్రేణులు కూడా అప్రమత్తంగా ఉండి, అవసరమైన సమయంలో ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తారని ఎమ్మెల్యే రాము చెప్పారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వ టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని ఎమ్మెల్యే రాము ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందిన వెంటనే స్పందించేలా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.గత ఏడాది భారీ వర్షాల సమయంలో అధికారులు సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు అందించిన సేవలను ఎమ్మెల్యే రాము అభినందించారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత వర్షాలను కూడా ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండటం అభినందనీయమన్నారు.

## మత్స్యకారులు క్షేమంగా తిరిగివచ్చే వరకు నిరంతర పర్యవేక్షణ

**- గోపాల్‌పూర్ పోర్టులోకి రాష్ట్రానికి చెందిన 51 యాంత్రిక పడవలకు అనుమతి**

**- అరయపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు సురక్షితంగా చేరిన 16 పడవలు**

**- ఒడిశా అధికారులతో సమన్వయం చేసుకుంటూ రక్షణ చర్యలు**

**- పడవల యజమానులతో నిత్యం సంప్రదింపులు జరపాలని అధికారులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం**



అమరావతి, సెప్టెంబరు 24, నేటి శుభోదయ ::: బంగాళాఖాతంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన మత్స్యకారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఒడిశా మత్స్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చేపల వేట పడవలకు ఆశ్రయం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పరిస్థితులు అనుకూలించి, మత్స్యకారులు తమ ప్రాంతాలకు క్షేమంగా తిరిగివచ్చే వరకు తీరప్రాంత జిల్లాల మత్స్యశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఒడిశా అధికారుల నుంచి అందిన సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 51 యాంత్రిక పడవలను గోపాల్‌పూర్ పోర్టులోకి అనుమతించినట్లు మంత్రి వివరించారు. వీటిలో ఇంజిన్ పనిచేయకుండా నిలిచిపోయిన ఒక పడవను లాగి తీసుకువచ్చి, పోర్టులో సురక్షితంగా లంగరు వేసినట్లు తెలిపారు. అరయపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు మరో 16 పడవలు క్షేమంగా చేరుకున్నాయని పేర్కొన్నారు. పడవలను గోపాల్‌పూర్ పోర్టులోకి అనుమతించేందుకు ఒడిశా మత్స్యశాఖ అక్కడి కలెక్టర్, పోర్టు అధికారులకు సమాచారం అందించి సమన్వయం చేసిందని వివరించారు. మత్స్యశాఖ కమీషనర్, అధికారులు నివేదించిన రెండు పడవలతోపాటు వాటిలోని సిబ్బంది కూడా గోపాల్‌పూర్‌లో సురక్షితంగా ఉన్నారని మంత్రి తెలిపారు. సంబంధిత కుటుంబాలను సంప్రదించి ఈ సమాచారాన్ని తెలియజేసినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల క్షేమ సమాచారాన్ని కుటుంబాలకు ఎప్పటికప్పుడు చేరవేసి, వారికి భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. పడవల యజమానులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపాలి. ప్రతి పడవ పరిస్థితిని తెలుసుకుంటూ అవసరమైన సహాయానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలి. సముద్రంలో ప్రతికూల పరిస్థితులు తొలగిన తర్వాతే ఆయా పడవలు తమకు సంబంధించిన ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు క్షేమంగా చేరుకునేలా పర్యవేక్షించాలి అని మంత్రి స్పష్టం చేశారు. మత్స్యకారుల ప్రాణ రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తీరప్రాంత జిల్లాల అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయి సమాచారానికి అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# కర్నూలు ఎక్సైజ్ పరిధిలో 3 మద్యం షాపులకు గజెట్ నోటిఫికేషన్

**రూ.3 లక్షల దరఖాస్తు రుసుము.. అక్టోబర్ 1 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**అక్టోబర్ 5న కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా కేటాయింపు**

**ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె,చంద్రహాస్**




కర్నూలు, సెప్టెంబర్ 24:కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి గజెట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తెలిపారు. కర్నూలు రూరల్ పరిధిలో రెండు, ఓర్వకల్ మండల పరిధిలో ఒక మద్యం షాపు కలిపి మొత్తం మూడు షాపులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు.మద్యం షాపుల లైసెన్స్ కాలపరిమితి ఒక సంవత్సరంగా ఉంటుందని తెలిపారు. ఒక్కో షాపునకు సంవత్సర కాలానికి మొత్తం రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (రెట్ ) రూ.71.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు మేరకు ఈ మొత్తాన్ని నాలుగు సమాన వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉందన్నారు. ఒక్కో వాయిదాకు రూ.17,87,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.మద్యం షాపు పొందేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు రూ.3 లక్షల దరఖాస్తు ధరావతు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌తో పాటు మాన్యువల్‌గా కూడా దరఖాస్తులు సమర్పించే అవకాశం కల్పించినట్లు చెప్పారు.అక్టోబర్ 1 చివరి తేదీ దరఖాస్తులు సమర్పించేందుకు అక్టోబర్ 1, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు చంద్రహాస్ తెలిపారు. అర్హత పొందిన దరఖాస్తుదారులకు అక్టోబర్ 5, 2026న కర్నూలు జడ్పీ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానం ద్వారా మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లాటరీలో ఎంపికైన అభ్యర్థికి సంబంధిత మద్యం షాపును కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి షాపుకు తగిన సంఖ్యలో దరఖాస్తులు వచ్చేలా నిబంధనలు రూపొందించినట్లు పేర్కొన్నారు. మద్యం షాపులు పొందగోరే అభ్యర్థులు గజెట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల మేరకు బ్యాంకు గ్యారంటీ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు విధానం, అర్హతలు, ఇతర నిబంధనలు తదితర పూర్తి వివరాలను జిల్లా గజెట్ నోటిఫికేషన్‌లో పొందుపరిచినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తెలిపారు

## కర్నూలు జిల్లాలో 17 మద్యం దుకాణాలకు గజెట్ నోటిఫికేషన్

**92 దుకాణాల లైసెన్సుల పునరుద్ధరణ పూర్తి**

**అక్టోబర్ 5న లాటరీ ద్వారా ఎంపిక**

**ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎం, సుధీర్ బాబు**



కర్నూలు, సెప్టెంబర్ 24: కర్నూలు జిల్లాలో 106 మద్యం దుకాణాలకు గాను 92 దుకాణాల లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, లైసెన్సింగ్ అధికారి ఎం. సుధీర్‌బాబు తెలిపారు. లైసెన్స్ రెన్యూవల్ గడువు ముగిసిన అనంతరం మిగిలిన 14 దుకాణాలతో పాటు గతంలో మూసివేసిన మరో మూడు దుకాణాలను కలిపి మొత్తం 17 దుకాణాలకు జిల్లా కలెక్టర్ అనుమతితో గజెట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ 17 దుకాణాలకు సంబంధించి రెండు రకాల స్లాబ్‌లను నిర్ణయించినట్లు తెలిపారు. 14 దుకాణాలకు వార్షిక రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (రెట్ ) రూ.71.50 లక్షలు, మరో మూడు దుకాణాలకు రూ.60.50 లక్షలుగా నిర్ణయించినట్లు చెప్పారు. నిర్ణయించిన రెట్ మొత్తాన్ని నాలుగు సమాన వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా పర్మిట్ రూమ్ కోసం రూ.7.50 లక్షల రుసుము చెల్లించాల్సి ఉంటుందని, ఈ మొత్తాన్ని మూడు సమాన వాయిదాల్లో చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక వాయిదాకు సమానమైన మొత్తానికి బ్యాంక్ గ్యారంటీ (బిజీ ) సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 100 మీటర్ల నిబంధనలో మార్పులు సవరించిన రూల్--24 ప్రకారం ఆలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు తదితర మతపరమైన, విద్యా, వైద్య సంస్థలకు 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండేలా నిబంధనలు రూపొందించినట్లు ఎక్సైజ్ అధికారి తెలిపారు. గతంలో ఉన్న 'రేడియస్' అనే పదాన్ని తొలగించి, దూరాన్ని పాదచారులు నడిచే మార్గం ద్వారా కొలిచే విధంగా నిబంధనల్లో మార్పులు చేసినట్లు వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు మద్యం దుకాణాల లైసెన్స్ కోసం ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌తో పాటు హైబ్రిడ్, మాన్యువల్ లేదా ఆఫ్‌లైన్ విధానాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు రూ.1,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి దుకాణానికి కనీసం నాలుగు దరఖాస్తులు వచ్చే విధంగా ప్రక్రియ కొనసాగుతుందని, ఇతరుల ప్రమేయం లేకుండా దరఖాస్తుదారులు స్వతంత్రంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. అక్టోబర్ 1 అర్ధరాత్రి వరకు దరఖాస్తులు ఆసక్తి గల దరఖాస్తుదారులు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎం. సుధీర్‌బాబు తెలిపారు. అక్టోబర్ 5వ తేదీన కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో లాటరీ నిర్వహించి, జిల్లా కలెక్టర్ సమక్షంలో దుకాణాల దరఖాస్తుదారులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు

## శ్రీశైలం దేవస్థానం హుండీ ఆదాయం రూ.4.56 కోట్లు

**శ్రీశైలం దేవస్థానం హుండీ ఆదాయం రూ.4.56 కోట్లు**

**29 రోజుల్లో భక్తుల కానుకలు.. 79.6 గ్రాముల బంగారం, 3.760 కిలోల వెండి**



శ్రీశైలం, సెప్టెంబర్ 24 : శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. గురువారం నిర్వహించిన హుండీల లెక్కింపులో మొత్తం రూ.4,56,49,063 నగదు లభించినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. భక్తులు ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 23 వరకు 29 రోజుల వ్యవధిలో హుండీలలో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. నగదుతో పాటు 79 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం, 3 కిలోల 760 గ్రాముల వెండి లభించాయి.అలాగే విదేశీ కరెన్సీ కూడా హుండీలలో లభించింది. 823 అమెరికా డాలర్లు, 515 యూఏఈ దిర్హమ్స్, 93 సింగపూర్ డాలర్లు, 10 ఇంగ్లాండ్ పౌండ్లు, 5 కువైట్ దినార్లు, 45 కెనడా డాలర్లు, 50 ఆస్ట్రేలియా డాలర్లు, 20 సౌదీ రియాల్స్, 5 ఒమన్ రియాల్స్ తదితర విదేశీ కరెన్సీ లభించినట్లు అధికారులు తెలిపారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీల లెక్కింపు ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రక్రియను ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.ధర్మకర్తల మండలి సభ్యులు కోడె కాంతివర్ధిని, మేడా మురళీధర్, ప్రత్యేక ఆహ్వానితులు కట్టా సుధాకర్‌రెడ్డి లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. వివిధ విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది, శివసేవకులు హుండీల లెక్కింపులో పాల్గొన్నారు.



# త్రిశూల్‌పై సమీక్ష రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

**మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత**




నంద్యాల, సెప్టెంబర్ 24 : మహిళలు, చిన్నారుల భద్రత, రహదారి భద్రత, మత్తుపదార్థాల నిర్మూలనపై శాఖల మధ్య సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టి, వాటి అమలును క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు.నంద్యాల పట్టణంలోని జిల్లా మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి "త్రిశూల్" కార్యక్రమంపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలు, చిన్నారుల రక్షణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, గంజాయి, ఇతర మత్తుపదార్థాల నిర్మూలనకు సంబంధించి జిల్లాలో అమలవుతున్న చర్యలు, పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. ప్రతి నెలా ఉమ్మడి సమీక్షలు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మహిళా భద్రత, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నెలా ప్రత్యేక ఉమ్మడి సమీక్షలు నిర్వహించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ మూడు అంశాలను సమగ్రంగా పర్యవేక్షించే కార్యక్రమానికి "త్రిశూల్"గా నామకరణం చేసినట్లు వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి బ్లాక్‌స్పాట్ల వద్ద లైటింగ్, సూచిక బోర్డులు, రహదారి ఇంజినీరింగ్ తదితర భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత, మహిళలు--చిన్నారుల రక్షణ, మత్తుపదార్థాల నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన ప్రతి బ్లాక్‌స్పాట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి ప్రమాదాలకు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో రహదారి ఇంజినీరింగ్ మార్పులు, హెచ్చరిక బోర్డులు, లైటింగ్, కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాలు సుమారు 3 శాతం తగ్గినట్లు ఎస్పీ తెలిపారు. ఈ పురోగతిని కొనసాగిస్తూ ప్రమాదాలను మరింత తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.

శాంతిరాం ఆసుపత్రి పరిసరాల్లో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ వాహన తనిఖీల్లో పోలీసులతో సమన్వయం పెంచుకోవాలని, ప్రమాదాలకు కారణమయ్యే వాహనాలు, డ్రైవింగ్ ఉల్లంఘనలపై నిఘా పెంచాలని సూచించారు. రోడ్లపై సంచరించే మూగజీవాల వల్ల ప్రమాదాలు జరగకుండా వాటికి రేడియం కాలర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలు, తండాల్లో మహిళా భద్రతపై అవగాహన గ్రామాలు, తండాలను పోలీసులు సందర్శించి మహిళలు, బాలికలకు రక్షణ వ్యవస్థలు, చట్టపరమైన హక్కులు, ఫిర్యాదు విధానాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే మహిళల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా, సానుభూతితో వ్యవహరించి వారి సమస్యలను ఓపికగా విని పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. మత్తుపదార్థాలపై నిరంతర నిఘా పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మత్తుపదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకునేలా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. మత్తుపదార్థాల గుర్తింపు, నియంత్రణకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో అవసరమైన కిట్లు అందుబాటులో ఉంచినట్లు, వాటితో ప్రతి ఆదివారం తగిన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, ఐసీడీఎస్ పీడీ లీలావతి దేవి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, పోలీసు, రవాణా, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు



# ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అతని అనుచరులు దోపిడి పాలన చేస్తున్నారు

**వైసిపి ప్రభుత్వం లో ఐదేళ్లలో 1000 కోట్లు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసాం**

**ఐదేళ్లలో చేసిన అభివృద్ధిపై ప్రజలకు వివరిద్దాం స్థానిక ఎన్నికల్లో విజయం సాధిద్దాం**

**అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్ కుమార్ రెడ్డి**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 24 (నేటి- శుభోదయ) : అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్ఆర్‌సీపీ అనంతపురం అర్బన్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు తిప్పేస్వామి, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి.ముందుగా స్థానిక ఎన్నికలకు సంబంధించి సూచనలు, సలహాలు తెలియజేసిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సహకారంతో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అతడి అనుచరులు దోపిడీ పాలన సాగిస్తున్నారు. స్వయంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు కూడా ఎమ్మెల్యే, అనుచరుల అరాచకాల గురించి చెబుతున్నారు.వైసీపీ హయాంలో రెండేళ్లు కోవిడ్ పరిస్థితులు ఉన్నా ఎన్నడూ లేని విధంగా సంక్షేమం అందించాం. అభివృద్ధి పనులు చేశాం.అనంతపురం నగరంలోని రూ.1000 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఈ రోజు దొంగలంతా ఒక చోట చేరి సవాళ్లు విసురుతున్నారు. మా ఐదేళ్ల సంక్షేమం, అభివృద్ధి.. ఈ రెండున్నరేళ్ల అక్రమాలు, అరాచకాలపై చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం.లి పోలీసులకు మేం పర్మిషన్ అడిగితే ఎలాగూ ఇవ్వరు. ఎమ్మెల్యేనే పర్మిషన్ తీసుకుని మునిసిపల్ కార్యాలయం వద్ద అయినా.. టవర్ క్లాక్ వద్ద అయినా చర్చకు సిద్ధమవ్వాలి.ఎమ్మెల్యే, అతడి అనుచరులు తప్పులు చేశారు కాబట్టే పోలీసులు కేసులు పెట్టి జైళ్లకు పంపారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే దగ్గుపాటి దందాలు చేస్తున్నారే గానీ అభివృద్ధి చేయడం లేదు. వైసీపీ అధికారంలో ఉండగా అనంతపురం నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ, ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. గడపగడపకు ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని చేపట్టి సచివాలయాల పరిధిలోని కాలువలు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాం. మూడడుగుల రోడ్డు కూడా లేని కాలనీల్లో అభివృద్ధి పనులు జరిగాయి.గత ఎన్నికల్లో మనం చేసిన మంచిని చెప్పుకోలేకపోయాం. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో మనం చేసిన అభివృద్ధి, ప్రతి ఇంటికి అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరిద్దాం. కృషి, చిత్తశుద్ధి, ఐకమత్యంతో ముందుకెళ్దాం. అనంతపురం నగరంలోని 62 డివిజన్లతో పాటు మేయర్ స్థానాన్ని గెలుద్దాం. అందరి సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. మీ డివిజన్లలో మీరే అభ్యర్థులను నిలబెట్టుకుని గెలిపించుకోవాలి. సెలెక్ట్.. ఎలెక్ట్ అనే విధానంతో ముందుకెళ్దాం. గతంలో కార్యకర్తలను విస్మరించిన మాట వాస్తవం. ఈ విషయాన్ని మాతో పాటు అధినేత కూడా గుర్తించారు. భవిష్యత్‌లో అలాంటి పరిస్థితి ఉండదు. కార్యకర్తే అధినేత.రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల మందికి వివిధ హోదాల్లో పదవులు ఇచ్చాం. అనంతపురం నియోజకవర్గంలో 6600 మందికి పదవులు వచ్చాయి. ఇంకా ఎవరైనా ఉంటే అందరికీ పదవులు ఇచ్చి ఐడీ కార్డులు అందజేస్తాం. ఐడీ కార్డులే భవిష్యత్‌లో మీకు గుర్తింపు. ప్రతి ఒక్కరికీ గౌరవం ఐడీ కార్డుతోనే వస్తుంది. మనం అధికారంలో ఉండగా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణకు రూ.300 కోట్లు కేటాయించి సర్జికల్ బ్లాక్ మొదటి అంతస్తు వరకు నిర్మించాం. ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి ఆర్‌అండ్‌బి స్థలం ఎంపిక చేశాం. కానీ ఇప్పుడు పనులు ఆపేశారు. గుత్తి రోడ్డు నుంచి తడకలేరు వరకు.. పంగల్ రోడ్డు నుంచి బళ్లారి బైపాస్ వరకు జాతీయ రహదారులను విస్తరించాం. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఎక్కడకు వెళ్లినా గత ఐదేళ్లలో ఏం జరగలేదు.. 30 ఏళ్లుగా జరగని అభివృద్ధి చేస్తున్నాం అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. కార్పొరేటర్లుగా పనిచేసిన వాళ్లతో పాటు ఆయా డివిజన్లలోని నాయకులు, కార్యకర్తలంతా మనం ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయండి. రెండున్నరేళ్ల దోపిడీ పాలనను వివరించండి. అనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే ముఖ్యంగా ముందుకెళ్దాం. రిజర్వేషన్లు ఖరారయ్యాక మేయర్ అభ్యర్థి ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుంది.ఈసారి ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేస్తాం. కొత్తవాళ్లకు టికెట్ ఇస్తాం.పోలీసుల అక్రమ కేసులు, అరెస్టులకు ఎవరూ భయపడొద్దు. గతంలో వైఎస్ఆర్ హయాంలోనూ మేం ఎన్నికల్లో బలంగా నిలబడ్డాం. ఇప్పుడూ నిలబడతాం. ఎక్కడైనా అధికార పార్టీ నేతలకు తలొగ్గి పోలీసులు వ్యవహరిస్తే అనంత వెంకటరామిరెడ్డి ముందుటాడన్న విషయాన్ని గుర్తుంచుకోండి. నాతో పాటు మన పార్టీ నాయకులంతా మీకు అండగా ఉంటారు. ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొందాం. అధికార పార్టీ నాయకులు చెప్పినట్టే అనంతపురంలో డివిజన్ల విభజన జరిగింది. అయినా పర్వాలేదు. మనం బలంగా నిలబడి 62 స్థానాల్లోనూ విజయం సాధిద్దాం. మనలో అభిప్రాయ బేధాలు ఉండొచ్చు. గత ఎన్నికల్లో ఓడిపోయాక అందరూ బాధపడుతున్న వాళ్లమే. మళ్లీ అలాంటి పరిస్థితి రాకుండా మనమంతా ఐకమత్యంగా ఉందాం. 2029 ఎన్నికల్లో విజయానికి అనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే నాంది కావాలి.పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ...అందరి సూచనలు తీసుకునే అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఖచ్చితంగా అనంతపురం కార్పొరేషన్‌లో వైసీపీ జెండా ఎగురేద్దాం.గతంలో ఎన్నడూ లేని విధంగా అనంతపురం నియోజకవర్గంలో రూ.1045 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. ఇక్కడ అభివృద్ధి కోసం నిజాయితీగా పని చేసిన వ్యక్తి అనంత వెంకటరామిరెడ్డి. సంక్షేమం, అభివృద్ధిని అనంతపురం నగరానికి అందించిన వైసీపీ మాజీ కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్లకు ప్రత్యేక అభినందనలు. మనం చేసిన మంచిని ప్రతి ఇంటికి తీసుకెళ్లండి. చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించండి. చంద్రబాబు వెనుకబడిన ప్రాంతాలను విస్మరించి అమరావతి జపం చేస్తున్నారు. కూటమికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. కోవిడ్‌లోనే సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. గత ఎన్నికల్లో జగన్ కంటే సంక్షేమ పథకాలు ఎక్కువ ఇస్తామని చెప్పడంతో చంద్రబాబును ప్రజలు నమ్మారు. రెండున్నరేళ్లలోనే చంద్రబాబు నిజస్వరూపం బయటపడింది. తాము మోసపోయాం అని ప్రజలు గ్రహించారు.నేడు గుడివాడ ఐ. ఎం. ఎ. హాల్లో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక గుడివాడ నియోజకవర్గ ప్రజలకు 25వ తేదీన గుడివాడ నియోజకవర్గంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజలు తమకు సంబంధించిన వివిధ సమస్యలు, ఫిర్యాదులు, అభ్యర్థనలు తెలియజేసుకునే అవకాశం కలదు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించుటకు అధికారులు తగిన చర్యలు తీసుకొనబడును. కావున గుడివాడ నియోజకవర్గ ప్రజలు ఉదయం 10.30 గంటల నుండి ఐ. ఎం. ఎ హాల్ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ), గుడివాడ బస్టాండ్ ఎదురుగా రోడ్డు, గుడివాడ మండలం నందు నిర్వహించు కార్యక్రమమును గుడివాడ నియోజకవర్గంలోని సమస్త ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# హేమవతి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చి దిద్దడమే ఆర్డిటిసంస్థ ధ్యేయం

**స్పెయిన్ దేశస్థురాలు హరించ**



**అమరాపురం సెప్టెంబర్ 24**.. మండల పరిధిలోని హేమావతి గ్రామాన్ని రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మడకశిర నియోజకవర్గ కేంద్రంలోని ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రమైన శ్రీ ఎంజేరు సిద్దేశ్వర స్వామి ఆలయాన్ని, సందర్శించి తర్వాత స్పెయిన్ దేశస్తురాలైన ఆరించ ఆమె ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమనీ ఆరించ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి ఇండ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి మట్టి పాత్రలోనూ, పాత్రలోను స్టీల్ కంచెలను మాత్రమే మనం ఉపయోగించాలని, త్రాగే టీలలో ప్లాస్టిక్ గ్లాసును పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ వాటర్ బాటిలను పూర్తిగా నిషేధించాలని, వాడటం వల్ల మానవుని మీద అనేక రుగ్మతలు దాడి చేసి వ్యాధి కారకానికి గురి చేస్తోందని ఆమె ఈ సందర్భంగా కోరారు. ప్రతి గ్రామాలలోనూ ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, పాఠశాలలోనూ, కళాశాలలోనూ, అంగన్వాడి సెంటర్లలోనూ, పిల్లలకు అందించే వివిధ రకాలైన, నీళ్ల బాటలను పూర్తిగా నిషేధించాలని, ఇంటి మీద విద్యార్థిని విద్యార్థులకు గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని చెత్తాచెదారం లేకుండా ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా నిషేధించి ఆదర్శ గ్రామంగా ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు, నియోజకవర్గంలోని మూడు గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే తన దేయమని వీటి అంతటికి గ్రామస్తులు, ప్రభుత్వ అధికారులు పూర్తి సహకారం అందించాలని, ఇంకా గ్రామంలో మహిళలు తమకు గ్రామాలలో త్రాగునీటిలో అత్యధికంగా ఫ్లోరైడ్ శాతం ఉందని, మీ సహాయ సహకారాలు అందించి మనకు శుద్ధమైన వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని హేమావతి గ్రామంలో మహిళలు ఆమెను కోరారు, మేమైతే నిరుపేదలకు వివిధ రకాల సహాయ సహకారాలు మరియు ఉన్నత విద్యాను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు కాలర్ అందజేస్తామని, తల్లి, తండ్రి లేని విద్యార్థిని విద్యార్థులకు మనమే దత్తత తీసుకొని వారి యొక్క యోగక్షేమాలు వారి విద్యాభ్యాసాన్ని కొనసాగించడానికి తమ సంస్థ పూర్తి సహకరిస్తుందని వారు అక్కడున్న మహిళలకు గ్రామస్తులకు తెలియజేశారు, అదేవిధంగా మనం చేస్తున్నటువంటి సహాయ సహకారాలు అంతటిలోనూ ఇక్కడ గ్రామస్తుల పాత్ర చాలా కీలకమని మీయొక్క కృషి చాలా విలువైనదని ఇక్కడ మీ మీరు ఎంత మనకు సహాయ సహకారాలు అందిస్తే మేము అంతగా అభివృద్ధి చేయడానికి మేము ముందుంటామని ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున తెలియజేశారు, అయితే వివిధ గ్రామాలలో త్రాగునీటి సమస్య ఉన్నదని గ్రామాల నుంచి వచ్చిన మహిళలు పెద్దలు నాయకులు ఆర్డిటి సంస్థ వారి దృష్టికి తీసుకువెళ్లారు. వారు సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని తమ సంస్థ పై అధికారులకు తెలియజేసి సకాలంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. స్పెయిన్ దేశస్థురాలు సిద్దేశ్వర స్వామిని సందర్శించి ఆమె అక్కడ తీర్థ ప్రసాదాన్ని అందించారు. అదేవిధంగా ఆమె ప్లాస్టిక్ వాడకండి నిషేధించాలని హేమావతి గ్రామంలోని కిరణా షాపులను, మరియు బేకరీలను సందర్శించి వారిని ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని, అది మీ వల్లనే సాధ్యమవుతుంది ప్లాస్టిక్ వాడకం వల్ల మానవుని మీద అనేక రోగాలు క్రిమి కీటకాలు మానవుని దేహం మీద దాడి చేసి అనేక రోగాలకు గురి చేయడానికి కారకులం మనమే అవుతామని వారు షాప్ టు నుంచి షాప్ వరకు ఆమె సందర్శించి కిరాణా షాపుల యజమానులను ఆమె ఆప్యాయంగా పలకరిస్తూ మీ వల్లనే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని మీ పాత్ర చాలా కీలకమని ఆమె స్పెయిన్ దేశస్థురాలు ఆరించా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున్ ఏటిఎల్ మీనాక్షి , సి ఓ మంజునాథ్ ఎంపీడీవో రామారావు ఏపీఓ శివన్న , స్వాతి, గొల్ల మారనపల్లి ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ , రామచంద్రప్ప, సీనియర్ నాయకుడు ప్రభాకర్, మాజీ టెంపుల్ చైర్మన్ నాగరాజు, మహాలింగప్ప, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, హేమావతి గ్రామ మహిళలు, నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.